ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 25.09.2026 | సంపుటి : 13 | సంచిక : 66 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్







# ఎన్నికల కమిషన్‌పై నీలినీడలు


## ముసురుకున్న అనుమానాలు.. 14 సార్లు అభ్యంతరాలు

**దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల కమిషన్ చుట్టూ అనుమానాలు ముసురుకుంటున్నాయి. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఎన్నికల డేటా నిర్వహణ వంటి అత్యంత కీలకమైన అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు రికార్డుకావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు కథనం వెల్లడించింది.**

- సీఈసీ జ్ఞానేశ్‌పై అభిశంసనకు విపక్షాల సన్నాహాలు
- ఇద్దరు కమిషనర్ల లిఖితపూర్వక అభ్యంతరాలు వెలుగులోకి..
- 48 గంటల్లో రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్
- 'అన్నీ ఏకాభిప్రాయంతోనే' అని కమిషన్ సమర్థన

**న్యూఢిల్లీ(జనంసాక్షి)**

ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కింద ఓటర్ల జాబితాలో కొత్త పేర్ల నమోదు, ఉన్న పేర్ల తొలగింపు, తొలగించిన పేర్ల పునరుద్ధరణ, అప్పీళ్ల ప్రక్రియతోపాటు ఓటర్ల డేటాబేస్ నిర్వహణపై ఇద్దరు కమిషనర్లు ప్రశ్నలు లేవనెత్తినట్లు నివేదిక పేర్కొంది. కొన్ని నిర్ణయాలు తమకు ముందస్తు సమాచారం లేకుండానే తీసుకున్నారని వారు రికార్డుల్లో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడాన్ని కూడా వారు 'అనధికారికం, చట్టవిరుద్ధం'గా అభివర్ణించినట్లు నివేదిక వెల్లడించింది.



**డేటా కేంద్రీకరణపైనా అభ్యంతరాలు**

ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగించే సాంకేతిక వ్యవస్థపై కూడా ఇద్దరు కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఓటర్ల జాబితాపై నిర్ణయాలు తీసుకునే చట్టబద్ధ అధికారాలు రాష్ట్రస్థాయి ఎన్నికల నమోదు అధికారుల వద్ద ఉండాల్సి ఉండగా, డేటాబేస్ ప్రాప్యత క్రమంగా ఢిల్లీలోని కేంద్ర వ్యవస్థ వైపు కేంద్రీకృతమవుతోందన్న అభ్యంతరాలు నమోదైనట్లు కథనం పేర్కొంది. ఈ సాంకేతిక వ్యవస్థ భద్రత, నియంత్రణపై ఉన్న ఆందోళనలను ఇద్దరు కమిషనర్లు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించింది. ముగ్గురు సభ్యుల రాజ్యాంగబద్ధ సంస్థలో ఇద్దరు సభ్యులు వరుసగా రాతపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేయడం సాధారణ పరిపాలనా విభేదాలకు మించిన అంశంగా మారింది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల జాబితా భద్రత వంటి ఎన్నికల ప్రక్రియలోని మౌలిక అంశాలపైనే అభ్యంతరాలు నమోదైనట్లు దర్యాప్తు కథనం పేర్కొంది. గతంలో కూడా ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు నమోదైనప్పటికీ, ప్రస్తుత పరిణామాల్లో ఇద్దరు కమిషనర్లు ఒకే సమయంలో పలు కీలక అంశాలపై అభ్యంతరాలు నమోదు చేయడం ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది. అయితే ఎన్నికల కమిషన్ ఈ ఆరోపణలను మరో కోణంలో వివరిస్తోంది. మిగతా 2లో..

## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

### రాహుల్ గాంధీ డిమాండ్



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకి ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. మిగతా 2లో..



## సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'

### ఢిల్లీ మీడియా సమావేశంలో సీజేపీ ప్రతినిధులు

**న్యూఢిల్లీ (జనంసాక్షి):**



ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొంది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం మిగతా 2లో..



## దానం పిటిషన్ డిస్మిస్

### తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదు

### హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు చుక్కెదురైంది. అనర్హత వేటు విషయంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి.. మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఘర్‌వాపసీ చట్టసభ సభ్యులకు వర్తించదని.. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది.ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. దాన్ని ప్రాతిపదికగా తీసుకొని హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని తప్పుబట్టారు. గతంలో ఇలా వేరే పార్టీ నుంచి పోటీచేశారన్న కారణంతో బిహార్‌కు చెందిన మహాచంద్రప్రసాద్‌ను సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని స్పీకర్ ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. తాజాగా దానం పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసిన నేపథ్యంలో ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యం కానుంది.

### సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయం : భాజపా

## ఈ తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

### ఒక వికెట్ పడింది, మిగిలిన వారి పరిస్థితి కూడా అంతే : కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**

దానం నాగేందర్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడం, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ 'సర్' పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో స్పందించారు. 'ఒక వికెట్ పడింది, మిగిలిన వారి పరిస్థితి కూడా అంతే' అని పోస్ట్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు రాహుల్ మిగతా 2లో..

## ఉప ఎన్నికలను ఎదుర్కొంటాం

### ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా.. ప్రజల్లో నాకు బలముంది: దానం



**హైదరాబాద్(జనంసాక్షి):** ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు బలముందని మిగతా 2లో..

## ముఖ్యమంత్రి రేవంత్‌కు అరుదైన గౌరవం

- 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానం
- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు సీఎం ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు



**హైదరాబాద్(జనంసాక్షి):**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ - 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది.ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో మిగతా 2లో..



### జీహెచ్‌ఎంసీ,డీటీసీపీ,హెచ్‌ఎండీఏ అనుమతులుంటే..

## రిజిస్ట్రేషన్లకు ఓకే

### 22ఏ నిషేధిత భూములపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):**

22ఏ నిషేధిత భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీ,డీటీసీపీ హెచ్‌ఎండీఏ అనుమతి ఉంటే 22ఏ పరిధిలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.రాష్ట్ర వ్యాప్తంగా గత నెలరోజులుగా 22ఏ నిషేధిత భూముల అంశంపై వివాదం కొనసాగుతోంది. అధికారులు రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో యజమానులు ఆందోళనకు గురయ్యారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతంలో కంటే ఇప్పుడు 3.50లక్షల పైచిలుకు ఎకరాల భూమిని 22ఏలో కొత్తగా చేర్చామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, మిగతా 2లో..



### భీంరెడ్డి బినామీలపై

## ఏసీబీ పంజా



- 8 మంది అనుమానిత బినామీలను గుర్తించి వారి ఇళ్లపై సోదాలు
- భారీగా బయటపడ్డ నోట్ల కట్టలు
- రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు..
- విస్తుపోతున్న అధికారులు



**హైదరాబాద్/రాజేంద్రనగర్ (జనంసాక్షి):**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన డిఎస్పి సంకిరెడ్డి భీంరెడ్డి బినామీల ఇళ్లపై ఎసిబి అధికా రులు గురువారం దాడులు చేశారు. హైదరాబాద్, జహీరాబాద్‌లోని డిఎస్పి భీం రెడ్డి బినామీల ఇళ్లపై ఏకకాలంలో ఎసిబి అధికారులు దాడులు చేసి పెద్ద ఎత్తున ఆస్తుల పత్రాలు, రూ. 1.35కోట్ల నగదు, విదేశీ కరెన్సీ, 14లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే సమాచారం రావడంతో ఎసిబి అధికారులు జూన్ 27,2026న భీంరెడ్డి ఇళ్లు, స్నేహితులు, బినామీల ఇళ్లపై దాడులు చేసి రూ. 200కోట్ల ఆస్తులు కూడబె ట్టినట్లు కనుగొన్నారు. తర్వాత భీంరెడ్డి వాట్సాప్, డైరీలో రాసుకున్న బినామీల చిట్టా బయటికి రావడంతో మళ్లీ దాడులు నిర్వహించారు. భీంరెడ్డి పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు ఎసిబి అధికారులు పలుమార్లు నిర్వహించిన మిగతా 2లో..

### బస్ డ్రైవర్ నిర్లక్ష్యం..

## స్లీపర్ బస్సులో మంటలు

### తొమ్మిదిమంది ప్రయాణికులు సజీవదహనం

పలువురికి గాయాలు.. ● గ్రేటర్ నోయిడాలో ఘోర రోడ్డు ప్రమాదం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** గ్రేటర్ నోయిడాలో బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన బస్సు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై బస్సు ప్రయాణిస్తుండగా చెలరేగిన మంటలు.. నిమిషాల వ్యవధిలోనే మొత్తం వ్యాపించాయి. కొందరు బస్సు దూకి ప్రాణాలు దక్కించుకోగా.. ఇంకొందరు మంటల్లో మిగతా 2లో..



**నీట్-పీజీ ఫలితాలు విడుదల** 2లో..





## వానొచ్చే.. వరదొచ్చే..

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వర్ష బీభత్సం
- పొంగుతున్న వాగులు, రహదారులపై వరదనీరు
- పలు ప్రాంతాలకు నిలిచిపోయిన రాకపోకలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీ, తెలంగాణతోపాటు ఒడిశాలోని పలు జిల్లాల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆయా జిల్లాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరోవైపు రహదారులపై వరదనీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. భారీ వర్షాలకు ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి కవులూరు బ్రిడ్జి వద్ద బుడమేరు నిండి కుండలా మారింది. పైనుంచి వస్తున్న వరదతో ఎలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. పట్టిసీమ నుంచి 5,000 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. వరద ఉద్ధృతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు గంపలగూడెం మండలం వినగడప-తోటమూల మధ్య కట్టెలేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడలో నున్న వద్ద పెద్దవాగు ఉప్పొంగింది. ప్రధాన రహదారిపై వరద ఉద్ధృతికి ఓ కారు అదుపుతప్పి కొట్టుకుపోయింది. అందులో ఉన్న తెదేపా గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, ఆయన సతీమణిని

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
25.09.2026

## సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయం

హైదరాబాద్(జనంసాక్షి): దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భాజపా చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టులు, క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని విమర్శించారు. ఇకనైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉపఎన్నికకు వెళ్లాలన్నారు.

## ఈ తీర్పు కాంగ్రెస్ చెంపపెట్టు

గాంధీ, రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని విమర్శించారు. అనర్హత వేటు నుంచి తప్పించు కోవాలని దానం నాగేందర్ చూశారన్న కేటీఆర్, ఆ ప్రయత్నాన్ని సుప్రీం తిరస్కరించిందన్నారు. ఫిరాయింపుల ద్వారా ప్రజాతీర్పును తస్కరించి స్పీకర్ అండతో బయటపడవచ్చని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అనుకున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ పాలన వైఫల్యాలపై ఖైరతాబాద్ ప్రజలు త్వరలోనే తగిన తీర్పు ఇస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన దానం, అనంతరం కాంగ్రెస్ బీఫారంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేశారని, బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి స్పీకర్‌కు గతంలో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన సభాపతి ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. అనంతరం వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై అనేకసార్లు విచారణ చేసిన న్యాయస్థానం, దానం నాగేందర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఇటీవల తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంను ఆశ్రయించిన దానంకు అక్కడా చుక్కెదురైంది.

## ఉప ఎన్నికలను ఎదుర్కొంటాం

చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. "ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం" అని దానం నాగేందర్ అన్నారు.

## పుతిన్ మిమ్మల్ని యుద్ధంలో భాగం చేయకుండా చూసుకోండి

**రష్యాతో వాణిజ్యం చేసే దేశాలకు జెలెన్‌స్కీ అభ్యర్థన**

**కీవ్(జనంసాక్షి):**
నాలుగేళ్లకుపైగా రష్యా-ఉక్రెయిన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో అవి మరింత తీవ్రమైన నేపథ్యంలో భారతీయులకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ అభ్యర్థన చేశారు. మోసం, కుతంత్రాలతో భారతీయులను రష్యా ఈ యుద్ధంలోకి లాగుతోందని ఆరోపించారు. పుతిన్‌కు ఆ అవకాశాన్ని ఇవ్వొద్దని కోరారు. ఈ మేరకు ఐరాస 81వ సర్వప్రతినిధి సభ సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడారు."రష్యా ఈ యుద్ధంలో 47 దేశాల ప్రజలను ఉపయోగించుకుంటోంది. ఈ విషయం మీ అందరికీ తెలుసు. ఘనా, నేపాల్, తజికిస్థాన్, భారత్, యెమెన్, కెన్యా, క్యూబా.. ఇలా పలు దేశాల పౌరులు ఈ యుద్ధరంగంలో చనిపోవడాన్ని చూస్తున్నాం. వారంతా మోసం, కుతంత్రాలతో రష్యాలో చిక్కుకుపోయిన విదేశీయులు. ఈ దేశాల ప్రతినిధులందరితో నేరుగా మాట్లాడాలని ఉంది. మీ ప్రజలను జాగ్రత్తగా చూసుకోండి. వారు యుద్ధ క్షేత్రంలోకి వెళ్లకుండా చూడండి. పుతిన్ మిమ్మల్ని యుద్ధంలో భాగం చేయకుండా చూసుకోండి. మీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా రష్యాను అనుమతించవద్దు" అని జెలెన్‌స్కీ అభ్యర్థించారు.ఇదిలా ఉంటే.. ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా రష్యా, ఉక్రెయిన్ పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. వాటిని ఆపాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఇదే విషయాన్ని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. దీనిపైనా జెలెన్‌స్కీ స్పందిస్తూ.. రష్యాకు చెందిన పెట్రోల్, డీజిల్ వ్యవస్థలను నాశనం చేయడం తమ ఉద్దేశం కాదని అన్నారు. రష్యా దురాక్రమణకు ఆదాయ వనరులను దూరం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "రష్యాతో మీరు వాణిజ్యాన్ని కొనసాగించడం వల్ల ఈ యుద్ధం మరింత ఎక్కువకాలం జరిగే అవకాశం ఉంది" అని భారత్, చైనా వంటి దేశాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.రష్యా కౌంటర్..రష్యాతో వాణిజ్యం వద్దంటూ జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలకు పుతిన్ ప్రభుత్వం కౌంటర్ ఇచ్చింది. భారత్ వంటి దేశాలకు తమ ముడి చమురు ఎగుమతులు.. అంతర్జాతీయ మార్కెట్‌లో పశ్చిమాసియా యుద్ధ ప్రభావాన్ని తగ్గించడానికి ఉపయోగపడ్డాయని పేర్కొంది.

## భీంరెడ్డి బినామీలపై ఏసీబీ పంజా

తనిఖీల్లో గుర్తించారు.తాజాగా అతడి భార్య ఫోన్‌లో ఉన్న మరికొంతమంది బినామీల లిస్టు ఎసిబి అధికారులకు చేరింది. దాని ఆధారంగా ఎసిబి డిఎస్పి గంగసాని శ్రీధర్ నేతృత్వంతో ఎసిబి అధికారులు హైదరాబాద్, జహీరాబాద్‌లోని బినామీల ఇళ్లు కార్యాలయాలపై దాడులు చేశారు. పుప్పాలగూడ లోని భీంరెడ్డి బినామి బొమ్మ వెంకటేష్ ఇంటిలో సోదాలు నిర్వహించిన ఎసిబి అధికారులు రూ.1.35కోట్ల నగదు, విదేశీ కరెన్సీ, 14లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. విదేశీ మద్యం లభించడంతో లిక్కర్‌ను ఎక్సైజ్ సిబ్బందికి అప్పగించనున్నట్లు ఎసిబి అధికారులు పేర్కొన్నారు. భీంరెడ్డి బెయిల్‌పై విడుదలైన తర్వాత మరోసారి ఎసిబి అధికారులు దాడులు చేయడం కలకలం సృష్టించింది.

## మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక నిందితుడు అరెస్ట్

హైదరాబాద్(జనంసాక్షి): దేశంలో కలకలం సృష్టించిన మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బెట్టింగ్ యాప్ స్కామ్‌కు సంబంధించి ప్రధాన నిందితుడు అభిషేక్ కుమార్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో సీబీఐ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సమయంలో పక్కా సమాచారంతో అధికారులు అదుపులోకి తీసుకున్నారు.మహదేవ్ బుక్ ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం కార్యకలాపాలను నిర్వహించడం, బెట్టింగ్ ప్యానెల్స్‌ను సమన్వయం చేయడం, నిధులు సేకరించడం, దుబాయ్‌లో అక్రమ సంపాదనతో స్థిరాస్తులు కొనుగోలు చేయడంలో అభిషేక్ కుమార్ క్రియాశీలకంగా వ్యవహరించినట్లు సీబీఐ వెల్లడించింది.

**సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
**ఆపరేషన్: రాజేంద్రనగర్ సర్కిల్**
**టెండర్ నోటిఫికేషన్ నం.05/26-27**
కింది పనులకు అర్హత కలిగిన బిడ్డర్ల నుండి ఓపెన్ టెండర్లు కోరబడుచున్నవి. 1).సికింద్రాబాద్‌లోని కాటేదాన్‌లో ఇంటర్మీడియట్ పోల్స్‌ను ఓహెచ్ నుండి యూజీ మార్చుట. 2) బాలాపూర్ ఎస్ఎస్‌లో ఆల్టర్‌నేట్ ఫీడర్ 33/11 కేవీగా ప్రొవిజన్ చేయుట. 3) సికింద్రాబాద్ ఎండీ పల్లిలో ఓవర్‌లోడెడ్ ఫీడర్లను డైవర్షన్ చేయుట. 4) సికింద్రాబాద్‌లో రాజేంద్రనగర్ వాంబేనగర్ కాలనీలోని 11 కేవీకి సెకండ్ రన్ యూజీ కేబుల్ వేయుట.5) కొండాపూర్ సెక్షన్‌లో ఉత్తరాన్‌పల్లి 33క కేవీ ఫీడర్‌ను మరియు చౌదర్‌గూడలోని 33 కేవీ ఫీడర్‌ను ఇంటర్‌లింకింగ్ చేయుట.6) ఎస్‌డీఎన్ఆర్ రూరల్ సెక్షన్‌లో 120 కేడబ్ల్యూ, 9 ఈవీ చార్జింగ్ స్టేషన్‌కు ఈ/ఎస్ చేయుట.పైన తెలి పిన వాటికి ( దరఖాస్తులు జారీచేయు తేది : 25.09.2026 నుండి 03.10.2026 మరియు దాఖలుకు.చివరితేది: 05.10.2026 మధ్యాహ్నం 3 గం॥ల వరకు. మరియు తెరచు తేది: 06.10.2026 సా॥ 4 గం॥లకు.మిగతా వివరాలకు www.tgsouthernpower.org,,www.eprocure ment.telangana.gov.in లను సందర్శించండి.
**సం/- ఎస్ఈ/ఓపీ/ఆర్‌జేఎన్ఆర్**
**రేతిబౌలి, నానల్‌నగర్ ఎక్స్ రోడ్, హైదరాబాద్ 28**
DIPR No.8675-PP/CL/ADVT/2026-27

# ఎన్నికల కమిషన్‌పై నీలినీడలు

14 లిఖిత పూర్వక నోట్లు ఉన్న విషయాన్ని కమిషన్ తోసిపుచ్చలేదు. అయితే వాటిని నిర్ణయాలపై ఇచ్చిన సూచనలు, అభిప్రా యాలుగా పేర్కొంది. గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయంతోనే జరిగాయని స్పష్టం చేసింది.

నిర్ణయ ప్రక్రియలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని పేర్కొంది. అయితే ఫారం-6లో మార్పు ఎవరి ఆదేశాలతో జరి గింది, పశ్చిమ బెంగాల్‌లో అప్పీళ్లు ఎవరి అనుమతి తో దాఖలయ్యాయి వంటి కొన్ని ప్రశ్నలకు స్పష్టమైన వివరణ ఇవ్వలేదని తాజా నివేదిక పేర్కొంది.

**విపక్షాల దూకుడు**

ఈ పరిణామాలతో కాంగ్రెస్ సహా విపక్షాలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై మరింత దూకుడు పెంచాయి. కమిషన్ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతూ ఆయనను పదవి నుంచి తొలగించేందుకు పార్లమెంటులో తీర్మానం తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా ఇలాంటి చర్యలకు ప్రయత్నించిన నేపథ్యంలో తాజాగా మరోసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చే అంశాన్ని విపక్షాలు పరిశీలిస్తున్నాయి. సీఈసీ పదవికి రాజ్యాంగం ప్రత్యేక రక్షణ కల్పించింది. ఆర్టికల్ 324(5) ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానంలోనే తొలగించాల్సి ఉంటుంది. అంటే పార్లమెంటులో నిర్దిష్ట రాజ్యాంగ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. దీంతో విపక్షాలు తీర్మానం ప్రవేశపెట్టడం ఒక దశ అయితే, అది ఆమోదం పొందడం మరో అత్యంత కఠినమైన దశగా నిలవనుంది.

## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

జ్ఞానేశ్‌కుమార్ అప్రూవర్‌గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'

చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. "రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

## జీహెచ్ఎంసీ,డీటీసీపీ, హెచ్ఎండీఏ అనుమతులుంటే రిజిస్ట్రేషన్లకు ఒకే..

ఈ చేర్పే క్రమంలో కొంత పొరపాటు జరిగిందని తెలిపింది. ఈ క్రమంలో నిషేధిత భూములతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, ఓపెన్ ప్లాట్లు, నివాస గృహాలను కూడా అధికారులు ఈ జాబితాలో చేర్చారు. దీంతో రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. దీనిపై భూ యజమానులతో పాటు విపక్షాలు కూడా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. వీటన్నింటితో పాటు ప్రభుత్వం కూడా.. ఈ అంశంపై అధికారులతో కూలంకుషంగా చర్చించిన తర్వాత కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ముఖ్యంగా ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాల్లోని నివాస గృహాలు ఎక్కువగా 22ఏ జాబితాలో ఉన్నాయి. అక్కడ భవనాలన్నీ ప్రభుత్వ అనుమతులతోనే నిర్మాణం జరిగాయి. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వీటన్నింటికీ ఊరట లభించింది.

## ముఖ్యమంత్రి రేవంత్‌కు అరుదైన గౌరవం

వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకుఅవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగు సార్లువివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ఆర్యదాన్ ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్ గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ఆర్యదాన్ ముహమ్మద్ గుర్తింపుపొందారు.

## నీట్- పీజీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ వ్యాప్తంగా వైద్య విద్యలో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను గురువారం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ విడుదల చేసింది. ఆగస్టు 30న నిర్వహించిన నీట్- పీజీ పరీక్షకు 2,63,544 మంది హాజరు కాగా.. సెప్టెంబర్ 5న జైపూర్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు 2416మంది అభ్యర్థులు హాజరైనట్లు బోర్డు తెలిపింది. అభ్యర్థుల అప్లికేషన్ సీక్వెన్స్ నంబర్, రోల్ నంబర్, సాధించిన స్కోరు, నీట్ పీజీ 2026 ర్యాంకులతో కూడిన ప్రత్యేక జాబితాతో పాటు కటాఫ్ స్కోరును కూడా విడుదల చేసింది. అక్టోబర్ 1నుంచి అభ్యర్థులు తమ స్కోరు కార్డులను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.



## చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు

హైదరాబాద్(జనంసాక్షి): చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటివరకు సెప్టెంబర్ 25 వరకు ఉన్న గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫీల్డ్ స్థాయి అధికారులు విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయలేకపోతున్నామని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలనను పొడిగించిన గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించింది. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

## బస్ డ్రైవర్ నిర్లక్ష్యం.. స్లీపర్ బస్సులో మంటలు

చిక్కుకొని సజీవ దహనమయ్యారు. తొమ్మిది మంది మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు.స్లీపర్ బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తొలుత భావించారు. డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. బస్సు ప్రయాణం ప్రారంభించి 33 కి.మీ. దూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ క్యాబిన్ నుంచి పొగ రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. కాలుతున్న వాసన వస్తోందని డ్రైవర్, కండక్టర్‌ను అప్రమత్తం చేశారు. కానీ, వారు పట్టించుకోలేదు, బస్సు ఆపి ఎలాంటి తనిఖీ చేయలేదని వెల్లడించారు. అప్పటికి కూడా వారిద్దరూ బస్సులో సిగరెట్లు/బీడీలు తాగడం ఆపలేదు. కొద్ది నిమిషాలకే డ్రైవర్ సీట్ వద్ద ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దాంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు ఆపాలంటూ కేకలు వేశారు. అప్పటికి కూడా వారు వాహనాన్ని ఆపకపోగా.. బెదిరించారని ప్రయాణికులు వాపోయారు. ఆ తర్వాత బస్సు అంతటా వేగంగా మంటలు వ్యాపించాయి. కానీ, అప్పటికే నష్టం జరిగిపోయింది."రాత్రి సమయం కావడంతో మేమంతా నిద్రపోతున్నాం. బస్సు మంటల్లో చిక్కుకుందని కొందరు మావద్దకు వచ్చి నిద్రలేపారు. మేం వెంటనే కిందికి దిగాం. బస్సు అంతా పొగ అలముకుంది" అని మరో ప్రయాణికుడు వెల్లడించారు. "బస్సు మంటల్లో చిక్కుకున్నప్పుడు నా చేతికి ఫోన్ మాత్రమే దొరికింది. దానిని తీసుకొని కిందికి దిగాను. మిగతా వస్తువులన్నీ లోపలే కాలిపోయాయి" అని ఓ ప్రయాణికురాలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బస్సు యజమానిది మధ్యప్రదేశ్ అని పోలీసులు గుర్తించారు. ఇక ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సుపై రూ.1.75 లక్షల చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. మైనర్ ఈ వాహనాన్ని నడిపినందుకు కూడా అపరాధ రుసుం విధించారు.

## వానొచ్చే.. వరదొచ్చే..

స్థానికులు కాపాడారు. సామ్రాజ్య రిసార్ట్ వంతెన కోతకు గురైంది. ఈ వార్త చదివారా: తీవ్ర వాయుగుండం ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో ఎడతెరిపిలేకుండా వర్షాలుఏపీలో భారీ వర్షాల ప్రభావంతో పలు విమానాలను దారి మళ్లించారు. విశాఖ నుంచి విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని శంషాబాద్‌కు, హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సిన స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల పలు విమానాలు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ముందుగానే విమాన వివరాలు చెక్ చేసుకోవాలని ఎయిర్‌పోర్టు అధికారులు సూచించారు.



# 2030 నాటికి పేదరిక నిర్మూలన..


- **2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**
- **రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణకు వేగం పెంచే దిశగా కీలక నిర్ణయాలు**
- **జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌కు రూపకల్పన**
- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఆర్థిక, ప్రణాళిక శాఖల కార్యదర్శులతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘంను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను ఖఓజ నిర్వహించనుంది. 2030 నాటికి 'జీరో పావర్టీ'2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్ష్యిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థతెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు.రంగాల వారీ నిపుణుల సేవలురాష్ట్ర ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు.

## కేంద్ర అసంబద్ధ నిర్ణయం.. ఆయిల్‌పామ్ రైతులకు శరాఘాతం: తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి): ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని, రైతులను ఈ పంట వైపు మళ్లించాలని రాష్ట్రాలకు సూచిస్తూ.. మరోవైపు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు."రైతును ఆయిల్ పామ్ సాగు చేయమని ప్రోత్సహిస్తారు.. కానీ రైతు పండించిన గెలలకు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితులను మాత్రం కేంద్రం దెబ్బతీస్తోంది. ఒక చేత్తో రైతును ఆయిల్ పామ్ వైపు నడిపిస్తూ.. మరో చేత్తో దిగుమతి సుంకం తగ్గించి విదేశీ పామాయిల్‌కు మార్కెట్‌ను సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానం?" అని మంత్రి ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది. దీంతో దిగుమతి చేసుకునే పామాయిల్‌కు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు."తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరుతున్న



సమయంలో కేంద్రం సుంకాన్ని తగ్గించడం బాధ్యతారాహిత్యమైన నిర్ణయం. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో విదేశీ దిగుమతులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా కేంద్రం ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటోంది?" అని తుమ్మల ప్రశ్నించారు.ఆయిల్ పామ్ అనేది సాధారణంగా ఒక సీజన్‌లో పండించి విక్రయించే పంట కాదని, రైతు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి, నీరు, ఎరువులు, నిర్వహణ ఖర్చులు భరిస్తూ సాగు చేసే దీర్ఘకాలిక పంట అని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పంటకు మార్కెట్ ధరపై విధానపరమైన స్థిరత్వం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.' 'ఈరోజు మొక్క నాటిన రైతు రేపే పంట అమ్మడు. సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత మార్కెట్ విధానాలను మార్చేస్తే నష్టపోయేది రైతే. రైతుకు ధర భరోసా ఇవ్వకుండా, దిగుమతులకు తలుపులు మరింత విస్తరించడం రైతు ప్రయోజనాలకు విరుద్ధం" అని మంత్రి స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు.

## జూరాల ఆయకట్టుకు వారబందీతో సాగునీరు

- **నవంబర్ 27 వరకు పంటలకు విడుదల**
- **రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదే**
- **జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వం**
- **మంత్రులు జూపల్లి, వాకిటి, ఎంపీ మల్లు రవి**

వనపర్తి బ్యూరో(జనంసాక్షి):ఎల్‌నినో ప్రభావంతో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం పంటలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా జలాలను పొదుపుగా వినియోగించాలని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మాట్లాడిన అనంతరం జూరాలకు కృష్ణా జలాల విడుదల జరుగుతోందని తెలిపారు.వనపర్తి కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సాగునీరు, తాగునీటి పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం సాగు, తాగునీటి అవసరాలకు సుమారు 18.19 టీఎంసీల నీరు అవసరం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం జూరాలలో ఉన్న సుమారు 7 టీఎంసీల నీటితో పాటు కర్ణాటక నుంచి వస్తున్న జలాలు, ఇతర వరద నీటిని కలిపి అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగిస్తే వానాకాలం పంటలతో పాటు తాగునీటి అవసరాలను కూడా తీర్చుకోవచ్చని అన్నారు. రైతులకు సాగునీటిని వారాబందీ పద్ధతిలో డిస్ట్రిబ్యూటరీల వారీగా సమానంగా అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. లష్కర్లు, ఇతర సిబ్బందిని వినియోగిస్తూ ఆన్-ఆఫ్ పద్ధతిలో నీటిని క్రమబద్ధంగా విడుదల చేయాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు వారాబందీ విధానంపై రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నవంబర్ 27 వరకు వారాబందీ విధానంలో నీటిని విడుదల చేస్తేనే వానాకాలం పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. నీటి విడుదలకు అంగీకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు జిల్లా రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

**నీటి నిల్వల వివరాలు రోజూ వెల్లడించాలి**

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సాగునీటి రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. నీటి పరిస్థితులపై అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, విడుదల వివరాలను ప్రతిరోజూ మీడియాకు వెల్లడించాలని ఆదేశించారు. రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేసి, వారాబందీకి అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.సాగునీటి విడుదలకు సంబంధించి అధికారులు తీసుకునే నిర్ణయాలను వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు.

# గణేష్ నిమజ్జనం అపశృతి

**గుర్తుతెలియని వాహనం ఢీకొని కొత్తగూడెం ఎసఐ వెంకన్న మృతి**

**దుర్ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూ-టౌన్ ఎసఐ కె. వెంకన్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని వ్యాఖ్యానించారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాకుండా మొత్తం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. వెంకన్న గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాదకరమైన సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఈ ప్రమాదానికి కారణమైన నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు.

# చేతగాని ప్రభుత్వంలో నిర్వేదంలో రైతాంగం

- బీఆర్ఎస్ పార్లమెంటరీపార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర
- బీఆర్ఎస్ నాయకుల కేటీపీఎస్ సందర్శన



**పాల్వంచ (జనంసాక్షి) :** చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని,రైతాంగం నిర్వేదంతో,బాధల్లో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్,యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పాలకులపై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ.రామారావుల పిలుపు మేరకు ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన గులాబీ శ్రేణులు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ సందర్శనకు వెళ్లారు.థర్మల్ పవర్ స్టేషన్ లో బొగ్గు నిల్వలు, విద్యుదుత్పత్తికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు, రైతులు వెడుతుండగా పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు బ్యారికేడ్స్ అడ్డుపెట్టి నిలువరించారు.ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకోగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు.ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో ప్రతినిధి బృందం కేటీపీఎస్ లోపలికి వెళ్లి బొగ్గు నిల్వల్ని, విద్యుదుత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తున్న తీరును దుయ్యబట్టారు.సాగునీళ్ల,కరెంట్ సక్రమంగా సరఫరా చేస్తే పంటలు పండుతాయని, వాటిని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి వస్తుందని..వాటిని నెరవేర్చడం చేతగాకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని,రైతన్నల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కేసీఆర్ సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక బంగారుమయంగా తీర్చిదిద్దారని తెలిపారు.

# రూ. కోటి పలికిన లడ్డూ వేలం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో గణేశ్ లడ్డూ వేలం పాటలో మరోసారి భారీ ధర నమోదైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేలంలో గణపతి లడ్డూ ఏకంగా రూ.1.01 కోట్లు పలికింది. ప్రతి ఏటా పోటాపోటీగా జరిగే ఈ వేలంలో ఈసారి శక్తిమాన్ బృంద సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు.కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిటీ వాసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. ఈసారి కూడా అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన వేలంలో శక్తిమాన్ బృందం విజయం సాధించింది. గతేడాది (2025) ఇదే కమ్యూనిటీలో లడ్డూ రికార్డు స్థాయిలో రూ.2.31 కోట్లు పలకడం గమనార్హం. ఆ రికార్డుతో పోలిస్తే ఈసారి ధర తక్కువే అయినప్పటికీ, కోటి రూపాయల మార్క్‌ను దాటడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం వల్ల శుభం, ఐశ్వర్యం కలుగుతాయనే బలమైన విశ్వాసంతో భక్తులు ఎంతటి ధరకైనా వెనుకాడటం లేదు. హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాటలు కోట్లలో జరుగుతుండగా, ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే బాలాపూర్ లడ్డూ వేలంపై కేంద్రీకృతమైంది. రేపు చారిత్రక బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం జరగనుంది. 1994లో కేవలం రూ.450తో మొదలైన ఈ వేలం ప్రస్థానం, మూడు దశాబ్దాల్లో లక్షల రూపాయలకు చేరింది. గతేడాది బాలాపూర్ లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకోగా, 2024లో రూ.30.01 లక్షలు పలికింది.ఈసారి పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన బాలాపూర్ గణపయ్య లడ్డూ (21 కిలోలు) కొత్త రికార్డు సృష్టిస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. గేటెడ్ కమ్యూనిటీలలో కోట్లలో ధర పలుకుతున్న నేపథ్యంలో బాలాపూర్ లడ్డూ ఆ రికార్డులను అందుకుంటుందా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నేడొక ప్రకటనలో పేర్కొన్నారు.ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ నైతికతకు దక్కిన చారిత్రక విజయం. సత్యమేవ జయతే- ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా రాజ్యాంగానికి తలవంచాల్సిందేనని, అంతిమంగా సత్యమే గెలుస్తుందని సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి రుజువైందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు మా బీజేపీ శాసనసభా పక్షం (ఃఏఒఖ) చేసిన రాజీలేని న్యాయపోరాటం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. చట్టసభలు 'ఆయారాం, గయారాం'లకు అడ్డా కాకూడదని, 'ఘర్ వాపసీ'ల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేరని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ అహంకారానికి గట్టి చెంపపెట్టు. ఇదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టుల్లో న్యాయపోరాటాన్ని, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తామన్నారు.ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించింది. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగానికి వ్యతిరేకంగా లబ్ధి పొందాలని చూసినా న్యాయం ముందు ఎవరూ తప్పించుకోలేరని తేలిపోయిందన్నారు. రాజ్యాంగ ద్రోహానికి పాల్పడిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని, కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో తక్షణమే రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే ప్రజాతీర్పును ఎదుర్కోవాలి. దేశమంతా తిరుగుతూ చేతిలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని 'సంవిధాన్ బచావో' అని దొంగ నాటకాలాడుతున్న రాహుల్ గాంధీ, మరో పార్టీ బీ-ఫారంతో గెలిచిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చి పోటీ చేయించడం ఆయన నయవంచనకు, కపట రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు.

# అడవిలోనూ అద్భుత ప్రతిభ

## పట్టణ విద్యార్థులకు దీటుగా మామిడిగూడెం చిన్నారులు

- ఉత్తమ గురువులు విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలరు
- మామిడిగూడెం, కొమరం భీమ్‌నగర్ కాలనీల్లో నూతన పాఠశాలలను ప్రారంభించిన
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 24(జనంసాక్షి) :** మారుమూల గిరిజన గూడాల్లోని చిన్నారులకు విద్యను చేరువ చేసి, నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సమకూర్చిన 15 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, కొమరం భీమ్‌నగర్ కాలనీలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో ఏర్పాటు చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగినా ప్రతి చిన్నారికి చదువుకునే అవకాశం ఉండాలన్నారు. పాఠశాలలు, రహదారులు, విద్యుత్ సౌకర్యం లేని మారుమూల అటవీ ప్రాంతాల్లోనూ విద్యకు ఆటంకం కలగకుండా అవసరమైన చోట కంటైనర్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుత్తికోయ ఆదివాసీ గూడెమైన మామిడిగూడెంలో పరిమిత సౌకర్యాల మధ్య విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభ ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో పాటలు, కథలు, సంభాషణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారని ప్రశంసించారు. పట్టణ ప్రాంతాల విద్యార్థులకు దీటుగా గిరిజన చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఇర్ప మధు, సారంగం సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పట్టుదల కలిగిన గురువు విద్యార్థుల జీవితాలను మార్చగలరని, దేశానికి గొప్ప శాస్త్రవేత్తలు, విద్యావంతులు, ఉన్నత వ్యక్తులను అందించగల శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థుల కోసం సమయాన్ని కేటాయిస్తూ సరైన మార్గదర్శనం అందించే గురువులు వారి జీవితాల్లో శాశ్వత ముద్ర వేస్తారని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతానికి పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, విద్యాశాఖ అధికారుల కృషిని మంత్రి అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించి, వారి చదువుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మామిడిగూడెంలో త్వరలో బోరు మంజూరు చేసి తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మంజూరైన రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు పొందేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అటవీశాఖ సహకారంతో అంబులెన్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా మార్గాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు. అంతకుముందు పాఠశాల విద్యార్థులతో మంత్రి ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, తహసీల్దార్, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలి హత్య



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి ని అరెస్టు చేసినట్లుగా జిల్లా ఎస్పీ నితికా పంత్ పత్రిక ప్రకటనలో తెలిపారు. బంగారు ఆభరణాలను విక్రయించేందుకు సహకరించిన మరో ఇద్దరి ని అరెస్ట్ చేసినట్లుగా తెలిపారు. నిందితుల నుంచి 4 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,500 నగదు, రక్తపు మరకలు గల బండరాయి స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. బంగారు ఆభరణాల కోసం వృద్ధురాలిని హత్య చేసిన ఘటనలో ప్రధాన నిందితుడితో పాటు, హత్య అనంతరం బంగారు ఆభరణాలను విక్రయించేందుకు సహకరించిన మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలం బూరుగూడకు చెందిన మేకర్తి ధనుంజయ్, టీఆర్‌నగర్‌కు చెందిన నామేవత్ ప్రవీణ్, రాపర్తి మహేష్ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామానికి చెందిన మేకర్తి మల్లక్క, భర్త సాంబయ్య, వయస్సు 80 సంవత్సరాలు, గృహిణి. ఆమె తన ఇంటిలో ఒంటరిగా నివసించేది. మృతురాలు ఒంటరిగా నివసిస్తున్న విషయాన్ని ఆమెకు సమీప బంధువైన ఏ1 మేకర్తి ధనుంజయ్ గమనించాడు. మద్యం సేవించడంతో పాటు తన వ్యక్తిగత అవసరాల కోసం డబ్బు అవసరం కావడంతో, మృతురాలి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించాలని నిందితుడు పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయితే మృతురాలు తనకు బంధువు కావడంతో తనను గుర్తించే అవకాశం ఉందని భావించిన ఏ1, ఆమెను హత్య చేసి బంగారు ఆభరణాలు దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 30-08-2026 రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో మృతురాలు ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఏ1 ఆమె ఇంటిలోకి ప్రవేశించి,అక్కడ ఉన్న బండరాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం మృతురాలి వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలను తీసుకున్నాడు. ఇంటిలోని బీరువాను పగలగొట్టి ఇతర విలువైన వస్తువుల కోసం వెతికాడు.మృతురాలి మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా ఉండేలా మరో గదిలో వంట చెరకు కోసం మృతురాలు తెచ్చుకున్న కర్రలతో కప్పి అక్కడి నుంచి పరారైనట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఏ1 వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలను విక్రయించేందుకు ఏ2 నామేవత్ ప్రవీణ్ సహకరించగా,ఏ3 రాపర్తి మహేష్ వాటిని తన వద్ద ఉంచుకున్నాడు. వాటికి సంబంధించిన నగదును ఏ3 ద్వారా ఏ1 పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితుల నుంచి 4 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,500 నగదు, రక్తపు మరకలు గల బండరాయి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నేరానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, నేరాలను ఛేదించడంలో జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఆసిఫాబాద్ డీఎస్పీ బి.అశోక్,ఆసిఫాబాద్ టౌన్ సీఐ బి. రవికుమార్, ఏఎస్ఐ భోజ గౌడ్ ,కానిస్టేబుల్ ప్రేమ్ కుమార్ ,శేషారావు,సాగర్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు.

# కనుమరుగైపోయిన కస్తూర్బా గాంధీ పాఠశాల రోడ్డు



**దేవకొండ (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కి వెళ్లే ప్రధాన రహదారి వర్షాల కారణంగా పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమ యమై, పెద్ద ఎత్తున గుంతలు పడటంతో రాకపోకలు సాగించడం అత్యంత దారుణంగా మారింది. రోడ్డు నిండా నీరు, బురద పేరుకుపోవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు బురదలో చిక్కుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే చిన్న పిల్లలు ఈ బురద బాటలో నడవలేక జారిపడుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి, శాశ్వతంగా బిటి రోడ్డు లేదా సిసి రోడ్డు నిర్మించాలని దేవనకొండ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హయత్‌నగర్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కలకలం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హయత్ నగర్‌లోని అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ యూనిట్‌పై ఎల్బీనగర్, హయత్ నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్నట్లు అనుమానిస్తున్న సుమారు 730 కిలోల కల్తీ పేస్ట్‌తో పాటు గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ వ్యవహారంలో ఒకరిని అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పేస్ట్ తయారీలో స్వాధీనం చేసుకున్న ద్రావణం, ఫుడ్ కలర్ వినియోగంపై దర్యాప్తు కొనసాగుతోంది.


# డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతా దేవిపై దాడి

- జనరల్ బాడీ సమావేశంలో ఉద్రిక్తత
- చంపుతామని బెదిరింపులు.. పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తోపులాట, కేకలతో ఫిల్మ్‌ఛాంబర్ ఆవరణ ఒక్కసారిగా రణరంగంగా మారిపోవడంతో తోటి సినీ కార్మికులు, పరిశ్రమ పెద్దలు సైతంగ్భ్రాంతికి గురయ్యారు. అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతా దేవిపై కొందరు వ్యక్తులు భౌతిక దాడికి పాల్పడ్డారని, తనను చంపుతామని బెదిరించారని ఆరోపిస్తూ ఆమె బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందిరానగర్‌లోని రాఘవ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమావేశాన్ని అడ్డుకోవడంతో పాటు అసోసియేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన రికార్డులను అక్రమంగా తీసుకెళ్లేందుకు కొందరు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారని సుమలతా దేవి ఆరోపించారు. మినిట్స్ బుక్, అజెండా పత్రాలు, ఇతర ముఖ్యమైన అసోసియేషన్ రికార్డులను కొందరు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా తాను అడ్డుకున్నానని ఆమె తెలిపారు. ఈ క్రమంలో కొందరు మహిళలు, ఇతర వ్యక్తులు తనను చుట్టుముట్టి దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతో పాటు అడ్డుకునేందుకు ప్రయత్నించిన అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు ఎం. రాములు, సమిలి అనే మహిళపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు ఆరోపించారు. రఘు మాస్టర్ తరఫున ఉన్న కొందరు లేడీ డ్యాన్సర్లు తనపై పథకం ప్రకారమే మూకుమ్మడిగా దాడి చేశారని, తనను తీవ్రంగా కొట్టి అసభ్య పదజాలంతో దూషించారని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో లిఖిత, పూజిత, కళ్యాణి, సుమతి, విమల, కోకిల, మాధుర్య, శృతి, శ్రీదేవి, ఏడుకొండల శ్రీను తదితరులు పాల్గొన్నట్లు ఫిర్యాదులో సుమలతా దేవి పేర్కొన్నారు.

# నాచారంలో విద్యార్థినులపై పీఈటీ వేధింపులు

- పాఠశాల ప్రిన్సిపల్ ఫిర్యాదుతో కేసు నమోదు
- నిందితుడిని రిమాండ్ తరలించిన పోలీసులు




**నాచారం (జనంసాక్షి) :** నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థినులపై పీఈటీ, కబడ్డీ కోచ్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాల ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నాచారం ప్రధాన రహదారి సమీపంలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న ఇడపాక సురేష్‌కుమార్ (29)పై విద్యార్థినులు అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 11న పాఠశాల ప్రిన్సిపల్ నాచారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సురేష్‌కుమార్ కొంతకాలంగా అదే పాఠశాలలో క్రీడల ఉపాధ్యాయుడిగా, కబడ్డీ కోచ్‌గా, ఎన్‌సీసీ అధికారిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికలకు శిక్షణ ఇస్తున్న సమయంలో ఆయన అనుచితంగా ప్రవర్తించినట్లు విద్యార్థినులు పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ శాంతాలక్ష్మికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**బాలికల ఎంపిక ప్రక్రియలోనూ..**

ఈ నెల 9న ఉత్తరప్రదేశ్‌లో జరగాల్సిన జాతీయ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌కు 16 ఏళ్లలోపు బాలికల ఎంపిక ప్రక్రియలోనూ సురేష్‌కుమార్ అనుచితంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబితే టోర్నమెంట్‌కు వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో కొంతకాలం గోప్యంగా ఉంచినట్లు విద్యార్థినులు తెలిపినట్లు తెలిసింది. పోలీసుల సమక్షంలో ఓ బాధిత విద్యార్థిని తన వాంగ్మూలంలో పీఈటీ సురేష్‌కుమార్ అనుచితంగా తాకేవాడని, శారీరకంగా వేధించే విధంగా మాట్లాడేవాడని పేర్కొన్నట్లు తెలిసింది. క్రీడల్లో రాణించేందుకు శరీరంలోని కొవ్వు తగ్గించుకోవాలని, అందుకు తాను సహాయం చేస్తానంటూ తన మాట వినాలని ఒత్తిడి చేసేవాడని తెలిపినట్లు సమాచారం. మైనర్ బాలికల వ్యవహారం కావడంతో బాధితుల వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. పాఠశాల ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు పోక్సో చట్టంలోని సెక్షన్ 9 రెడ్‌విత్ 10తో పాటు బీఎన్ఎస్ సెక్షన్లు 78, 74 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పీఈటీ, ఎన్‌సీసీ అధికారి, కబడ్డీ కోచ్‌గా పనిచేస్తున్న ఇడపాక సురేష్‌కుమార్‌ను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
25 సెప్టెంబర్ 2026

# ఎన్నికల సంఘంపై మరో మహా ఉద్యమం?

సంపాదకీయం

ఎన్నికల ప్రక్రియపై దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్రంగా స్పందించడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు నలభై ఎనిమిది గంటల గడువు విధించడం, గడువులోగా స్పందించకపోతే దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం తాజా పరిణామాల తీవ్రతను తెలియజేస్తోంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మరో భారీ ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది.

ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ డిమాండ్‌గా కొట్టిపారేయగల పరిణామం కాదు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థపై ఇంతటి స్థాయిలో ఆరోపణలు రావడం, అదే సమయంలో ఆ సంస్థలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత పది నెలల్లో పద్నాలుగు సందర్భాల్లో వివిధ నిర్ణయాలపై లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెలుగులోకి రావడం ఆందోళన కలిగించే అంశమే. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటర్ల జాబితా నిర్వహణ, సమాచార వ్యవస్థపై నియంత్రణ వంటి కీలక విషయాల్లోనే ఈ అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనాలు పేర్కొంటున్నాయి.

ఓటు అనేది కేవలం ఒక గుర్తింపు కాదు. అది పౌరుడి ప్రజాస్వామ్య హక్కు. అర్హుడైన ఒక్క పౌరుడి పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా చూడటం ఎన్నికల వ్యవస్థ ప్రాథమిక బాధ్యత. అదే సమయంలో అనర్హుల పేర్లు, ద్వంద్వ నమోదులు, మరణించిన వారి పేర్లు వంటి వాటిని తొలగించి జాబితాను శుద్ధి చేయడం కూడా అవసరమే. కాబట్టి ఓటర్ల జాబితా సవరణ లక్ష్యంపై కాకుండా, ఆ ప్రక్రియలో పారదర్శకత, విధివిధానాలు, అభ్యంతరాలకు పరిష్కారం, అర్హులైన ఓటర్లకు రక్షణ వంటి అంశాలపైనే అసలు చర్చ జరగాలి.

ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన అంతర్గత అభ్యంతరాలు ఈ చర్చను మరింత కీలకంగా మార్చాయి. ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండానే జరిగాయని, ఓటర్ల సమాచార వ్యవస్థ కేంద్రీకృతమవుతోందని, కొన్ని మార్పులకు చట్టపరమైన ఆధారం లేదని అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. గోవాలో అర్హులుగా గుర్తించిన 97 మంది ఓటర్ల పేర్లను సాంకేతిక వ్యవస్థలో తిరిగి చేర్చేందుకు అవసరమైన మార్పు సకాలంలో జరగలేదని కూడా అదే పరిశీలనలో వెల్లడైంది.

ఇలాంటి విషయాలు నిజమైతే అవి సాధారణ పరిపాలనా లోపాలుగా మాత్రమే చూడలేం. అయితే ఆరోపణలు రావడం ఒక విషయం, అవి నిర్ధారణ కావడం మరో విషయం. అందుకే ఎన్నికల సంఘం ప్రతి అంశానికీ స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ఏ పేర్లు ఎందుకు తొలగించబడ్డాయి? ఎవరి ఆదేశాలతో తొలగించబడ్డాయి? అర్హులైన వారికి తిరిగి అవకాశం ఎలా కల్పిస్తున్నారు? ఓటర్ల సమాచారానికి ఎవరికెంత అధికారం ఉంది? కమిషనర్ల అభ్యంతరాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి ప్రశ్నలకు ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాధానాలు రావాలి. మరోవైపు ఆందోళనకు దిగుతున్న రాజకీయ, సామాజిక వర్గాలపైనా బాధ్యత ఉంది. ఎన్నికల సంఘంపై తీవ్రమైన ఆరోపణలు చేస్తే వాటికి ఆధారాలు ప్రజల ముందుంచాలి. ప్రజల్లో అనవసరమైన అనుమానాలు రేకెత్తించడం కంటే, నిర్దిష్ట ఆధారాలతో ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి ఎక్కువ మేలు చేస్తుంది. నిరసన హక్కు ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యం. ఇప్పటికే ఎన్నికల జాబితా సవరణపై వివిధ రాష్ట్రాల్లో న్యాయపరమైన పరిశీలన జరుగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తొలగింపులకు సంబంధించిన లక్షలాది అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని ఎన్నికల సంఘమే సుప్రీంకోర్టుకు తెలిపింది. ఢిల్లీ ఓటర్ల జాబితా సవరణలో జారీ చేసిన కొన్ని నోటీసుల తీరుపైనా సుప్రీంకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది.

ఈ నేపథ్యంలో మరో మహా ఉద్యమానికి పిలుపు రావడం యాదృచ్ఛిక పరిణామం కాదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై నమ్మకం దెబ్బతింటే దాని ప్రభావం ఎన్నికల సంఘానికే పరిమితం కాదు; మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థపై పడుతుంది. అందుకే ఇప్పుడు అవసరమైంది పరస్పర ఆరోపణలు కాదు నిజాలను ప్రజల ముందుంచే పారదర్శకత. ఎన్నికల సంఘం తనపై వచ్చిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ప్రశ్నిస్తున్నవారు ఆధారాలు చూపాలి. అవసరమైతే న్యాయపరమైన పరిశీలనకు పూర్తి సహకారం అందాలి. ఎన్నికలు ప్రజల తీర్పును ప్రతిబింబించాలంటే ముందుగా ప్రతి అర్హుడి ఓటు సురక్షితంగా ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ఎన్నికల సంఘం ఒక్కదాని బాధ్యత కాదు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, న్యాయవ్యవస్థ, పౌర సమాజం, మీడియా అందరూ తమ బాధ్యతను నిర్వర్తించాల్సిన సమయం ఇది. ఓటర్ల జాబితాపై ఏర్పడిన అనుమానాలకు సమాధానం దొరికితేనే ప్రజాస్వామ్యంపై విశ్వాసం మరింత బలపడుతుంది.

# నిప్పుల్లో శరీరం బూడిదైనా సర్వం వ్యాపించిన ఆలోచనలు

1600వ సంవత్సరం, ఫిబ్రవరి 17న రోమ్ నగరంలో 'కాంపో డి ఫియోరీ' అనే బహిరంగ కూడలిలో ఓ మనిషిని నగ్నంగా స్తంభానికి కట్టేసి, నాలుకపై లోహపు పలక బిగించి, కాల్చే శారు. అతనే జోర్డానో బ్రూనో. అతను దొంగా కాదు, హంతకుడూ కాదు. అతని విశ్వదృష్టి, దేవుడు ప్రకృతి గురించిన భావాలూ, ఆత్మ, క్రైస్తవ సిద్ధాంతాలపై అభిప్రాయాలూ కలిసి చర్చి విచారణలో మతద్రోహంగా తేల్చి, బ్రూనోను సజీవదహనం చేశారు. అంతేగానీ, అనంత విశ్వం గురించి అతని ఆలోచనలు మాత్రమే కారణం కాదు.



నేడు ఈ కథను చాలామంది "బ్రూనో సైన్స్ కోసం చనిపోయిన వీరుడు" అని చెప్తారు. అది పూర్తి నిజం కాదు. బ్రూనో ఎందుకు చనిపోయాడు, అతను ఏం నమ్మాడు, అతని ఆలోచనల్లో బలాలూ, బలహీనతలూ ఏమిటనేవి చరిత్రని ఆర్థిక, సామాజిక కోణంలో చూస్తేనే అర్థమవుతుంది. కేవలం "మంచి వాడు చెడ్డ చర్చి చేతుల్లో హత్యమయ్యాడు" అనే విధంగా చూస్తే, అసలు పాఠం మిస్ అవుతాం.

1548లో ఇటలీలోని నోలా అనే ఊళ్ళో బ్రూనో జన్మించాడు. భూస్వామ్య వ్యవస్థ కూలిపోతూ, కొత్త వర్తక వ్యాపార వర్గం పుట్టుకొస్తున్న కాలం. వ్యాపారం, నౌకా యాత్రలూ, బ్యాంకింగ్ పెరుగుతున్న కాలం. దీనికి తగినట్టుగా గణితం, ఖగోళ శాస్త్రం, ప్రపంచ దృష్టీ కొత్తగా అవసరం అయ్యాయి. కోపర్నికస్ అప్పటికే 'భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుంద'ని చెప్పేశాడు. ఇది కేవలం ఖగోళశాస్త్ర ఆవిష్కరణ కాదు. భూమి, మనిషి విశ్వానికి కేంద్రం అనే మధ్యయుగపు నమ్మకాన్ని కూలదోసే అంశం. ఆ నమ్మకంపై చర్చి అధికారమూ, రాజుల దైవాధికారమూ ఆధారపడి ఉన్నాయి. బ్రూనో పదిహేడేళ్ళ వయసులో నేపుల్స్ లోని డొమినికన్ మఠంలో చేరాడు. చదువులో మేధావిగా పేరు తెచ్చుకున్నా, లోపల చర్చి సిద్ధాంతాలపై అనుమానాలు పెరగసాగాయి. 1576లో మతద్రోహ విచారణ మొదలవగానే మఠం వదిలి పారిపోయాడు. ఆ తర్వాత పద్నాలుగేళ్ళు జెనీవా, పారిస్, లండన్, విటెన్‌బర్గ్, ప్రేగ్, ఫ్రాంక్‌ఫర్ట్, ఇలా యూరప్ అంతా తిరిగాడు. ఆసక్తికరమైన విషయమేంటంటే, పదహారో శతాబ్దపు తెలిసిన తత్వవేత్తల్లో కేథలిక్, కాల్వినిస్ట్, లూథరన్ అనే ఈ మూడు ప్రధాన క్రైస్తవ శాఖల నుంచి బహిష్కరణకు గురైన ఏకైక వ్యక్తి బ్రూనోనే. ఇది యాదృచ్ఛికం కాదు. ప్రతీ శాఖ తన సొంత అధికార చట్రం కాపాడుకోవడానికి తలెత్తిన ప్రతీ వ్యక్తిని అణిచేసింది. బ్రూనో ఆలోచనలు ఏ శాఖలోనూ ఇమడలేదు.

1591లో వెనిస్‌లో జియోవన్నీ మొచెనీగో అనే ప్రభువర్గ పెద్దమనిషి ఆహ్వానంతో బ్రూనో ఇటలీ తిరిగొచ్చాడు. మొచెనీగోకు బ్రూనో జ్ఞాపకశక్తి పద్ధతులు నేర్చుకోవాలని ఆశ. అవి వంటబట్టక పోవడం, బ్రూనో ఆలోచనలు తనకు ప్రమాదకరంగా అనిపించడం కారణంగా మొచెనీగో బ్రూనోను విచారణ సంఘానికి పట్టించాడు. ఇక్కడ ఆసక్తికరమైన వర్గ సంబంధాన్ని చూడొచ్చు. జ్ఞానం కోసం ప్రభువర్గ పోషకులపై ఆధారపడాల్సిన మేధావి స్వతంత్రతకు ఆ సంబంధం ఎలా పరిమితులు పెడుతుందో బ్రూనో--మొచెనీగో ఘటన చూపిస్తుంది. బ్రూనోను రోమ్‌కు అప్పగించారు. విచారణ ఏళ్ళ తరబడి సాగింది. అనంత విశ్వం గురించీ, ఆత్మ స్వభావం గురించీ తన అభిప్రాయాలు వెనక్కి తీసుకోమని కోరినా బ్రూనో ఒప్పుకోలేదు. 1600 జనవరి 20న పోప్ క్లెమెంట్ VIII అతన్ని "పశ్చాత్తాపంలేని, మొండి మత ద్రోహి"గా ప్రకటించాడు. ఫిబ్రవరి 17న సజీవదహనం చేశారు.

### బ్రూనో ఆలోచన ఏం చెప్పింది?

బ్రూనో కోపర్నికస్ సిద్ధాంతాన్ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్ళాడు. కోపర్నికస్ గ్రహాల వ్యవస్థకు సూర్యకేంద్ర నమూనాను ప్రతిపాదించినా, విశ్వం పరిమితమైనదే అనుకున్నాడు. బ్రూనో మాత్రం విశ్వానికి అంతం లేదనీ, నక్షత్రాలన్నీ దూరపు సూర్యుళ్ళనీ, వాటికి కూడా సొంత గ్రహాలు ఉండొచ్చనీ, లెక్కలేనన్ని లోకాల్లో జీవం ఉండొచ్చనీ చెప్పాడు. విశ్వానికి కేంద్రం ఏదీ లేదని వాదించాడు. ఇది శాస్త్రీయంగా చాలా ముందుచూపు ఆలోచన. కానీ, బ్రూనో ఆలోచనలు ఆధునిక ఖగోళశాస్త్రంలాగా గణిత నమూనాలతో, ప్రయోగాలతో సాగలేదు. అతను కోపర్నికస్ ఆలోచనల తాత్విక పరిణామాలను ముందుకు తీసుకెళ్లాడు. ఇది గెలీలియో పద్ధతికి పూర్తి భిన్నం. గెలీలియో టెలిస్కోప్ పెట్టి, చూసి నిరూపించడానికి ప్రయత్నించాడు. బ్రూనో ఊహా, తర్కాలతోనే అలాంటి విశ్వ రహస్యాలను చెప్పగలిగాడు. బ్రూనో ఆలోచనలో దేవుడు, ప్రకృతికి బయట ఉన్న వ్యక్తిగత శక్తిగా కాకుండా, ప్రకృతిలోనే వ్యక్తమయ్యే సూత్రంగా కనిపిస్తాడు. అందుకే, అతని తత్వాన్ని తరచుగా పాంథెయిజంతో అనుసంధానిస్తారు. చర్చి దృష్టిలో ఇది ప్రమాదకరం. ఎందుకంటే, దేవుడు ప్రపంచంలోనే ఉంటే, దేవుడికీ, చర్చి మధ్యవర్తిత్వానికీ మధ్య దూరం తగ్గిపోతుంది. చర్చి అధికారమంతా "దేవుడికీ, మనిషికీ మధ్య మేమే వారధి" అనే వాదన మీద ఆధారపడి ఉంది. బ్రూనో ఆ వారధిని అనవసరం చేశాడు. అయితే బ్రూనో పూర్తిగా భౌతికవాది కాదు. అతని ఆలోచనల్లో "జ్ఞాపకశక్తి కళ" అని ఒక పద్ధతి ఉంది. మానసిక చిత్రాలను చక్రాల్లా అమర్చి, మనసు విశ్వ నిర్మాణాన్నే ప్రతిబింబిస్తుందని నమ్మేవాడు. అలాగే హెర్మెటిక్ మార్మిక గ్రంథాల మీద నమ్మకం పెట్టుకున్నాడు. పురాతన ఈజిప్టు రుషులకన్నా, గ్రీకు తత్వశాస్త్రానికన్నా, బైబిల్‌కన్నా ముందే ఒక సార్వత్రిక జ్ఞానం తెలుసని నమ్మాడు. "సహజ మాయాజాలం" అనే భావన కూడా అతనిదే. ఇది మంత్రతంత్రాలు కాదు, విశ్వంలోని దాగిన శక్తుల మధ్య సంబంధాలను అర్థం చేసుకోవడం అని అతని వివరణ.

### మార్క్సిస్టు దృష్టితో చూస్తే...

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం అర్థం చేసుకోవాలి. బ్రూనో పోరాటం కేవలం "సైన్స్ వర్సెస్ మతం" కాదు. సామాజిక, ఆర్థిక మార్పులు జరుగుతున్న కాలం, కొత్త ఆలోచనలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్న కాలం. భూస్వామ్య సమాజంలో చర్చి కేవలం మతపరమైన సంస్థ కాదు. అది భూస్వామ్య శక్తిగా, రాజకీయ అధికారానికి భావజాల ఆధారంగా కూడా పనిచేస్తుంది. "భూమి విశ్వానికి కేంద్రం, మనిషి సృష్టి పరాకాష్ఠ, రాజు దైవాధికారంతో పాలిస్తాడు" అనే ఈ మూడు నమ్మకాలు పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. బ్రూనో మొదటి నమ్మకాన్ని కూలదోయగానే, మిగతా రెండూ కూలే ప్రమాదంలో పడ్డాయి. అందుకే, చర్చి అతన్ని కేవలం ఒక తప్పుడు ఆలోచనాపరుడిగా కాక, వ్యవస్థకే ముప్పుగా చూసింది. అదే సమయంలో వర్తకవర్గం, తయారీ పరిశ్రమలూ పెరుగుతున్నాయి. వీటికి కొత్తతరహా గణితం, నావిగేషన్ పద్ధతులూ, ఖగోళశాస్త్రం అవసరమయ్యాయి. కోపర్నికస్, గెలీలియో, బ్రూనో లాంటి వాళ్ళు తెలియకుండానే ఈ కొత్త ఆర్థిక అవసరాలకు సైద్ధాంతిక వెలుగు నిచ్చారు. అంటే, బ్రూనో వ్యక్తిగత ధైర్యంతో పాటు, అతని వెనుక ఒక చారిత్రక శక్తి కూడా పని చేసింది. అది భూస్వామ్య ప్రపంచ దృష్టిని కూలదోసి, కొత్త ప్రపంచాన్ని నిర్మించే శక్తి.

బ్రూనో పాత మతతత్వాన్ని వదిలేసినా, పూర్తి భౌతికవాదానికి చేరుకోలేదు. పాంథెయిజం, హెర్మెటిక్ మార్మికతా, జ్ఞాపకశక్తి మాయాజాలం వంటివన్నీ పాత ఆధ్యాత్మిక ఆలోచనా విధానం నుంచి పూర్తిగా విడిపోని లక్షణాలు. అతను దేవుడనే భావననే వదల్లేదు, దాన్ని ప్రకృతిలోకి కరిగించాడు అంతే. నిజమైన భౌతికవాదం రావడానికి మరో వందేళ్ళు పట్టింది, జ్ఞానోదయ కాలపు ఆలోచనాపరులూ వచ్చేంత వరకూ. బ్రూనో ఆ దారిలో ఒక ముఖ్యమైన మెట్టు మాత్రమే, గమ్యం కాదు.

### అమరవీరుడి కథ ఎవరికి ఉపయోగపడింది?

ఎంగెల్స్ "డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్"కు రాసిన పరిచయంలో పునరుజ్జీవన కాలాన్ని వర్ణిస్తూ, ఆ కాలం మానవ చరిత్రలో అతిపెద్ద విప్లవం అన్నాడు. సైన్స్ కూడా ఆ విప్లవంలో భాగంగా ఎదిగిందనీ, కొత్త తత్వశాస్త్రంతో పాటు ముందుకు సాగిందనీ, తన అమరవీరులను స్తంభానికీ, జైలుకూ అప్పగించిందనీ రాశాడు. ప్రొటెస్టెంట్లూ, కేథలిక్‌లూ ఇద్దరూ పోటీపడి సైన్స్‌ను వేటాడారని ఎంగెల్స్ చెప్తాడు. ప్రొటెస్టెంట్లు సెర్వెటస్‌ను కాల్చేస్తే, కేథలిక్‌లు బ్రూనోను కాల్చేశారు. ఆ కాలం "దిగ్గజాలను కోరింది, దిగ్గజాలను తయారు చేసింది" అంటూ ఎంగెల్స్ వ్యాఖ్యానించాడు. పంతొమ్మిదో శతాబ్దంలో బూర్జువా మేధావులూ, స్వేచ్ఛావాదులూ బ్రూనోను "స్వేచ్ఛా ఆలోచన కోసం బలైన అమరవీరుడు"గా వేడుకలు జరుపుకోవడం మొదలుపెట్టారు. అతను చనిపోయిన చోటే 1889లో కాంపో డి ఫియోరీలో అతని విగ్రహాన్ని నిలబెట్టారు. అప్పుడు ఇటలీలో చర్చి అధికారానికి వ్యతిరేకంగా లౌకిక, ఉదారవాద జాతీయవాద ఉద్యమం బలపడుతోంది. బ్రూనో వాళ్ళకు ఒక అనువైన చిహ్నం అయ్యాడు, "వ్యక్తి స్వేచ్ఛ వర్సెస్ మత నిరంకుశత్వం" అనే కథనంగా ఉపయోగపడ్డాడు. బ్రూనో పోరాటాన్ని కేవలం వ్యక్తి స్వేచ్ఛ కథగా చూపిస్తే, దాని వెనుక ఉన్న ఆర్థిక, వర్గ సంఘర్షణ మాయమైపోతుంది. కొన్ని ఉదారవాద చరిత్ర కథనాలు బ్రూనోను వ్యక్తి స్వేచ్ఛకు ప్రతీకగా మాత్రమే చూపిస్తాయి. అలా చేస్తే, అతని కాలంలోని సామాజిక, ఆర్థిక మార్పులు వెనక్కి వెళ్లిపోతాయి.

బ్రూనో కథ రెండు పాఠాలు నేర్పుతుంది. మొదటిది, ఏ కాలంలోనైనా, అధికారంలో ఉన్న వ్యవస్థ తన పునాదిని ప్రశ్నించే ఆలోచనను సహించదు. అది మతం కావొచ్చు, రాజ్యం కావొచ్చు, మార్కెట్ కావొచ్చు. ప్రశ్న అడిగే ప్రతీ మనిషినీ వ్యవస్థ మొదట వెలివేస్తుంది, తర్వాత అణిచేస్తుంది. రెండోది, ఆలోచనాపరుడి ధైర్యం ఎంత ముఖ్యమో, అతను ఏలాంటి చారిత్రక శక్తుల మధ్య నిలబడ్డాడు అనేది కూడా అంతే ముఖ్యం. బ్రూనోను కేవలం ఒక వీరుడిగా చూస్తే సరిపోదు, అతను ఏ కొత్త ప్రపంచానికి మొదటి మెట్టుగా నిలబడ్డాడో అర్థం చేసుకోవాలి. బ్రూనో కాలంలో ప్రకృతి గురించి నిజాన్ని చెప్పడం అధికారానికి సవాలుగా మారింది. నేడు శాస్త్రీయ నిజాలను వక్రీకరించే శక్తులు వేరే రూపంలో (మతతత్వ రాజకీయాల రూపంలో, కార్పొరేట్ ప్రయోజనాల రూపంలో) ఉన్నాయి. వాతావరణ మార్పు, పర్యావరణ విధ్వంసం, ప్రజారోగ్యం, సాంకేతికత విషయంలో నిజాన్ని ఎవరు నియంత్రిస్తున్నారు? దాని వల్ల ఎవరి ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి? తెలుసుకుంటే, అప్పుడే ఆ పోరాటం అర్థమవుతుంది, ఆ పోరాటంలో ఎవరి పక్షాన నిలబడాలో స్పష్టమవుతుంది.

ఆర్కే వెంకట్
(సోషల్ బ్లాగ్ రైటర్) (బ్లాగ్ : https://united-world2025.blogspot.com/) 8096480227

# ట్రంప్-షీ జిన్‌పింగ్ భేటీ - భారత దౌత్యం సామర్థ్యానికి పరీక్ష

భారత్ అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే యూరప్, జపాన్, రష్యా, పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలతోనూ సమతుల్య సంబంధాలు కొనసాగించాలి. ఇదే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అర్థం.



సెప్టెంబర్ 24న వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశం కావడం భారత్‌కు కూడా కీలక పరిణామం. అమెరికా–చైనా మధ్య శాశ్వత సయోధ్య జరుగుతుందా అన్నదానికంటే కూడా, పరస్పర పోటీ ఉన్నప్పటికీ తమ ప్రయోజనాలు కలిసే అంశాల్లో ఈ రెండు దేశాలు ఒప్పందాలు చేసుకోగలవన్నది భారత్ గుర్తించాల్సిన ముఖ్యమైన అంశం. అమెరికా – చైనా మధ్య వాణిజ్యం, సాంకేతికత, కృత్రిమ మేధస్సు, అరుదైన భూఖనిజాలు, భద్రత, తైవాన్ వంటి అంశాల్లో విభేదాలు కొనసాగుతున్నా, అవసరమైన చోట చర్చలు జరపడం అమెరికా–చైనా దౌత్యంలో ఇరు దేశాల తక్షణ వర్తక, వాణిజ్య, రక్షణ అవసరాలకు నెరవేర్చుకోవడానికి చేసే కొత్త ప్రయత్నంగా చూడాలి.

చైనా ఎదుగుదల కారణంగా అమెరికా దృష్టిలో భారత్ వ్యూహాత్మక ప్రాధాన్యం పెరిగింది. ఇండో–పసిఫిక్‌లో భారత భౌగోళిక స్థానం, భారీ మార్కెట్, రక్షణ సామర్థ్యాలు, సాంకేతిక నైపుణ్యం అమెరికా–భారత్ సంబంధాలకు బలం. 2025లో రెండు దేశాల వస్తువులు, సేవల మొత్తం వాణిజ్యం సుమారు 239.6 బిలియన్ డాలర్లకు చేరడం ఆర్థిక అనుబంధం పెరుగుతున్నదానికి సూచన. అయితే అమెరికా–చైనా ఉద్రిక్తతల వల్ల భారత్‌కు ఆటోమేటిక్‌గా శాశ్వత ప్రయోజనాలు వస్తాయని భావించడం ప్రమాదకరం.

అరుదైన భూఖనిజాలే దీనికి ఉదాహరణ. ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాలు, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలకు ఇవి కీలకం. ఈ రంగంలో చైనాకు భారీ ప్రాసెసింగ్ సామర్థ్యం ఉంది. అమెరికా చైనా నుంచి స్థిరమైన సరఫరాను పొందగలిగితే, ప్రత్యామ్నాయంగా భారత్ అవసరం కొంత తగ్గవచ్చు. అదే అమెరికా–చైనా ఘర్షణ మళ్లీ తీవ్రతరం అయితే భారత్‌కు సరఫరా గొలుసుల భాగస్వామిగా అవకాశాలు పెరగవచ్చు. కాబట్టి ఇతర దేశాల మధ్య ఘర్షణను భారత వ్యూహానికి పునాదిగా చేసుకోవడం స్థిరమైన విధానం కాదు.

అందుకే భారత్ తన సొంత కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి, ప్రాసెసింగ్ సామర్థ్యాలను పెంచుకోవాలి. కేంద్ర ప్రభుత్వం జాతీయ కీలక ఖనిజాల మిషన్ ద్వారా ఈ దిశగా చర్యలు ప్రారంభించింది. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, అధునాతన తయారీ, సైబర్ భద్రత, పరిశోధన వంటి రంగాల్లోనూ భారత్ అమెరికాకు చైనాకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా, ప్రపంచ సాంకేతిక వ్యవస్థకు స్వతంత్రంగా అవసరమైన దేశంగా ఎదగాలి.

చైనాతో రాజకీయ, భద్రతా పోటీ ఉన్నప్పటికీ ఆర్థిక పరస్పర ఆధారితత్వం మాత్రం గణనీయంగా ఉంది. 2025--26లో భారత్ చైనాకు సుమారు 19.47 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగా, 131.63 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకుంది. వాణిజ్య లోటు సుమారు 112.16 బిలియన్ డాలర్లు. ఈ గణాంకాలు రాజకీయ విభేదాలను ఆర్థిక వాస్తవాల నుంచి వేరు చేయడం ఎంత కష్టమో చూపిస్తున్నాయి.

అందువల్ల భారత్ అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే యూరప్, జపాన్, రష్యా, పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలతోనూ సమతుల్య సంబంధాలు కొనసాగించాలి. ఇదే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అర్థం. ప్రతి అంశంలో అందరితో సమాన దూరం కాకుండా, భారత ప్రయోజనాలను బట్టి భాగస్వామ్యాలను నిర్ణయించుకోవాలి.

అమెరికా–చైనా సంబంధాలు వేడెక్కినా, చల్లబడినా భారత ప్రాధాన్యం దానిపై ఆధారపడకూడదు. ఇతర దేశాల మధ్య పోటీ నుంచి తాత్కాలిక ప్రయోజనం పొందవచ్చు; కానీ శాశ్వత వ్యూహాత్మక ప్రాధాన్యతను మాత్రం భారత్ స్వయంగా నిర్మించుకోవాలి. ఆర్థిక బలం, సాంకేతిక సామర్థ్యం, సైనిక సన్నద్ధత, సరఫరా గొలుసుల్లో కీలక స్థానం, విశ్వసనీయ దౌత్యం ద్వారానే అది సాధ్యం. ట్రంప్–షీ భేటీ అమెరికా–చైనా సంబంధాల ఉష్ణోగ్రతను మార్చవచ్చు. కానీ భారతదేశ భవిష్యత్తు ప్రాధాన్యం ఆ ఉష్ణోగ్రతపై ఆధారపడకుండా చూడటమే న్యూఢిల్లీ ముందున్న అసలు వ్యూహాత్మక పరీక్ష.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496
ramkishore.1504@gmail.com

# బహుజన బంధువు, చేనేత శ్రామికుల ఆశాజ్యోతి



భారతదేశ సామాజిక శ్రేయస్సు, ఆర్థిక సమానత్వం కేవలం కొద్దిమంది పురోగతిపై ఆధారపడి లేదు, అది సమాజంలో అట్టడుగున ఉన్న బహుజనులు, వృత్తి కార్మికుల అభ్యున్నతిపైనే ఆధారపడి ఉంటుందని నమ్మిన మహోన్నత సామాజిక విప్లవకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ. ఆయన కేవలం ఒక రాజకీయ నేతగా కాకుండా, వెనుకబడిన వర్గాల (బీసీ) ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచారు.

1915 సెప్టెంబర్ 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో అమృతబాయి, కొండా లక్ష్మయ్య దంపతులకు జన్మించిన లక్ష్మణ్ బాపూజీ, పద్మశాలి సామాజిక వర్గానికి చెందినవారు. చిన్నతనం నుంచే చేనేత కార్మికుల కష్టాలను, వారి శ్రమ దోపిడీని కళ్లారా చూశారు. ఆ ప్రాంతంలోని పేద చేనేత పద్మశాలి సామాజిక వర్గంలో ఐదవ తరగతి వరకు చదువుకున్న మొదటి వ్యక్తి ఆయనే కావడం విశేషం. చేనేత కార్మికులను ఒక వ్యవస్థీకృత శక్తిగా మార్చడానికి, వారి శ్రమకు తగిన నైపుణ్యం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ఆయన అఖిల భారత పద్మశాలి సంఘం ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. 1943లో చేనేత సంక్షేమ సంఘంఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా, బద్దం ఎల్లారెడ్డి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. నిజామాబాద్ లోని మోర్తాడ్ లో, కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో పద్మశాలి కష్టనివారణ మహాసభలను నిర్వహించారు. 1950 ఫిబ్రవరి 19న హైదరాబాద్ హ్యాండ్లూమ్ వీవర్స్ సెంట్రల్ కోఆపరేటివ్ సొసైటీ (హైకో) స్థాపన బాపూజీ మేధోశక్తికి నిలువెత్తు నిదర్శనం. ఈ సహకార సంస్థ ద్వారా దళారీల దోపిడీ అరికట్టబడింది, చేనేత కుటుంబాలకు స్థిరమైన ఉపాధి లభించింది. మే 1951లో రాష్ట్ర చేనేత వస్త్రధారుల సమావేశాన్ని ఏర్పాటు చేయగా, దానికి ముఖ్య అతిథిగా వచ్చిన టంగుటూరి ప్రకాశం పంతులు బాపూజీ ఇంట్లోనే బస చేయడం విశేషం. దేశమంతటా 50కి పైగా చేనేత సహకార సంఘాలను ప్రారంభించిన ఘనత ఆయనది. సమగ్ర వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆయన అఖిల భారత వెనుకబడిన వర్గాల సంక్షేమ సంఘాన్ని (ఆలిండియా ఓబీసీ ఫెడరేషన్) స్థాపించి, దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. బీసీ రిజర్వేషన్ల కోసం 1969లో నియమించిన అనంతరామన్ కమిషన్ నివేదికలోసర్దార్ గౌతు లచ్చన్నతో కలిసి బాపూజీ ప్రముఖ పాత్ర పోషించారు. నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న బీసీ రిజర్వేషన్లకు, రాయితీలకు, వృత్తి కులాల సబ్సిడీలకు ఈ కమిషన్ నివేదికే పునాది. మంత్రిగా పనిచేసిన కాలంలో కార్మిక చట్టాల కఠిన అమలుకు, కనీస వేతనాల చట్టం రూపకల్పనకు ఆయన పట్టుబట్టారు. 2012 సెప్టెంబర్ 21న ఈ ధృవతార నేలకొరిగినప్పటికీ, కొండా లక్ష్మణ్ బాపూజీ వెనుకబడిన వర్గాల కోసం చేసిన అద్వితీయ సేవలకు కృతజ్ఞతగా, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీ ని "ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విశ్వవిద్యాలయం" అని నామకరణం చేసి ఆయన స్మృతిని చిరస్థాయిగా నిలిపింది. బాపూజీ జీవితమంతా గాంధీజీ మార్గంలో నడిచారు. పదవుల కోసం పాకులాడ లేదు. బహుజనుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ 1980లోనే గవర్నర్ పదవిని నిరాకరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయ్యేవరకు రాజకీయ పదవులు స్వీకరించనని సత్య నిష్టతో పని చేసిన మహనీయుడు. ఆయన, ఆయన బృందం తో 1990 నుండి కలిసి పని చేసిన అనుభవాలు, సాన్నిహిత్యంతో వారి ఉద్యమ ప్రస్థానం గ్రంథానికి నాతో ప్రత్యేకంగా ముందు మాట రాయించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా చలో డిల్లీ ప్రోగ్రాం వెళ్లాలి అనగానే వెంటనే స్వతంత్ర సమరయోధుల తో కలిసి యవకులను తీసుకోని పార్లమెంటులో కలవడం, జంతర్ మంతర్ దీక్ష అటు ప్రభుత్వాన్ని, ఇటు టిఆర్ఎస్ నాయకత్వాన్ని కదిలించింది అని మరిచి పోరాదు. మా దరకమే ఐక్య వేదిక నిర్మాణ దశలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడుగా అందించిన సహకారం చరిత్రాత్మకమైనది.



బిఎస్ రాములు
సామాజిక తత్వవేత్త, ఫోన్ : 8331966987

# ద్రోహుల తర్మడే దిక్కై మిలిగే..

జూరాలా... వో జూరాలా
సూస్తున్నావా జూరాలా..
గుండెల గునపం దింపిన
ద్రోహుల మర్వకే జూరాలా..


నిను వంచించిన దొంగల
చిత్రెత్తే చిందులు జూడూ..
జాతరెల్లిన జల ద్రోహుల
సొల్లు జగడం కళ్ల జూడూ..

దూప దీరక గోడాడిన నీ
నడిగడ్డ బీడు భూముల..
కడుపాకలితో అల్లాడిన
పాలమూరు దీన బిడ్డల..

ఉసురు తాకి కసువులైన
తీరొక్క జెండా లంగలెల్లా..
ఏసాల్ గట్టి ఎగుర్తున్నరు
మీసాల్ దిప్పి కుల్కవట్టిరీ..

పులుగడిగిన ముత్యాలం
మేమంటే మేమే నంటూ..
గతాన్ని దాసి గంతులేస్తూ
దూల అంటూ దుంకవట్టిరే..

నదులనే దోచిన గజదొంగల్
మందలే మింగిన తోడేళ్లూ..
పండే పొలాల పడావు జేసీ
వలససావులే దిక్కు జేసిరి..
నీళ్ల సాటున చక్రం దిప్పి



మాటుగాసిన మొసళ్ళు..
మైబునగర్ను ముక్కల్జేసీ
మన బతుక్కగ్గి పెట్టినోళ్లు..

యాపార్టైతే మనకేం వొరిగే
అన్నీ ఒకటై బతుకుల్దోసిరి..
పచ్చని సేన్లను కబ్జా జేసిరి
డ్యామ్ల పేర ఊర్లే ముంచిరి..

క్రిష్టా జలాలు ఖబ్జై పొయ్నా
నెర్రెల పొలాల గోసే పట్టదు..
ఏ నేత కిక్కడ సీమ గుట్టదు
ముద్దుల ద్యాసే విద్వరీళ్లు..

కల్వకూర్తిని కాటికి జేర్చిరి
సంగం బండ సదుగులిరిగే..
నెట్టెంపాడు నెర్రెలు బారినా
ఎత్తిపోతల గోసలే మరిసిరి..

పాలమూర్ రంగారెడ్డి పథకం
పురుటి సావుకు బలి జేసేసి..
గట్టు స్కీంను గబ్బు లింకుగ
కర్నాటకకు ముడులు గట్టిరి..
ఆర్డీఎస్ నక్కడ ఖ్వాని జేసిరి
ఇక్కడ నీకు సజీవ సమాధి..
ఏండ్లకు ఏండ్లు పాలన జేసిన
ద్రోహుల తర్మడే దిక్కై మిలిగే..



డా. ఇక్బాల్ పాషా
9440775732

## జింబాబ్వేలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**హయత్ నగర్, సెప్టెంబరు 24 (జనం సాక్షి) :** ప్రపంచవ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. జింబాబ్వే రాజధాని హరారేలోనూ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మధు దేవ్ దంపతులు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు కుంకుమార్చనతో పాటు వివిధ రకాల పూజలు నిర్వహిస్తూ భక్తులు గణపయ్యను కొలిచారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ప్రతిరోజూ పూజల అనంతరం గణపయ్య పాటలు, భజనలతో హరారే మారుమోగింది. శశికుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజున లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో బద్దం నరేష్ రెడ్డి రూ.8 లక్షలకు స్వామివారి లడ్డూను సొంతం చేసుకున్నారు. పూజా వస్త్రాన్ని ప్రశాంత్ రెడ్డి రూ.2,07,933కు దక్కించుకున్నారు. అనంతరం గణపయ్య నిమజ్జన కార్యక్రమాన్ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఆటలు, పాటలతో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## 8వ రోజుకు చేరిన ఉద్యమకారుల రిలే దీక్షలు



**అల్వాల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ముత్యాలు, అనిల్‌రాజ్, పి.రాజు, సత్తయ్య దీక్షలో కూర్చున్నారు. మాజీ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, హైదరాబాద్ జేఏసీ చైర్మన్ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాటోళ్ల సురేందర్‌రెడ్డి, పుట్నాల కృష్ణ, ఏ.డి.దయాకర్, డోలి సుధీర్, శేరుపల్లి మల్లేష్, జానకిరెడ్డి, సతీష్, నగేష్ తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు.

## ఆల్‌పెట్స్ రెండో పశువైద్య క్లినిక్ ప్రారంభం




**ఖైరతాబాద్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** నగరం లోని నల్లగండ్లలో ఆల్ పెట్స్ క్లినిక్ తన రెండో పశు వైద్య కేంద్రాన్ని ప్రముఖ నటుడు సుశాంత్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఆల్ పెట్స్ వ్యవస్థాపకు రాలు, సీఈఓ డాక్టర్ జస్లీన్ కౌర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహ-వ్యవస్థాపకులు ఎ.అరుణ్ కుమార్, ఎం.తిరుమలై తోకలసి వారు మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో సంప్రదింపులు, టీకా లు, రోగ నిర్ధారణ, చికిత్స, శస్త్రచికిత్స, ఫార్మసీ, అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఇప్పటికే 15 వేల మందికి పైగా పెంపు డు జంతువుల యజమానులకు సేవలందించిన ఆల్ పెట్స్, రాబోయే 12 నెలల్లో దక్షిణ భారత దేశంలో మరో 10 క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.దేశ వ్యాప్తంగా బహుళ-నగర పశువైద్య ఆరోగ్య సంరక్షణ నెట్ వర్క్‌ను నిర్మించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు.

## పవర్ లిఫ్టర్ అజయ్ బెనర్జీకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందనలు



**ఉప్పల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించిన మల్లాపూర్‌కు చెందిన పవర్ లిఫ్టర్ అజయ్ బెనర్జీని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అజయ్ బెనర్జీ సాధించిన విజయాలు మల్లాపూర్ ప్రాంతానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడి దేశానికి పతకాలు సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగితే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులు కావాలని, క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పవర్ లిఫ్టింగ్‌లో అజయ్ బెనర్జీ తన విజయాల పరంపరను కొనసాగిస్తూ రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అజయ్ బెనర్జీకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సాయి జెన్ శేఖర్ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుల్మోహర్ గార్డెన్స్ జీ బ్లాక్ వాసులు ఎండీ ఉస్మాన్, దుర్గాప్రసాద్, అధ్యక్షుడు ధనాంజయ్ కులకర్ణి, లక్ష్మీ చరణ్, నూతన లక్ష్మీ, ప్రభాకర్, ముఖేష్ అగర్వాల్, సంజీత్, పవన్ శర్మ, వంశీకృష్ణతో పాటు స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, లింగాల రాజేష్ గౌడ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన గళమెత్తిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** మూసీ పరీవాహక అభివృద్ధి పథకంలో భాగంగా భూముల స్వాధీనానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 240పై ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తమ భూములను స్వాధీనం చేసుకోవద్దని, ఎలాంటి పరిహారం కూడా తమకు అవసరం లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రైతులతో కలిసి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని కలిశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. "మా భూములు మాకు కావాలి.. ఎలాంటి పరిహారం వద్దు.. జీఓ 240 వద్దు" అంటూ తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న భూములు, తమ జీవనోపాధికి ఆధారంగా ఉన్న ఆస్తులను కోల్పోయే పరిస్థితి రావద్దని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించారు. రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోకుండా వారి ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్‌ను కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సమయంలో స్థానిక రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. భూముల స్వాధీనంపై రైతుల్లో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి



చేశారు.

### రైతులకు పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వాలి

మూసీ నదికి సుమారు కిలోమీటర్ పరిధిలోని భూముల స్వాధీనం అంశంపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని ఎమ్మెల్యే కోరారు. జీఓ 240 పరిధిలో ఏ ప్రాంతాలు వస్తాయి, ఏ రకమైన భూములను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది, భూముల విషయంలో ప్రభుత్వం అనుసరించనున్న విధానం ఏమిటనే అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చిన్నచిన్న కమతాలు కలిగిన రైతులు, ఇప్పటికే నివాస ప్రాంతాలు ఏర్పడిన భూముల యజమానులు, ఖాళీ స్థలాలు కలిగిన రైతుల విషయంలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను స్పష్టంగా ప్రకటించాలని కోరారు. భూముల స్వాధీనంపై స్పష్టత లేకపోవడం వల్ల రైతుల్లో ఆందోళన నెలకొంటోందని, ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం అధికారికంగా వివరాలు వెల్లడించాలని సూచించారు.

### రైతుల ప్రయోజనాలను కాపాడాలి

రైతుల భూములు, వారి జీవనోపాధి, ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా చిన్న కమతాలు కలిగిన రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జీఓ 240పై రైతుల్లో నెలకొన్న సందేహాలు, ఆందోళనలను ప్రభుత్వం నివృత్తి చేయాలని, భూముల స్వాధీనానికి సంబంధించి స్పష్టమైన సమాచారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వారికి నష్టం కలగకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రైతుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, భూముల విషయంలో స్పష్టత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల తరఫున వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## డిజిటల్ క్రాప్ సర్వే రైతు నమోదును వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి. చంద్రరెడ్డి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** వ్యవసాయ రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే, రైతు నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. చంద్రరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ, సివిల్ సప్లైస్, మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అక్టోబర్ ఒకటి నుండి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నెల 30 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించినరూ. 500 బోనస్ కేవలం ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాల సన్న వరి పంటలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్15048, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూ జి ఎల్ 44. ఈ బోనస్ అందాలంటే ధాన్యం కొనుగోలు ప్రక్రియలో డిజిటల్ క్రాప్ సర్వే డేటా అత్యంత కీలకమని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా



అందే సబ్సిడీలను పొందడానికి, ఎరువుల కొనుగోలు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవడానికి ప్రతి రైతుకు ప్రత్యేక రైతు నమోదు సంఖ్య తప్పనిసరని వెల్లడించారు. ప్రతి గ్రామంలో మీసేవ, సీఎస్సీ ఆపరేటర్ల భాగస్వామ్యంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో చాటింపు వేయించి, ఫ్లెక్సీల ద్వారా రైతులందరికీ విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సుజాత, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎస్. స్వర్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మీసేవ మరియు సీఎస్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నక్కగుట్ట తండాలో పేకాట స్థావరంపై దాడి

- 9 మంది అరెస్ట్

**యాచారం, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** విశ్వసనీయ సమాచారం మేరకు యాచారం పోలీసులు మంగళవారం రాత్రి 7.30 గంటలకు పేకాట స్థావరంపై దాడి చేశారు.ఎస్ఐ ప్రియాంక తన సిబ్బంది తో కలసి నక్కగుట్ట తండా శివార్లలోని సెంచరీ గార్డెన్ సమీపంలో ఉన్న కోళ్ల ఫారం పై దాడి నిర్వహించారు. అక్కడ 9 మంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు.నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 3 సెట్ల పేక ముక్కలు, 23,990 రూపాయల నగదు, 9 మొబైల్ ఫోన్లు, 73,500 రూపాయల ఆన్లైన్ లావాదేవీలను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**వనపర్తి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి మండలం నాగవరం శివారులోని ఎస్సీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్.. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, నాణ్యత, రుచికరత, పరిశుభ్రత వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, విద్యా సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా, మౌలిక వసతులు సక్రమంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన ఖీమ్యా నాయక్ అక్కడి వసతులను పరిశీలించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నూతన ఫర్నిచర్‌ను పరిశీలించి, పాఠకులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠకులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేట ట్రాన్సిట్ హోంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్‌జైలులో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాస్‌పోర్టు గడువు ముగియడం, ఇతర కారణాలతో దేశంలో ఉండాల్సి వచ్చిన విదేశీయులను వారి స్వదేశాలకు పంపించే వరకు ట్రాన్సిట్ హోంలో ఉంచుతున్నట్లు ఎస్పీ తెలిపారు. విదేశీయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన



వసతులు కల్పించాలని, నిబంధనల ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం పరిసరాల్లో భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.తనిఖీలో జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్

**చేర్యాల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** జిల్లా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినేతల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్య రంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ విద్యారంగా అభివృద్ధికి అనేక నిధులు కేటాయిస్తామని చెప్పి ఇప్పటివరకు చెప్పిన మాటలను నెరవేర్చలేదు, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యాశాఖ పూర్తిస్థాయిలో గాడి తప్పిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యదర్శి అందే బీరయ్య మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసిన స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్ ఇవ్వకుండా




ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని దుయపట్టారు. విద్యాశాఖ పై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియమించి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలని, విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత మేరకు నిధులు చేకూర్చిందో దానిపై పూర్తిస్థాయి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, తాళ్లపల్లి గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్‌సిటీలో స్పోర్ట్స్, స్కిల్ యూనివర్సిటీ

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడాపోటీలు
- ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్

**రంగారెడ్డి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలను ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరేడ్ మార్చ్‌తో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల గౌరవవందనం స్వీకరించిన అనంతరం మల్ రెడ్డి రంగారెడ్డి జెండా ఊపి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాశ్వత మార్పు విద్యతోనే సాధ్యమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మారుమూల ప్రాంతాలు, అట్టడుగు వర్గాల విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఫ్యూచర్‌సిటీలో స్పోర్ట్స్, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యా విప్లవానికి ఆరుట్ల నుంచే శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌పై కన్న కలలను సాకారం చేసేలా విద్యార్థులు కష్టపడి చదువుతూ, క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి పలు విజ్ఞప్తులను స్వీకరించారు. క్రీడాకారులకు అవసరమైన స్పోర్ట్స్ యూనిఫాం,




ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఆర్టీఓ శ్రీనివాస్ రెడ్డి, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## దానం నాగేందర్‌కు సుప్రీం తీర్పు చెంపపెట్టు



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** బండ్లగూడ జాగీర్: ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌పై అనర్హత వేటు సబబేనని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమని బండ్లగూడ జాగీర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు అన్నారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి బండ్లగూడ చౌరస్తాలో మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా దానం నాగేందర్ తన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ భవిష్యత్తులో చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు శాంతి నాయక్, సంతోష్, ఉదయ్ గౌడ్, చందు నాగరాజ్, యాదగిరి, పరుశురాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సెయింట్ థామస్ విద్యార్థుల ఎంపిక



**వనపర్తి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** వనపర్తి పట్టణంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల వనపర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలకు చెందిన అరుణ్, రోహిత్ ప్రతిభ కనబరిచారు. అండర్--16 జావెలిన్ త్రో విభాగంలో అరుణ్, లాంగ్ జంప్ విభాగంలో రోహిత్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించనున్న 12వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్--2026లో అరుణ్, రోహిత్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలతో పాటు వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అరుణ్, రోహిత్‌లను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## పేద విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

- మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం స్థానిక చెంచువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత బూట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, ఎంఈఓ జయరాములు, ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలతో పాటు ఉచితంగా బూట్లు అందజేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ పెబ్బేరు కాంప్లెక్స్ హెచ్ ఎం నరసింహ గౌడ్, వార్డు కౌన్సిలర్ శివసాయి, పట్టణ అధ్యక్షులు కొంత దయాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.చిన్న రాములు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పార్వతీ ఉపాధ్యాయులు రాధ, కృష్ణవేణి,పుష్పవతి, పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



**మల్దకల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారంబాలల హక్కులు,బాల్యవివాహాలు, పోషణమాసం,సఖి సెంటర్లో అందించే సేవలు బేటి బచావో బేటి పడావో , సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పిల్లలందరూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అందరూ మంచిగా చదువుకోవాలని సూచించారు. చిన్న వయసులో బాల్య వివాహము చేసుకోవడం ద్వారా వచ్చే నష్టాలు గురించి బాలల పరిరక్షణ ప్రతినిధి పద్మ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ లక్ష్మి,డిహెచ్ యు డబ్ల్యూ చిట్టి,సఖిసెంటర్ కౌన్సిలర్ స్వాతి,ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ, గ్రామ సర్పంచ్ భగవంతు, హెడ్మాస్టర్ క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాచిరెడ్డిపల్లి రోడ్డుపై జర్నీ డేంజర్..!

- అదుపు తప్పితే అంతే..
- శిథిలమైన కల్వర్టు.. కూలుతున్న రహదారి అంచులు
- చిన్న నిర్లక్ష్యం.. పెద్ద ప్రమాదానికి దారితీసే పరిస్థితి
- రాత్రివేళల్లో మరింత డేంజర్.. హెచ్చరిక బోర్డులు కరువు
- కొమ్మలు, రాళ్లతోనే ప్రమాద నివారణ చర్యలా? అధికారులు స్పందించేది ప్రమాదం జరిగిన తర్వాతేనా..?

**కోహీర్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నుంచి మాచిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. రహదారి పక్కన ఉన్న కల్వర్టు పలుచోట్ల దెబ్బతిని శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. రహదారి పరిస్థితి చూస్తే "అదుపు తప్పితే అంతే.." అన్నట్టుగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కల్వర్టుపై గుంతలు.. అంచుల్లో కూల్చివేత

కల్వర్టు పైభాగంలోని సిమెంట్ పలకలు, రాళ్లు దెబ్బతినడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు రహదారి అంచులు కూడా క్రమంగా కూలిపోతున్నాయి. వాహనం కొద్దిగా అంచు వైపు వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ఈ మార్గం గండంగా మారిందని అంటున్నారు.

### వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో సమస్య మరింత తీవ్రమవుతోంది. కల్వర్టు కింద నుంచి నీరు ప్రవహించే సమయంలో మట్టి



కొట్టుకుపోవడంతో రహదారి అంచులు బలహీనపడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షం తర్వాత గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు కూడా సరిగా కనిపించక వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### రాత్రివేళల్లో 'డేంజర్ జోన్'

పగటిపూట పరిస్థితిని గమనిస్తూ వాహనదారులు జాగ్రత్తగా వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ రాత్రివేళల్లో ప్రమాదం మరింత పెరుగుతోంది. ప్రమాదకర ప్రాంతంలో స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు లేకపోవడంతో కొత్తగా ఈ మార్గంలో వెళ్లేవారికి ప్రమాద ప్రాంతం గుర్తించడం కష్టంగా మారుతోంది. దీంతో చిన్నపాటి పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

### కొమ్మలు.. రాళ్లే హెచ్చరిక బోర్డులా..?

కల్వర్టు వద్ద ప్రమాదాన్ని గుర్తించేందుకు కొమ్మలు, రాళ్లు ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులను అప్రమత్తం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇవి తాత్కాలిక చర్యలేనని స్థానికులు చెబుతున్నారు. ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండే రహదారిపై శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

### ప్రమాదం జరిగే వరకు ఎదురుచూపులా..?

స్థానికులు పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు పరిస్థితి మరింత దిగజారేలోపు అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా మరమ్మతులు చేపట్టడం కంటే.. ముందుగానే చర్యలు తీసుకుంటేనే ప్రజల ప్రాణాలకు రక్షణ ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

### రహదారి అంచులకు రక్షణ కల్పించాలి

కల్వర్టు దెబ్బతిన్న భాగాలను పూర్తిగా తొలగించి నాణ్యమైన నిర్మాణంతో పునర్నిర్మించాలని, ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి అంచులను పటిష్టం చేయడంతో పాటు వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా తగిన డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

### తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

శాశ్వత మరమ్మతులు పూర్తయ్యే వరకు కనీసం ప్రమాద ప్రాంతానికి ఇరువైపులా స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాద ప్రాంతం స్పష్టంగా కనిపించేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఇకనైనా అధికారుల చూపు పడేనా..?

మాచిరెడ్డిపల్లి రహదారిపై నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో కల్వర్టు సమస్యను చిన్నదిగా చూడకుండా అధికారులు అత్యవసరంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకోవాలి" అని వారు స్పష్టం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కల్వర్టు, రహదారి మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వయోవృద్ధుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి

- జిల్లా ఎస్పీ సునీత రెడ్డి

**వనపర్తి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి సూచించారు. అక్టోబర్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా గురువారం వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీత రెడ్డి లిలి'వయోవృద్ధుల సమాచార సంచిక'లిలితో పాటు 'తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం--2007'లిలికు సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. అలాగే వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, ప్రభుత్వ సేవలు, చట్టపరమైన రక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేయనున్న ప్రదర్శన బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై వయోవృద్ధులు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




వయోవృద్ధులు తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు, చట్టపరమైన హక్కులను వినియోగించుకునేలా అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి భాస్కర్ నాయక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రామ మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేవల్లి జెడ్పీహెచ్ఎస్ లో 9వ తరగతి విద్యార్థికి గాయం

- డీఈఓ కి బీఎస్పీ ఫిర్యాదు

**రేవల్లి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** రేవల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థికి గాయమైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఎస్పీ వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన డీఈఓకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు. తేదీ 23/09/2026న పాఠశాలలో జరిగిన ఘటనలో 9వ తరగతి విద్యార్థి తలకు గాయమై, చికిత్స సమయంలో రెండు కుట్లు పడినట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు, పరిస్థితులు మరియు బాధ్యత ఎవరిది అనే అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని, వెంటనే నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు. విద్యార్థి, తల్లిదండ్రులు, సంబంధిత ఉపాధ్యాయులు మరియు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. విచారణలో ఎవరి తప్పిదం ఉన్నా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, గాయపడిన విద్యార్థికి



అవసరమైన వైద్య సహాయం, భద్రత అందేలా చూడాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓ ని కోరారు. విచారణ ఫలితాలను బాధిత కుటుంబానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేవల్లి సెక్టార్ కార్యదర్శి అంకురి రాము, బండరాయిపాకుల బూత్ అధ్యక్షులు యాదగిరి, తల్పునూర్ బూత్ కమిటీ అధ్యక్షులు తప్పెట గోవర్ధన్, కల్మూరి కిరణ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.గురువారం నాగర్ కర్నూల్ వంగూరు మండలంలోని వంగూరు, పోల్కంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ సభ్యు లు , సబ్ కలెక్టర్ సలోని చాబ్రా లతో కలిసి, పాఠశాలలో నిర్మానులకు సంబంధించిన ప్రభుత్వం ఆమోదించిన మ్యాపులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. ప్రస్తుత నిర్మాణాలు మ్యాపులకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అన్న అంశాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల భవనాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యతతో పాటు, పనుల్లో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మ్యాప్, డిజైన్, నిర్మాణ ప్రణాళిక ప్రకారమే పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, ప్రతి నిర్మాణ దశలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి పనులను చేపట్టాలని ఆదేశించారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల పురోగతిపై పాఠశాలల అభివృద్ధి కమిటీ సభ్యులు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించడమే తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పాఠశాలల నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వేగంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ఆమోదించిన ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సను సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని (ఎంసీహెచ్) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీల పరీక్షల విభాగం, వివిధ వార్డులను పరిశీలించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గర్భిణీలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి ఆరోగ్య పరిస్థితి, మందులు, పరీక్షలు, వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. గర్భిణీలకు అందుతున్న వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణీలలో హెచ్‌బీ స్థాయిలను తప్పనిసరిగా పరీక్షించి, స్థాయిని బట్టి అవసరమైన మందులు, చికిత్స అందించాలని సూచించారు. రక్తహీనతను తగ్గించేలా చర్యలు చేపట్టడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్కానింగ్ గదిని పరిశీలించిన కలెక్టర్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్కానింగ్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని, అవసరమైన గర్భిణీలకు నిబంధనల ప్రకారం స్కానింగ్ సేవలు అందేలా చూడాలని సూచించారు. జ్వరం లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే వారికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించి, నిర్ధారణకు అనుగుణంగా చికిత్స అందించాలని ఆదేశించారు. క్రిటికల్ కేర్ యూనిట్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, వర్షాల కారణంగా నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించారు. ఆసుపత్రి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. డ్రైనేజీ, పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల వృద్ధికి అవకాశం లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా



వైద్య, సంక్షేమ శాఖల సమన్వయంతో మండలాల వారీగా ఎదుగుదలలో లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్ఆర్‌సీకి తరలించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ చంద్ర మోహన్, ఆర్ఎంవో సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేగు బంధం తెగిపోయింది...

- పురిటిలోనే తల్లిని కోల్పోయిన పసికందు
- మగశిశువుకు జన్మనిచ్చి తల్లి మృతి
- తల్లిప్రేమకు దూరమైన ఇద్దరు బిడ్డలు





**కెరమెరి, సెప్టెంబర్ 24(జనంసాక్షి) :** రెండో బిడ్డ కోసం ఆ తల్లి ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసింది. మొదటి బిడ్డ పుట్టిన 16 ఏళ్ల తర్వాత మళ్లీ కడుపు పండడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. పురిటి నొప్పులు ప్రారంభం కాగానే తమ ఇంటికి మరో బిడ్డ వస్తున్నాడనే ఆనందంతో నొప్పులు భరిస్తూ ఆ తల్లి ఆసుపత్రికి బయలుదేరింది. కానీ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన తన పేగుబంధాన్ని చూడకుండానే తిరిగిరాని లోకానికి చేరుకుంది. అమ్మ ఒడిలో సేదతీరాల్సిన పసిబిడ్డ.. పుట్టిన రోజే అమ్మను కోల్పోయిన హృదయవిదారక ఘటన కెరమెరి మండలంలోని చిన్న సాకడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చిన్నసాకడ గ్రామానికి చెందిన కుర్సింగ తానుబాయి(40) మంగళవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కెరమెరి పీహెచ్సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్.. అక్కడి నుంచి ఆదిలాబాద్ లోని రిమ్స్ కు తరలించారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు తానుబాయి మగశిశువుకు జన్మనిచ్చిన అనంతరం స్పృహ కోల్పోయింది. వైద్యులు రాత్రంతా చికిత్స అందించినప్పటికీ పరిస్థితి మెరుగుపడలేదు. బుధవారం ఉదయం ఆమె మృతి చెందింది.

**కుటుంబంలో తీవ్ర విషాదం..**

ఇంటి ఇల్లాలు మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. భార్యను కోల్పోయిన భర్త ఎత్మారావు, తల్లిని కోల్పోయిన పెద్ద కుమారుడు, తల్లి ప్రేమను రుచి చూడని అప్పుడే పుట్టిన బిడ్డను చూసి గ్రామస్తులంతా కన్నీరుమున్నీరవుతున్నారు. తానుబాయికి ఇప్పటికే 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇది రెండో కాన్పు. ఆమె రక్తహీనతతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఆమె శరీరంలో హిమోగ్లోబిన్ శాతం కేవలం ఆరు గ్రాములే ఉండగా, రిమ్స్ లో వైద్యం అందించడంతో 8 గ్రాములకు చేరింది. కాగా రెండు రక్తనాళాలు బ్లాక్ కావడమే ఆమె మృతికి కారణంగా తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం మృతురాలికి ఐరన్ ఇంజెక్షన్ ఎక్కించేందుకు ప్రయత్నించగా అనారోగ్యానికి గురైంది. ఎప్పటికప్పుడు వైద్య సలహాలు అందించడంతో పాటు పరీక్షలు చేయించినట్లు ఏఎన్ఎం శోభ, ఎంపీహెచ్ఓ శ్యాంరావు తెలిపారు. తానుబాయి పురిటి నొప్పులతో కెరమెరి పీహెచ్సీకి వచ్చినప్పటి నుంచి ఆమె వెంటే ఉండి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించినట్లు పేర్కొన్నారు.

# దళారుల హవాపై ఆరోపణలు

- పనికో రేటు నిర్ణయించారంటున్న వాహనదారులు
- డ్రైవింగ్ పరీక్షల నిర్వహణపైనా అనుమానాలు..




**నిర్మల్ బ్యూరో , సెప్టెంబరు 24 (జనం సాక్షి):** నిర్మల్ జిల్లా ఆర్టీవో కార్యాలయంలో దళారుల వ్యవస్థపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండతో కొందరు మధ్యవర్తులు కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారని వాహనదారులు, దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. తమ ద్వారా వచ్చిన దరఖాస్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, 'కోడ్' లేకుండా ఫైళ్లు ముందుకు కదలడం లేదని పేర్కొంటున్నారు.

**ప్రత్యేక కోడ్‌లతో వ్యవస్థ?**

జిల్లా వ్యాప్తంగా సుమారు 30 మంది మధ్యవర్తులకు ప్రత్యేక కోడ్ నంబర్లు కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా కోడ్‌లతో వచ్చిన దరఖాస్తులకు త్వరగా పనులు జరుగుతున్నాయని, నేరుగా ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**పనికో రేటు..?**

లెర్నర్, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, హెవీ వాహనాల పర్మిట్లకు సంబంధించి దళారుల ద్వారా అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ రుసుముతో పోలిస్తే ఏజెంట్ల ద్వారా ఎక్కువ మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. లెర్నర్ లైసెన్స్‌కు ప్రభుత్వ రుసుము రూ. 550 ఉండగా, ఏజెంట్ల ద్వారా రూ. 1,100 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా తాత్కాలిక రిజిస్ట్రేషన్ గడువు లోపు టూవీలర్ రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వ రుసుము వర్తించని సందర్భాల్లోనూ దళారుల ద్వారా రూ. 800 వరకు తీసుకుంటున్నారని కొందరు చెబుతున్నారు. ఈ మొత్తాలపై సంబంధిత శాఖ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

**డ్రైవింగ్ పరీక్షలపైనా ఆరోపణలు**

డ్రైవింగ్ టెస్ట్ నిర్వహణపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షలో సక్రమంగా వాహనం నడపకపోయినా కొందరికి లైసెన్సులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరీక్షా ప్రక్రియను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాల్సి ఉండగా, కెమెరాల పనితీరు, ఫుటేజ్ నిర్వహణపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసి, నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్ పరీక్షలు పూర్తి చేయకుండానే లైసెన్సులు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వీటిపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**పాత వాహనాల ఫిట్‌నెస్‌పై ఆందోళన**

గ్రామీణ ప్రాంతాల్లో ఫిట్‌నెస్ లేని పాత వాహనాల రాకపోకలపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కుబీర్ మండల పరిధిలో జరిగిన వాహన ప్రమాదాన్ని పలువురు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి**

ఆర్టీవో కార్యాలయంలో దళారుల వ్యవస్థ, అదనపు వసూళ్లు, డ్రైవింగ్ పరీక్షల నిర్వహణపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏసీబీ అధికారులు సైతం ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.


# మాదారంలో 27 ఏళ్ల రవాణా కష్టాలకు బ్రేక్

- ఊరి లోపలికి ఆర్టీసీ బస్సులు
- 'జనం సాక్షి' కథనానికి ఆర్టీసీ అధికారుల వేగవంతమైన స్పందన



**తాండూర్, సెప్టెంబర్ 24(జనం సాక్షి) :** తాండూర్ మండలం మాదారం గ్రామపంచాయతీ ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు ఎట్టకేలకు తీరాయి. గత 27 సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సులు ఊరి లోపలికి రాకుండా, కేవలం మెయిన్ రోడ్డుపైనే నిలిపివేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు చీకట్లో ఊరిలోకి నడుచుకుంటూ రావడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ దీర్ఘకాలిక సమస్యపై 'జనం సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక వార్తా కథనానికి ఆర్టీసీ అధికారులు వేగంగా స్పందించారు. గ్రామస్తుల ఇబ్బందులను కళ్లకు గడుతూ విలేఖరి సాగర్ రంగ అందించిన క్షేత్రస్థాయి కథనం అధికారుల్లో కదలిక తెచ్చింది. పత్రికా ప్రకటనపై తక్షణమే స్పందించిన అధికారులు.. ఇకపై ఆర్టీసీ బస్సులు ఖచ్చితంగా మాదారం ఊరి లోపలికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాత్రి వేళల్లో కూడా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని స్పష్టం చేశారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'జనం సాక్షి' విలేఖరి సాగర్ రంగకు, పత్రిక యాజమాన్యానికి మాదారం గ్రామస్తులు, ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్టీ కాలనీ ప్రజలకు ఇబ్బందులు



**కౌటాల సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** రాత్రి వేళల్లో విష ప్రాణులతో భయభ్రాంతులకు గురవుతూ భయం గుప్పిట్లో కొట్టుమిట్టాడుతున్నమని కౌటాల మండలంలోని కనికి గ్రామ ఎస్టీ కాలనీ వాసులు అన్నారు. కాలనీ లో సీసీ రోడ్ లేక ఇండ్లలోని నీళ్లు రోడ్ మీదకు చేరి బురద మయంగా మారింది. దాదాపు 30కుటుంబాల కాలనీ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు జారీ ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రి వేళల్లో విష సర్పాలు,తేళ్లు, ఇతర ప్రాణులతో భయం గుప్పిట్లో కాలం గడుపు తున్నామని కాలనీ వాసులు తెలిపారు..పలుమార్లు గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినప్పటికి కనీసం మొరం అయిన వేయించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన పై అధికారులు స్పందించి సీసీ రోడ్ మంజూరు చేయించాలని

# డీజిల్ కాలనీలో హత్య కలకలం

- తల్లి ఉదయశ్రీ(40)ని హత్య చేసినట్లు కుమారుడిపై ఆరోపణ
- అక్రమ సంబంధం విషయంలో తల్లితో విభేదాలే కారణమా?
- ఘటనాస్థలికి చేరుకున్న కాజీపేట పోలీసులు..



**కాజీపేట, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కలకలం రేపింది. డీజిల్ కాలనీ బాలాజీనగర్‌లో ఓ మహిళ హత్యకు గురైంది. మృతురాలిని ఉదయశ్రీ(40) గా గుర్తించారు. స్థానికంగా అందుతున్న వివరాల ప్రకారం.. ఉదయశ్రీ కి ఓవ్యక్తితో ఉన్నట్లు చెబుతున్న అక్రమ సంబంధం విషయంలో కుమారుడు దొరబాబు(20)తో కొంతకాలంగా విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తల్లిని పలుమార్లు కుమారుడు హెచ్చరించినట్లు సమాచారం. అయితే ఆమె వినకపోవడంతో ఆగ్రహానికి గురైన దొరబాబు.. గురువారం రోజున ఉదయం ఇంటి మేడపై తల్లిపై దాడి చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదయశ్రీ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న దొరబాబు ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన విభేదాల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా సమాచారం. అయితే హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. సమాచారం అందుకున్న కాజీపేట పోలీసులు వెంటనే డీజిల్ కాలనీ బాలాజీనగర్‌కు చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు, స్థానికులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఉపయోగించిన ఆయుధం, ఘటనకు సంబంధించిన ఇతర ఆధారాల పై పోలీసులు ఆరా తీస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# పోతుగంటి పోశెట్టి నివాళి గీతం ఆవిష్కరణ



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 24, (జనంసాక్షి) :** ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు పోతుగంటి పోశెట్టి నివాళి గీతాన్ని గురువారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో ఆయన కుమారుడు పోతుగంటి అశోక్ ఆవిష్కరించారు. పోశెట్టి 45వ వర్ధంతిని పురస్కరించుకుని తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ, బెల్లంపల్లిలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాది వేయడంలో పోశెట్టి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీని బెల్లంపల్లికి తీసుకురావడంతో పాటు నాయకులను తీర్చిదిద్ది, కార్యకర్తలను సమీకరించి పార్టీని బలోపేతం చేశారని తెలిపారు. ఆయన నాయకత్వంలో బెల్లంపల్లిలో సీపీఐ కంచుకోటగా ఎదిగిందన్నారు. ఆసిఫాబాద్ సమితికి మూడుసార్లు ఉపాధ్యక్షుడిగా, ఒకసారి అధ్యక్షుడిగా, చాకేపల్లికి వరుసగా నాలుగు సార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా కూడా ప్రజలకు సేవలందించి ప్రజల మనిషిగా వారి గుండెల్లో నిలిచిపోయారని గుర్తుచేశారు. పోశెట్టి పోరాట జీవితం, ప్రజా సేవ, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన చేసిన కృషిని భావితరాలకు పరిచయం చేసే ఉద్దేశంతో నివాళి గీతాన్ని రూపొందించినట్లు గీత రచయిత, పోశెట్టి మనవడు పోతుగంటి భరత్ రుషి తెలిపారు. పోరాట యోధుడిగా ఆయన ప్రదర్శించిన స్ఫూర్తి, ప్రజా నాయకుడిగా అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, జిల్లా సమితి సభ్యుడు గుండా చంద్రమాణిక్యం, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు

## ప్రత్యేక పూజల్లో ఎస్పీ అఖిల్ మహాజన్



**మావల, సెప్టెంబర్ 25( జనం సాక్షి) :** మావల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజల్లో ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ దంపతులు,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్ గారు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ దంపతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి గారు భక్తులతో కలిసి గుస్సాడి వేషధారణలో పాల్గొని సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంత వాతావరణం లో శాంతి యుతంగా భక్తీ శ్రద్ధలతో శోభ యాత్ర నిర్వహించాలని కోరారు.

# బాలిక సదనం నుంచి మరో దత్తత

- బాలికను అభినందించిన కలెక్టర్
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ప్రభుత్వ బాలిక సదనం లో రక్షణ సంరక్షణ విద్యా బుద్ధులు నేర్చుకొని తన ఇష్టాల కు అనుగుణంగా దత్తతకు ఒప్పుకొని కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రోజున నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు కలెక్టర్ ఛాంబర్ లో చట్టబద్ధమైన దత్తత అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరమని అన్నారు. కాగా దత్తత కి ఇచ్చిన బాలికతో, దత్తత తీసుకున్న తల్లితండ్రులతో కలెక్టర్ మాట్లాడి దత్తత తీసుకొన్న బాలికను బాగా చదివిం చాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎం కల్యాణి, ఇంచార్జి డిసిపివో ఎస్ ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎంపై బీఆర్ఎస్ నేతల మొసలి కన్నీరు..

- పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?
- ఇప్పుడు పగటి వేషగాళ్లలా హడావుడి ఎందుకు
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్




**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని ఎంజీఎం హాస్పిటల్ పై బి ఆర్ ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఎంజీఎం ను ఎందుకు పట్టించుకోలేదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారం పోయిన తర్వాత పగటి వేషగాళ్ల మాదిరిగా బీఆర్ఎస్ నేతలు ఎంజీఎం ఆస్పత్రిపై చేస్తున్న హడావుడి ప్రజలకు నవ్వు తెప్పిస్తోంది అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎంజీఎం ఆస్పత్రి గురించి పట్టించుకోని నాయకులకు ఇప్పుడు అకస్మాత్తుగా ఎంజీఎంపై ప్రేమ పుట్టుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంజీఎం ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించేందుకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని అయూబ్ విమర్శించారు. ఎక్స్‌రే లాంటి కనీస సదుపాయాలను కూడా సక్రమంగా అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి మీ హయాంలో ఉంటే.. ఇప్పుడు ఎంజీఎం గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు ఎక్కడిది? అని ప్రశ్నించారు. నూతన ఆస్పత్రి నిర్మాణం పేరుతో హడావుడి చేయడం తప్ప, దాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం కంటే రాజకీయ స్వలాభమే ముఖ్యమా? ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి వదిలేయడం మీ పాలనలో సాధారణంగా మారిపోయింది మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎంజీఎం ఆస్పత్రిలో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అయూబ్ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇప్పటికే పలుమార్లు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతిని మరియు ఎంజీఎం ఆస్పత్రిపై సమీక్షలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

## ఊర చెరువు సాగు నీటి వృథాను అరికట్టిన రైతులు

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 24( జనం సాక్షి):** మండలంలోని ఎల్లాయగూడెం గ్రామం లోని ఊర చెరువు నుంచి సాగు నీరు బయటికి వృథాగా పోకుండా అరికట్టారు. చెరువు కొమ్ము తండా రైతులు గురువారం జేసీబీ సహాయంతో ఊర చెరువులోని నీరు వృథాగా బయటికి పోకుండా తగిన చర్యలు చేపట్టారు. నీటిపారుదల శాఖ అధికారులు ఊర చెరువును సందర్శించి సాగునీరు వృథాగా పోకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోడ రవి నాయక్, భూక్య ఊమ్లు, బాబు, బోడ ధంజ్య పాల్గొన్నారు.

## రీసర్వేలో గ్రామ సరిహద్దుల పరిశీలన

**దుగ్గొండి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి):** మధిర, మందపల్లి గ్రామంలో భూ రీ-సర్వే, గ్రామ సరిహద్దులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు మధిర దుగ్గొండి మండలం మందపల్లి గ్రామంలో భూ రీ-సర్వే, గ్రామ సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దులు, భూ రికార్డులు, రీ-సర్వే ప్రక్రియలో చేపడుతున్న పనులను పరిశీలించారు. రీ-సర్వేలో భాగంగా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి పక్కాగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భూ రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో దుగ్గొండి మండల తహసిల్దార్ సమ్మక్క సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూపు

- జీవితంలో సొంతగా ఇల్లు నిర్మించుకోలేని దళిత కుటుంబం
- ఇందిరమ్మ సెకండ్ ఫ్లేస్ లో ఇల్లు మంజూరు చేయాలి



**కాటారం, సెప్టెంబర్ 24 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని గంగారం గ్రామపంచాయతీలో రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం అది. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న భోగి సదయ్యకు సొంత ఇంటి కల నేటికీ నెరవేరలేదు. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన సదయ్య తన భార్య, కుటుంబంతో కలిసి శిథిలావస్థకు చేరిన పురాతన మట్టి ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు.

ఇంటి పైకప్పుకు కవర్ మాత్రమే ఉండటంతో వర్షాకాలంలో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మట్టి గోడలతో నిర్మించిన పాత ఇల్లు ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో కుటుంబ సభ్యులు కాలం వెళ్లదీస్తున్నారు. సదయ్య కూలి పనులు చేసుకుంటూ వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. నిత్యావసర ఖర్చులు, పిల్లల చదువులు, కుటుంబ పోషణకే ఆ ఆదాయం సరిపోతోంది. దీంతో సొంతంగా ఇల్లు నిర్మించుకోవడం అతనికి భారంగా మారింది. ప్రభుత్వం నిరుపేదల కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా తనకు ఇల్లు మంజూరు అవుతుందని సదయ్య ఆశగా ఎదురుచూస్తున్నాడు. అర్హత ఉన్నప్పటికీ ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబ పరిస్థితిని అధికారులు పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సదయ్య కోరుతున్నాడు.

"సొంత ఇంటి కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నాం.. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశాజీవిగా ఎదురుచూసిన చివరి నిమిషంలో ఆ లిస్టులో పేరు లేక నిరాశ చెందామని తెలిపారు ఏమి తోచని దిశలో ఎవరిని ఏమనలేక ఇంట్లో కాలం గడుపుతున్న అని తెలిపారు. అధికారులు ఇందిరమ్మ ఫస్ట్ ఫ్లేస్ లో సర్వే చేసిన అధికారులు మాత్రం నీకు ఇల్లు వస్తుందని మాట ఇచ్చారని చెప్తున్నాడు. చివరి దశలో ఎందుకు తొలగింపు గురైందో అర్థం కావట్లేదని ఆ కుటుంబం ఆవేదన వెలిబుచ్చింది. అధికారులు గ్రామంలో దళిత కుటుంబాలను చూసి ఇంటి వాతావరణం చూసి అతను జీవితంలో సొంతగా ఇల్లు కట్టుకో లేదని కుటుంబ పరిస్థితులు తెలిసికూడా ఇందిరమ్మలో ఇల్లును లిస్టులో పొందుపరచకపోవడం చాలా బాధాకరమని గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు ఆవేదన వెలుబుచ్చారు. ప్రభుత్వం ఆదుకోవాలి" అని సదయ్య కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
25 సెప్టెంబర్ 2026

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- పాల్వంచలో 360 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లక్కీడ్రా
- అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు
- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు.పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 27 డివిజన్లకు చెందిన అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు పెద్దమ్మతల్లి ఆలయ ఫంక్షన్‌హాల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, మేయర్ మూడ్ మూడ్ గణేష్ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 360 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతించింది. పది బ్లాకుల్లో ఒక్కో బ్లాక్‌లో 36 ఇళ్ల చొప్పున మొత్తం 360 ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 27 డివిజన్ల నుంచి వీటి కోసం 4,611 దరఖాస్తులు అందగా, క్షేత్రస్థాయిలో విచారణ, అర్హతల పరిశీలన అనంతరం 1,254 మందిని అర్హులుగా గుర్తించారు. ఎస్సీ వర్గానికి 17 శాతం మేరకు 61 ఇళ్లు, ఎస్టీ వర్గానికి 6 శాతం మేరకు 22 ఇళ్లు, మైనారిటీలకు 12 శాతం మేరకు 43 ఇళ్లు, మిగిలిన బీసీ, ఓసీ వర్గాలకు 65 శాతం మేరకు 234 ఇళ్లను కేటాయించారు. ఎస్సీ కేటగిరీలో 3 మంది దివ్యాంగులకు, ఎస్టీ కేటగిరీలో ఒక దివ్యాంగుడికి, మైనారిటీ కేటగిరీలో 2 మంది దివ్యాంగులకు, బీసీ, ఓసీ కేటగిరీల్లో 12 మంది దివ్యాంగులకు ఇళ్లను కేటాయించేలా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టారు. మొత్తంగా 18 ఇళ్లు దివ్యాంగులకు, 342 ఇళ్లు ఇతర అర్హులకు కేటాయించే విధంగా ప్రక్రియ రూపొందించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గతంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియ కొన్ని కారణాల వల్ల ఆలస్యమైందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రా ప్రక్రియను ప్రజల సమక్షంలో ప్రత్యక్షంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం కేటాయింపులు చేపడుతున్నట్లు తెలిపారు. లక్కీ డ్రా పూర్తయిన అనంతరం ఎంపికైన లబ్ధిదారుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలిస్తారని, అవసరమైన ధ్రువపత్రాల ధృవీకరణ పూర్తయిన తర్వాత ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం చిన్నారుల చేతుల మీదుగా ముందుగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల కేటగిరీలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా నిర్వహించారు. అనంతరం కేటగిరీల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, ఎంపికైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, మేయర్ మూడ్ మూడ్ గణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కొత్తగూడెం ఆర్డీవో మధు, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కార్పొరేటర్లు, తహసీల్దార్ దారాప్రసాద్, గృహ నిర్మాణ శాఖ పీడీ సవేరాం, ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల అర్హులు, ప్రజలు సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకే క్రీడలు

- కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాలల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ గుమ్మడిదల విద్యార్థులు ప్రథమ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ (బి) జోగిపేట విద్యార్థులు ద్వితీయ బహుమతి, జెడ్పీహెచ్ఎస్ సింగీతం--కలబ్‌గూర్ విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. కళాశాలల విభాగంలో తారా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి ప్రథమ బహుమతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు ద్వితీయ బహుమతి, ఎంజేపీటీ కోహీర్ తృతీయ బహుమతి సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతో పాటు పోటీలు, సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విజేతలను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాశాఖ అధికారులు అభినందించారు. పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి కేవీఎస్ ప్రసాద్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలి

- గీతంలో శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా



**పటాన్చెరు, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల మధ్య సంబంధాన్ని బలోపేతం చేయాలని న్యూఢిల్లీలోని సీఐఎస్ఆర్-జాతీయ భౌతిక శాస్త్ర ప్రయోగశాల శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా అన్నారు. శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని, భారతదేశ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేయగల స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. హైదరా బాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ కోసం కొత్తగా అభివృద్ధి చెందుతున్న నానో/క్వాంటం పదార్థాల రూపకల్పన, ఆవిష్కరణ, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. సెమీకండక్టర్, క్వాంటం సాంకేతికతల కేంద్రం సహకారంతో, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. డాక్టర్ గుప్తా విద్యార్థులకు నానోపదార్థాలు, అభివృద్ధి చెందుతున్న టుడీ (ద్విమితీయ) పదార్థాలు, క్వాంటం పదార్థాలను ప్రాథమికంగా పరిచయం చేస్తూ, వాటి పరిమాణంపై ఆధారపడిన లక్షణాలు, సంభావ్య అనువర్తనాలను వివరించారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంతరెడ్డి ముడిమాల, అతిథికి స్వాగతం పలికి, విద్యార్థులకు ఆయనను పరిచయం చేసి, సత్కరించారు. ఈఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ శాంతను సాహా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- ఎస్సై, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్
- మెరుగైన చికిత్స కోసం డ్రైవర్ హైదరాబాద్‌కు తరలింపు
- తిరుమలాయపాలెం గ్రామ శివారులో అర్ధరాత్రి జరిగిన ఘోర ప్రమాదం



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** విధులు నిర్వహిస్తున్న పోలీస్ వాహనాన్ని ఒక లారీ బలంగా ఢీకొట్టిన ఘోర ప్రమాదంలో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై), డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి తిరుమలాయపాలెం గ్రామ శివారులోని భవానీ హోటల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుండి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చేపల లోడుతో వెళ్తున్న లారీ (ఆప్రా-16-ఎఎ-6179), తిరుమలాయపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. లారీ డ్రైవర్ షేక్ రసూల్ (65) వాహనాన్ని అత్యంత వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

**క్షతగాత్రులకు తక్షణ వైద్యం..**

ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీశ్, వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌లను తక్షణమే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎస్సై జగదీశ్ పరిస్థితి నిలకడగా ఉండగా.. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రాకేష్‌కు మెరుగైన వైద్యం అందించడం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

**పరామర్శించిన సీపీ..**

ప్రమాద విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రాత్రి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డ్రైవర్ రాకేష్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. విధినిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రమాదానికి గురికావడం పట్ల సీపీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

# వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకులైన వయోవృద్ధులను గౌరవించి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు.అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారం రోజుల పాటు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాల గోడ పత్రికను గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా, ఇంట్లోనే ఉంచుకొని ప్రేమగా చూసుకోవాలని అన్నారు.వృద్ధుల రక్షణ, ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ చట్టం గురించి వివరించారు.తల్లిదండ్రులను సరిగా చూసుకోకుండా నిర్లక్ష్యం చేసే పిల్లల స్థూల వేతనం నుంచి నేరుగా 15 శాతం లేదా గరిష్టంగా రూ.10 వేల వరకు కట్ చేసి, తల్లిదండ్రుల ఖాతాకు జమ చేసేలా కఠిన నిబంధనలు ఉన్నాయని అన్నారు.వృద్ధుల హక్కులు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణిలో వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, చట్టప్రకారం న్యాయం చేస్తున్నామన్నారు.సీనియర్ సిటిజన్లకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కేటాయించిన ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 14567 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య, జి.విద్యాసాగర్, హమీద్ ఖాన్, ఇరిగే కోటేశ్వరి, గజ్జల కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## వేపలగడ్డ పంచాయతీలో 250 ఎకరాల్లో పంటకు నష్టం

- తుఫాన్ దెబ్బకు నేలవాలిన పత్తి
- ఆందోళనలో అన్నదాతలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** భారీ వర్షాలు, ఈదురుగాలులు పత్తి రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. బూర్గంపహాడ్ మండలం వేపలగడ్డ పంచాయతీ పరిధిలోని వేపలగడ్డ, కొమ్మునకిరిపేట, అంజనాపురం తదితర ప్రాంతాల్లో సుమారు 200 నుంచి 250 ఎకరాల్లో పత్తి పంట నేలవాలింది. బుధవారం సాయంత్రం నుంచి వీచిన బలమైన గాలులకు కాయదశకు చేరుకున్న పత్తి మొక్కలు నేలకొరగడంతో 50 నుంచి 60 మంది రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పంటపై పెట్టుబడులు పెట్టి దిగుబడిపై ఆశలు పెట్టుకున్న సమయంలో తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరడం, పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

**క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన**

పంట నష్టంపై సమాచారం అందుకున్న మండల వ్యవసాయాధికారి శంకర్, ఏఈవో వైష్ణవి తదితరులతో కలిసి గురువారం వేపలగడ్డ, నకిరిపేట గ్రామాల్లో పర్యటించారు. ఈదురుగాలులకు నేలవాలిన పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేశారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. దెబ్బతిన్న పంటను వెంటనే పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, పంట నష్టం అంచనాలను త్వరగా పూర్తి చేసి సహాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మణుగూరు బీటీపీఎస్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- పవర్ ప్లాంట్‌లోకి అనుమతించలేదంటూ పువ్వాడ అజయ్, రేగా కాంతారావు ఆగ్రహం



**అశ్వాపురం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)ను పరిశీలించేందుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నేతృత్వంలో వెళ్లిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పవర్ స్టేషన్‌లోకి అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లాంట్ ఎదుట నిరసనకు దిగారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు “కేసీఆర్ హయాంలో కరెంటు వెలుగులు.. కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు”, “రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి” అంటూ నినాదాలు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ “పోలీసుల జులుం నశించాలి.. జై తెలంగాణ.. జై కేసీఆర్” అంటూ నినాదాలు చేశారు.మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో విద్యుత్ కొరతను అధిగమించి 24 గంటల విద్యుత్ సరఫరా చేశామని పేర్కొన్నారు. బీటీపీఎస్‌ను నిర్మించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆయన ఆరోపించారు.పవర్ ప్లాంట్‌లోని వాస్తవ పరిస్థితులు, విద్యుత్ ఉత్పత్తి పరిస్థితిని పరిశీలించేందుకు శాంతియుతంగా వచ్చిన తమను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడమేనని పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. పోలీసుల ద్వారా తమ ఆందోళనను, ప్రజా ఉద్యమాన్ని అడ్డుకోలేరని అన్నారు.రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను పునరుద్ధరించాలని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని కోరారు. ఇంకా రెండేళ్లు కాలం ఉందని వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు.తెలంగాణలో విద్యుత్ సమస్యలను పరిష్కరించే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకుంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. అదేవిధంగా బీటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్ పరిశీలనకు వచ్చిన మాజీ మంత్రి పువ్వా అజయ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తో బిటిపిఎస్ సీఇ బిచ్చన్న వారితో చరవాణిలో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. తర్వాత ప్లాంట్లోకి అనుమతించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు,,భద్రాచలం డివిజన్ నాయకులు , వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు వర్షం సైతం లెక్క చేయకుండా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఆర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** జిల్లాలో త్రిపుల్ ఆర్ భూములను పకడ్బందీగా జాయింట్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో డిఆర్ఓ, ఆర్డిఓ, ఏడి సర్వే, తహసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో త్రిపుల్ ఆర్ సంబంధించిన భూములను ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు కలసి జాయింట్ సర్వే నిర్వహించాలని, రెవెన్యూ, ఫారెస్ట్ బౌండరీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ,ట్రిపుల్ భూముల్లో రీ సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా రెవెన్యూ, అటవీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డీఎఫ్ఓ జో.జి నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, ఏడి సర్వే కిషన్, తాహాసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# విపణి




## టాప్-10 జాబితాలోకి ఎన్ఎస్ఈ

### లిస్టింగ్ తర్వాత 5% జంప్..

**దిల్లీ:** ఎన్నో అంచనాల మధ్య లిస్టింగ్‌కు వచ్చి నిరుత్సాహ పరిచిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అరుదైన మైలురాయిని అందుకుంది. ఫ్లాట్‌గా ట్రేడింగ్ మొదలైనప్పటికీ.. ఆ తర్వాత షేర్లు 5 శాతం మేర రాణించడంతో ఎన్ఎస్ఈ ఎలైట్ క్లబ్‌లో చేరింది. మార్కెట్ విలువ పరంగా టాప్-10 కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. ఎన్ఎస్ఈ షేర్లు ఈ ఉదయం స్వల్ప లాభాల్లో బీఎస్ఈలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఇష్యూ ధర రూ.1785తో పోలిస్తే కేవలం 0.84 శాతం లాభంతో రూ.1800 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఆపై షేరు ధర 5.21 శాతం లాభంతో రూ.1878కి చేరింది. దీంతో మార్కెట్ విలువ 4.54 లక్షల కోట్లకు (రూ.4,54,966.88 కోట్లు) పెరిగింది. ఈ క్రమంలో బీఎస్ఈ నమోదిత కంపెనీల్లో టాప్-10 జాబితాలో ఎన్ఎస్ఈ చేరింది. హిందుస్థాన్ యునిలీవర్‌ను 11వ స్థానానికి నెట్టింది.

స్టాక్ మార్కెట్లలోకి ఎన్ఎస్ఈ.. ఫ్లాట్‌గా లిస్టింగ్

సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత ఎన్నో అంచనాలతో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. బీఎస్ఈ ఫ్లాట్‌గా అడుగుపెట్టింది ఇష్యూ ధరతో పోలిస్తే స్వల్పంగా 0.84శాతం ప్రీమియంతో గురువారం దలాల్ స్ట్రీట్‌లో లిస్ట్ అయ్యి మదుపర్లను నిరాశపర్చింది. ఇష్యూ ధర రూ.1,785 కాగా.. కేవలం రూ.15 లాభంతో రూ.1800 వద్ద ఎన్ఎస్ఈ షేర్ల ట్రేడింగ్ ప్రారంభమైంది.

అంతకుముందు రూ.22,569 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఎన్ఎస్ఈ.. దేశంలోనే రెండో అతిపెద్ద ఐపీఓ (ఔూఇ ఎఖూ)గా నిలిచింది. సెప్టెంబర్ 17న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. సెప్టెంబరు 21న ముగిసింది. ధరల శ్రేణిని రూ.1700-1785గా నిర్ణయించారు. ఈ ఐపీఓకు 5.68 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. మొత్తం 8.86 కోట్లు షేర్లకు గానూ 50.21 కోట్లు బిడ్లు దాఖలయ్యాయి. ఎక్కువగా క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల నుంచి 12.68 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదుచేసింది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 6.54 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా నుంచి 1.31 రెట్ల సబ్‌స్క్రిప్షన్ మాత్రమే అందుకుంది. ఇక తాజా లిస్టింగ్‌తో దీని మార్కెట్ విలువ రూ.4.5 లక్షల కోట్లుగా నిలిచింది. ఈ ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే వచ్చింది.

# రూ.5 లక్షల కోట్లు ఆవిరి

### సెన్సెక్స్ 1248 పాయింట్లు డౌన్..




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల కారణంగా చమురు ధరలు, బాండ్ రాబడులు పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది. దీనికితోడు రూపాయి బలహీన పడడం, అమెరికా ఫెడ్ మరోసారి వడ్డీ రేట్లు పెంచుతుందన్న భయాలు సూచీలను ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా పతనం కాగా.. నిఫ్టీ 23,063 పాయింట్లకు పడిపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.480 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 74,272.40 (క్రితం ముగింపు 74,828.25) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 73,563.92 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1247.71 పాయింట్లు కుంగి.. 73,580.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 383.70 పాయింట్లు క్షీణించి 23,063.10 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.95గా ఉంది. సెన్సెక్స్ 30లో ఎన్‌టీపీసీ మినహా మిగతా అన్నీ షేర్లు నష్టాలను చవిచూశాయి. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 105.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,252.79 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

మార్కెట్ పతనానికి కారణాలు ఇవీ..

ప్రపంచవ్యాప్తంగా బాండ్లపై రాబడులు పెరగడం ఈక్విటీ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికాలో 10 ఏళ్ల యూఎస్ ట్రెజరీ రాబడులు 5.11 శాతం దాటాయి. 2007 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. సాధారణంగా బాండ్ రాబడులు పెరిగితే భారత్ వంటి వర్ధమాన దేశాల ఈక్విటీ మార్కెట్లపై మదుపర్లకు ఆసక్తి తగ్గుతుంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర మరోసారి పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. 100 డాలర్లకు దిగువకు చేరినట్లే చేరిన క్రూడ్.. మళ్లీ 105 డాలర్ల స్థాయికి చేరింది. యుద్ధాన్ని ముగించే విషయంలో అమెరికా- ఇరాన్ మధ్య విభేదాలు కొనసాగుతుండటం దీనికి కారణం. అమెరికా ఒత్తిళ్లకు ఏమాత్రం తలొగ్గబోమని ఐక్యరాజ్యసమితి వేదికగా ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం మరో కారణం.

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలతో ప్రపంచ ఈక్విటీలపై ఒత్తిడి మరింత పెరిగింది. పెరుగుతున్న ముడి చమురు ధరలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయన్న భయాలు నెలకొన్నాయి. దీంతో అవసరమైతే మరిన్ని పెంపులు ఉంటాయని ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ మైఖేల్ బార్ పేర్కొనడం ఇందుకు నేపథ్యం.

దేశీయంగా బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనల వల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ మరింత క్షీణించడం కూడా సూచీలపై ప్రభావం చూపాయి.

### కొత్త నిబంధనలతో బీమా, ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్ షేర్లు కుదేలు

బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ తీసుకొస్తున్న కొత్త నిబంధనలతో బీమా, ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్ షేర్లు కుదేలయ్యాయి. బీమా సంస్థలకు చెందిన వెబ్‌సైట్లలో 'డార్క్ ప్యాటర్న్స్'పై నిషేధం విధించే లక్ష్యంతో తీసుకొచ్చిన ప్రతిపాదిత నిబంధనలతో ఆయా షేర్లు అమ్మకాలు నేడు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా పీబీ ఫిన్‌టెక్, టర్టిల్‌మింట్ వంటి డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్‌ల ఆదాయానికి గండి కొట్టేలా ఈ నిబంధనలు ఉండడంతో ఈ రెండు స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. పాలసీ బజార్ మాతృ సంస్థ అయిన పీబీ ఫిన్‌టెక్ షేరు అత్యధికంగా 30 శాతం మేర పతనమై రూ.1,320 స్థాయికి చేరింది. ఈ ఒక్క రోజే కంపెనీ మార్కెట్ విలువ దాదాప రూ.24,500 కోట్లకు పైగా ఆవిరైంది. పీబీ ఫిన్‌టెక్‌కు ఇదే ఒకరోజు అత్యధిక నష్టం కావడం గమనార్హం. మరో డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ షేరు విలువ కూడా 20 శాతం మేర క్షీణించి రూ.109.04కు చేరింది. జూన్‌లో లిస్టయిన ఈ కంపెనీ ఒక్కరోజులో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి. ఈ కంపెనీ మార్కెట్ విలువ సైతం రూ.800 కోట్లు క్షీణించింది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి ఇతర బీమా కంపెనీల షేర్లలోనూ ఒత్తిడి కనిపించినప్పటికీ.. డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్‌లతో పోలిస్తే వీటిపై ప్రభావం తక్కువే.

కారణం ఏంటి?

బీమా పంపిణీని మరింత పారదర్శకంగా, వినియోగదార్లకు ప్రయోజనకరంగా మార్చే లక్ష్యంతో తీసుకొచ్చే సంస్కరణల్లో భాగంగా ఒక చర్చాపత్రాన్ని ఐఆర్‌డీఏఐ జారీ చేసింది. 'రీక్యాలిబ్రేటింగ్ ఎకనమిక్స్ ఆఫ్ ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్' పేరిట విడుదలైన ఈ పత్రంలో పంపిణీ, దాని నిర్మాణం, వ్యయాలు, కమిషన్లు, మార్కెట్ ధోరణులు, పారదర్శకత, డిజిటల్ వసతుల వాడకం తదితరాలను చేర్చింది. అక్టోబరు 25 వరకు ఈ చర్చాపత్రంపై ప్రజలు, సంబంధిత వర్గాలు స్పందనలు తెలపొచ్చని తెలిపింది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. డిస్ట్రిబ్యూటర్లు, అగ్రిగేటర్లు సంపాదించే కమిషన్లు లేదా టేక్-రేట్లపై పరిమితులు విధించాలని ఐఆర్‌డీఏఐ ప్రతిపాదించింది. ముఖ్యంగా హెల్త్, మోటార్ ఇన్సూరెన్స్ విభాగాల్లోని మార్జిన్లపై ఇది తీవ్ర ప్రభావం చూపవచ్చని బ్రోకరేజ్ సంస్థ బెర్న్‌స్టీన్ పేర్కొంది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా యాప్‌లు, వెబ్‌సైట్లలో ఉండే 'డార్క్ ప్యాటర్న్స్'పై నిషేధించాలనీ పేర్కొంది. వినియోగదారుడి వ్యక్తిగత వివరాలు తీసుకోకుండానే పాలసీ ఫీచర్లు, ధరలను పారదర్శకంగా చూపించాలని స్పష్టం చేసింది. ఈ కారణంతో బీమా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,62,254 | ₹ 1,77,008 |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,50,000

### రూ.12 వేలకే మీవీ నుంచి తొలి 5జీ స్మార్ట్‌ఫోన్..



ప్రముఖ వేరెబుల్ బ్రాండ్ మివి తన తొలి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. మివి వన్ 5జీ పేరిట తీసుకొచ్చింది. స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, ఆకర్షణీయమైన రంగులతో తెచ్చిన ఈ ఫోన్‌కు మివి కేర్+ సర్వీస్ కూడా ఉచితంగా అందిస్తోంది. ఇటీవల మరో వేరెబుల్ కంపెనీ ఫైర్‌బోల్ట్ నుంచి విడుదలైన బోల్ట్ ఏస్ 5ఉకి ఈ స్మార్ట్‌ఫోన్ పోటీ ఇవ్వనుంది. మరి మివి వన్ ఫీచర్లు పరిశీలిస్తే.. 6.75 అంగుళాల హెచ్‌డీ+తో కూడిన ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 90 రిఫ్రెష్ రేట్ ఇచ్చారు. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 4 జెన్ ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ఆండ్రాయిడ్ 16పై పనిచేస్తుంది. ఫోన్ వెనుకు వైపు శాంసంగ్ ఎూాఅఇఒఒ 50ఓఖ డ్యుయల్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 8 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. 6,000ఎంఏహెచ్ బ్యాటరీ, 18చి ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఇచ్చారు. ఫోన్‌తో పాటు అడాప్టర్‌ను ఇస్తున్నారు. రెండేళ్ల ఓఎస్ అప్‌డేట్లు ఇస్తామని కంపెనీ చెబుతోంది. మివి వన్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసిన వారికి మివి కేర్+ సర్వీస్ సదుపాయం ఉంది. అంటే ఇంటి నుంచే సర్వీస్ సేవలు పొందొచ్చు. ఫోన్‌కు సంబంధించి ఏదైనా సమస్య వస్తే.. కంపెనీ ఫోన్ పికప్ చేసుకొని, రిపేర్ చేసి, తిరిగి కస్టమర్‌కు డెలివరీ చేస్తుంది. ఒకవేళ ఏడు రోజుల్లోగా ఫోన్ రిపేర్ కాకుంటే కొత్త స్మార్ట్‌ఫోన్ ఆఫర్ చేస్తామని కంపెనీ చెబుతోంది. దేశంలో మివి కంపెనీకి సంబంధించిన 500 సర్వీస్ సెంటర్లు ఉన్నాయి.

# అదానీదే అగ్రస్థానం

## భారత కుబేరుల జాబితాలో టాప్‌లో..

- రెండో స్థానంలో ముకేశ్ అంబానీ
- 391కి చేరిన బిలియనీర్ల సంఖ్య



**హైదరాబాద్(జనంసాక్షి):**
భారత ఆర్థిక వ్యవస్థలో సంపద సృష్టి సరికొత్త శిఖరాలను తాకింది. స్టాక్ మార్కెట్లు హెచ్చుతగ్గుల్లో ఉన్నా వ్యాపార దిగ్గజాల ఆస్తులు రికార్డు స్థాయిలో వృద్ధి చెందాయి. దేశంలో ఆగస్టు 24, 2026 నాటికి రూ.1,000 కోట్లు అంతకంటే ఎక్కువ ఆస్తులు ఉన్న సంపన్నుల సంఖ్య 1,810కి పెరిగింది. 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' నివేదిక ప్రకారం భారతీయ కుబేరుల మొత్తం సంపద రూ.187.5 లక్షల కోట్లకు (1.96 ట్రిలియన్ డాలర్లు) చేరింది. ఇది దేశ జీడీపీలో దాదాపు సగానికి సమానం. గతేడాదితో పోలిస్తే నిఫ్టీ-50 సూచీ 3.9 శాతం, సెన్సెక్స్ 5.8 శాతం నష్టపోయినప్పటికీ, దేశీయ సంపన్నుల మొత్తం ఆస్తి విలువ సంవత్సర కాలంలో 12.8 శాతం పెరిగింది. బిలియనీర్ల (కనీసం 100 కోట్ల డాలర్ల ఆస్తి ఉన్న వారు) సంఖ్య 391కి చేరి సరికొత్త చరిత్రను సృష్టించింది. దేశంలో అత్యంత ధనవంతుడి స్థానాన్ని గౌతమ్ అదానీ కుటుంబం దక్కించుకుంది. 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' నివేదిక ప్రకారం అదానీ నికర ఆస్తి విలువ 13 శాతం పెరిగి రూ.9.23 లక్షల కోట్లకు చేరింది. ముకేశ్ అంబానీ కుటుంబ సంపద 10 శాతం తగ్గి రూ.8.63 లక్షల కోట్లకు పరిమితమవడంతో అదానీ ఆయన కంటే రూ.59,400 కోట్ల ముందంజలో నిలిచారు. యార్సెలర్ మిత్తల్ అధిపతి ఎల్.ఎన్.మిత్తల్ కుటుంబం 93 శాతం శాతం వృద్ధితో రూ.3.39 లక్షల కోట్ల సంపద నమోదు చేసి, మూడో స్థానానికి ఎగబాకింది. ఈసారి హురున్ నివేదికలో తొలిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) రంగాన్ని ప్రత్యేక విభాగంగా చేర్చారు. దీని నుంచే 19 మంది వ్యాపారవేత్తలు రూ.3.07 లక్షల కోట్ల ఉమ్మడి సంపదతో చోటు దక్కించుకున్నారు. ఇందులో 15 మంది కొత్తగా జాబితాలో చేరారు. వీరు రూ.1.82 లక్షల కోట్ల సంపదను సృష్టించి, అత్యధిక ఆస్తిని జోడించిన నూతన శ్రేణిగా నిలిచారు. విస్పర్ ఫ్లో ఏఐ సంస్థను స్థాపించిన 28 ఏళ్ల తనయ్ కొఠారి, సహజ్ గార్గ్ చెరో రూ.4,200 కోట్ల సంపదతో ఈ జాబితాలోని అత్యంత పిన్న వయస్కులుగా గుర్తింపు పొందారు. కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్స్, యోటా, ఆస్టెరా ల్యాబ్స్, ప్యారలల్ వెబ్ సిస్టమ్స్, సర్వమ్ ఏఐ, ఎమర్జెంట్ ఏఐ ప్రతినిధులు ఇందులో స్థానం సంపాదించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ నుంచి క్యూపీఏఐ నాగేంద్ర నాగరాజ రూ.1,700 కోట్లతో తొలిసారి అడుగుపెట్టారు. మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గతేడాది 100 ఉండగా, ఈసారి 131కి పెరిగింది. హెచ్‌సీఎల్ రోష్నీ నాడార్ మల్హోత్రా కుటుంబం రూ.2.79 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. అరిస్టా నెట్‌వర్క్స్ జయశ్రీ ఉల్లాల్ రూ.77,400 కోట్లు, నైకా ఫల్గుణి నాయర్ రూ.53,200 కోట్లతో ఉన్నారు. సంపన్నుల నివాసాల పరంగా ముంబయి 465 మందితో తొలి స్థానాన్ని కొనసాగుతుండగా, దిల్లీ (236), బెంగళూరు (129) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కలిపి 133 మంది పారిశ్రామికవేత్తలు ఈ జాబితాలో చోటు సంపాదించారు. పరిశ్రమల విషయానికి వస్తే పారిశ్రామిక ఉత్పత్తుల రంగం నుంచి అత్యధికంగా 166, రసాయనాల నుంచి 142, ఫార్మా 136 మంది ఈ జాబితాలో ఉన్నారు. విదేశాలలో నివసిస్తున్న భారతీయ సంతతి సంపన్నులు 156 మంది ఉండగా, అందులో అమెరికాలో 90 మంది, యూఏఈలో 31 మంది నివసిస్తున్నారు.

## సుభాష్ చంద్ర కేసులో సీబీఐకి ఎన్‌సీఎల్‌టీ నోటీసులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ఎస్సెల్ గ్రూపు ఛైర్మన్, మీడియా దిగ్గజం సుభాశ్ చంద్ర వ్యక్తిగత దివాలా కేసు విషయంలో ఒక రుణ సంస్థ నుంచి వచ్చిన ఫిర్యాదుపై స్పష్టతను ఇవ్వాలంటూ సీబీఐకి ఎన్‌సీఎల్‌టీ నోటీసులు జారీ చేసింది. అలాగే సుభాశ్ చంద్ర ఆస్తులను బదిలీ చేయకుండా ఆంక్షలు విధిస్తూ జారీ చేసిన మధ్యంతర ఆదేశం, ఈ కేసులో తమ తుది నిర్ణయం వెలువడేవరకు కొనసాగుతుందని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది. కాగా.. ఒక రుణదాత సీబీఐకి ఫిర్యాదు చేశారని, దానిపై సీబీఐ విచారణ జరుప ుతోందని, ప్రస్తుతం అది ప్రాథమిక దశలో ఉందంటూ చంద్ర వ్యక్తిగత దివాలా కేసును విచారిస్తున్న అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి సమాచారం వచ్చింది. దీనిపై ఎన్‌సీఎల్‌టీ ప్రెసిడెంట్ ఏఎస్ గ్రెవాల్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ ఈ అంశం కేసుపై ప్రభావం చూపవచ్చని, అందువల్ల సీబీఐ స్పందించాల్సి ఉంటుందని తెలిపింది. నాలుగు వారాల్లోగా సీబీఐ తన స్పందనను దాఖలు చేయవచ్చని తెలిపింది. అంతేకాకుండా 2026 సెప్టెంబరు 1న జారీ చేసిన మధ్యంతర ఆదేశాలు కేసుపై తుది నిర్ణయం వెలువడేంత వరకు కొనసాగుతాయని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ప్రస్తుత విచారణలో సీబీఐ ఒక అవసరమైన పక్షం కాదని వాదిస్తూ ఈ చర్యను సుభాశ్ చంద్ర తరపు న్యాయవాది వ్యతిరేకించారు. ఇది అప్పిలేట్ కోర్టు కాదని చెబుతూ... అయిదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడాన్ని కూడా ప్రశ్నించారు.



ఎన్‌సీఎల్ఏటీకి చంద్ర

కేసు విచారణలో ఉన్నంతకాలం తన ఆస్తులను విక్రయించడం, బదిలీ చేయడంపై ఆంక్షలు విధిస్తూ ఎన్‌సీఎల్‌టీ అయిదుగురు సభ్యుల ధర్మాసనం జారీ చేసిన ఆదేశాలపై అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను సుభాష్ చంద్ర ఆశ్రయించారు. దాదాపు రూ.22,000 కోట్ల రుణ బకాయిలకుగాను రూ.6.5 కోట్ల చెల్లింపు ప్రణాళికను ఆమోదిస్తూ మూడో న్యాయమూర్తి ఇచ్చిన ఉత్తర్వుపై నిర్ణయం తీసుకునేందుకు ఏర్పాటు చేసిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం సెప్టెంబరు 1న ఇచ్చిన స్టే ఆదేశాలను చంద్ర సవాలు చేశారు.



## మూడు రోజులు బ్యాంకుల సమ్మె

### వచ్చే ఆదివారం పనిదినమే..

**హైదరాబాద్:** ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు సమ్మె చేయనున్న నేపథ్యంలో.. ప్రత్యామ్నాయ వ్యవస్థలపై బ్యాంకులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఖాతాదారుల మొబైల్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలకు సమాచారమిస్తున్నాయి. లావాదేవీల కోసం ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ ఉపయోగించాలని, నగదు కోసం ఏటీఎంలను వాడాలని సూచిస్తున్నాయి. సమ్మె మూడు రోజులైనా.. సెలవు దినాలు (నాలుగో శనివారం, ఆదివారం) కలిపితే ఐదు రోజులవుతాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 27న (ఆదివారం) బ్యాంకులు పనిచేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో, రాష్ట్రంలోని లీడ్‌బ్యాంకు మేనేజర్లు, ప్రభుత్వ రంగ బ్యాంకుల రాష్ట్ర ముఖ్యులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సేవింగ్స్ ఖాతాదారులు ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వాడుతున్నారని, వారికి పెద్దగా ఇబ్బందులు ఉండబోవని బ్యాంకు కార్మిక వర్గాలు చెబుతున్నాయి. రుణాల మంజూరు, చెక్కుల చెల్లుబాటు, అధిక మొత్తంలో ఆర్‌టీజీఎస్, భారీ నగదు లావాదేవీలపై ప్రభావం ఉంటుందని వెల్లడించాయి. బ్యాంకు సమ్మె నేపథ్యంలో నగదు, చెక్కు లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యే చెక్కులను సిబ్బంది స్కాన్ చేసి పంపాల్సి ఉంటుంది. ఈ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్ చెక్కుల జారీ నిలిచిపోతుంది. ఏటీఎంల్లో నగదు నిల్వలు ఉన్నంత వరకు మాత్రమే పనిచేస్తాయి. నగదు నింపేందుకు కీలకమైన క్యాష్‌చెస్ట్‌లు మూడు రోజులు పనిచేయనందున తిరిగి ఆయా ఏటీఎంలలో డబ్బు నింపే ప్రక్రియ నిలిచిపోనుంది. క్యాష్ డిపాజిట్ మిషన్లు ఏదైనా సాంకేతిక సమస్య వచ్చినా, పరిమితికి మించి నగదు డిపాజిట్ పూర్తయినా నిలిచిపోతాయని బ్యాంకు వర్గాలు తెలిపాయి. బ్యాంకు సిబ్బందికి ఐదు రోజుల పనిదినాలు అడుగుతున్నాం. ఇవన్నీ ఇండియన్ బ్యాంకు అసోసియేషన్‌తో జరిగిన చర్చల్లో ఒప్పుకొన్నవే. ఇప్పటికే రెండు శనివారాల సెలవు ఉంది. మరో రెండు శనివారాల సెలవు అమలు చేయాలని అడుగుతున్నాం. ఎల్ఐసీ, ఆర్‌బీఐ, నాబార్డు లాంటి ఆర్థిక సంస్థల్లో ఇది అమల్లో ఉంది. అదనంగా రెండు శనివారాలకు సంబంధించిన 13 పని గంటలను.. రోజుకు 45 నిమిషాల చొప్పున పనిచేసి సర్దుబాటు చేస్తాం. ప్రభుత్వం మొండి పట్టుదలకు వెళ్లకూడదని జాతీయ అధ్యక్షుడు, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాంబాబు అన్నారు.

## జయహో భారత్

### 2026-27కు వృద్ధి అంచనాలు పెంచిన 4 ప్రపంచ ఏజెన్సీలు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2026-27) భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును దాదాపు 7 శాతానికి ప్రపంచ ఏజెన్సీలైన ఎస్అండ్‌పీ, ఫిచ్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), ఓఈసీడీ పెంచాయి. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల ప్రభావం ఉన్నప్పటికీ.. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో బలమైన ఆర్థిక కార్యకలాపాలు, పటిష్ఠమైన దేశీయ గిరాకీ పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాయి. అయితే అదనపు ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ప్రస్తుత సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని ఎస్అండ్‌పీ, ఫిచ్ తెలిపాయి. ఎస్అండ్‌పీ:ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాను గతంలోని 6.6 శాతం నుంచి 7 శాతానికి ఎస్అండ్‌పీ పెంచింది. తయారీ, సేవల రంగాల్లో వృద్ధి నెమ్మదించడం, సాధారణం కంటే తక్కువ వర్షపాతం కారణంగా 2026-27 ఆర్థిక సంవత్సరం మిగిలిన భాగంలో వృద్ధి మందగమనంలో సాగే అవకాశం ఉంది. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆదాయపు పన్ను కోతల నుంచి ఇప్పటివరకు లభించిన అనుకూలతలు తగ్గుముఖం పట్టడం కూడా ఇందుకు కారణం అవుతుందని పేర్కొంది. ఫిచ్:అధిక చమురు ధరల ప్రభావం ఉన్నప్పటికీ.. భారత్‌లో వృద్ధి చాలా బలంగా, దృఢమైన చైతన్యంతో కొనసాగుతోందని ఫిచ్ రేటింగ్స్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో జీడీపీ వృద్ధి అంచనాలను గతంలోని 6.4 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. జులై త్రైమాసికంలో బలమైన ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తట్టుకొని నిలబడటం లాంటి అంశాలను కూడా ఇందుకు పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది డిసెంబరులో ద్రవ్యోల్బణం 5.5 శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. ప్రపంచ జీడీపీ వృద్ధి అంచనాను 20 బేసిస్ పాయింట్లు పెంచి 2.6 శాతానికి చేర్చింది.

ఏడీబీ:పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా సరఫరా అంతరాయాలు ఏర్పడినప్పటికీ.. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో ఊహించిన దానికంటే మెరుగైన పనితీరును భారత ఆర్థిక వ్యవస్థ కనబర్చిందని ఏడీబీ తెలిపింది. పెట్టుబడులకు బలమైన గిరాకీ పరిస్థితులు, వినియోగంలో స్థిరత్వం, తయారీ, సేవా రంగాల్లో పటిష్ఠమైన వృద్ధి ఇందుకు తోడ్పడ్డాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో 2026-28 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను జులైలో అంచనా వేసిన 6.6 శాతం నుంచి 7 శాతానికి ఏడీబీ పెంచింది.

ఓఈసీడీ:పారిస్‌కు చెందిన ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) భారత జీడీపీ వృద్ధి అంచనాను 80 బేసిస్ పాయింట్లు పెంచి 7.1 శాతానికి చేర్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఒక అంతర్జాతీయ సంస్థ ఇప్పటివరకు భారత ఆర్థిక వ్యవస్థపై అంచనా వేసిన అత్యధిక వృద్ధి రేటు ఇదే. ఇంధన ధరల ప్రభావం ప్రజలపై పూర్తి స్థాయిలో పడకుండా ప్రభుత్వం చేపట్టిన విధానాలు, దేశీయంగా గిరాకీ పరిస్థితులు బలంగా కొనసాగుతుండటం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని అంచనాను పెంచినట్లు ఓఈసీడీ తెలిపింది. కాగా... గతవారం అమెరికాకు చెందిన మూడీస్ రేటింగ్స్ జీ 20 దేశాల ఆర్థిక వ్యవస్థలన్నిట్లోనూ భారతే అత్యంత వేగవంత వృద్ధిని నమోదు చేస్తోందని , ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాను 7 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.

## వంటనూనెల ధరలు తగ్గొచ్చు!

### కస్టమ్స్ సుంకం తగ్గించిన కేంద్రం



దిల్లీ: సన్‌ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్‌లోని ముడి, రిఫైన్డ్ నూనె రకాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని(బీసీడీ) కేంద్రం బుధవారం తగ్గించింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లో ధరలు తగ్గే అవకాశం ఉంది. ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనెపై బీసీడీని 10 శాతం నుంచి సున్నాకు, రిఫైన్డ్ పొద్దుతిరుగుడు పువ్వు నూనెపై 32.5 శాతం నుంచి 22.5 శాతానికి, ముడి సోయాబీన్ నూనె, పామాయిల్‌పై 10% నుంచి 5 శాతానికి, రిఫైన్డ్ సోయాబీన్, పామాయిల్‌పై 32.5% నుంచి 27.5 శాతానికి బీసీడీని తగ్గించింది. సెప్టెంబరు 24 నుంచే కోతలు అమల్లోకి వస్తాయని ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది.

# 30న సీఎం చేతుల మీదుగా నూతన కలెక్టరేట్ ప్రారంభం

- భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి.. పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవం
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు
- శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం, భవనం, సీఎం పర్యటించే ప్రాంతాలను సుందరంగా అలంకరించి, అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం నూతన కలెక్టరేట్‌ను పరిశీలించిన మంత్రి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణం, సభా ఏర్పాట్లు, కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం తదితర ప్రాంతాలను పరిశీలించారు. సీఎం రాక కోసం నిర్మించిన హెలిప్యాడ్‌ను కూడా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెలిక్యాప్టర్‌లో చేరుకున్న అనంతరం సీఎం కలెక్టరేట్‌ను ప్రారంభించి, జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లనున్నారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో మహేశ్వర్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రేకొండ రైతులకు పట్టాలిచ్చి భూముల సమస్య పరిష్కరించాలి

- రెవెన్యూ మంత్రికి మాజీ ఎమ్మెల్యే చాడ వినతి
- 60 ఏళ్లుగా సాగు చేస్తున్న రైతుల వివరాల పరిశీలన
- 103.03 ఎకరాలపై రెవెన్యూ నివేదిక
- కాలువ భూసేకరణ, సీలింగ్ కేసులను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి



**చిగురుమామిడి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలోని సర్వే నం.927తో పాటు ఇతర సర్వే నంబర్లలో దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చి భూముల సమస్య పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సుమారు 60 ఏళ్లుగా రైతులు భూములను తమ ఆధీనంలో ఉంచుకుని చదును చేసి సాగుకు అనుకూలంగా మార్చుకున్నారని, పంటల ద్వారా వచ్చే ఆదాయమే పలు కుటుంబాలకు జీవనాధారంగా ఉందని వివరించారు. గతేడాది రెవెన్యూ అధికారుల నివేదిక ప్రకారం 103.03 ఎకరాలు లబ్ధిదారుల అనుభవంలో ఉన్నట్లు నమోదైందని చాడ తెలిపారు. సర్వే నం.927లో కాలువ నిర్మాణానికి 2.09 ఎకరాలు సేకరణకు నోటిఫై చేయగా, కాలువ భాగాన్ని మినహాయించి 2.04 ఎకరాలు మిగిలినట్లు నివేదికలో పేర్కొన్నారని తెలిపారు. భూసేకరణకు సంబంధించి అవార్డు లేదా పరిహారం చెల్లింపు రికార్డులను పరిశీలించాలని కోరారు. అలాగే సీలింగ్ కేసులను పునఃపరిశీలించి, చట్టబద్ధంగా విక్రయించిన లేదా బదలాయించిన భూములను మినహాయించి వాస్తవ మిగులు భూమిని నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా సాగు చేస్తున్న అర్హులైన రైతులకు నిబంధనల మేరకు నామమాత్రపు ధరకు భూములను కేటాయించి, అసైన్‌మెంట్ చేసి పట్టాలు ఇచ్చేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రైతులు చాడ శ్రీధర్‌రెడ్డి, పరిపాటి వెంకటరెడ్డి, బావు రవీందర్, సుధాకర్, రాగుల సంపత్‌రెడ్డి, మిరియాల కనకరెడ్డి, చాడ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థి

### జిల్లాస్థాయి పోటీలకు మరో విద్యార్థిని ఎంపిక



**రాయికల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడలు, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చాటారు. ఇటీవల కోరుట్ల మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి పోతుగంటి జేశ్వంత్ లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25, 26 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జేశ్వంత్ పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరండ్ల కిరణ్‌కుమార్, పీడీ కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మండలస్థాయి ఉపన్యాస పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని మారంపల్లి వెన్నెల ద్వితీయ స్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. 'యువతకు పర్యాటక ప్రాముఖ్యత' అంశంపై వెన్నెల ప్రసంగించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, సర్పంచ్ ఎంబారీ గౌతమి–వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

# యువత వ్యాపార రంగంలో రాణించాలి

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు



**కమాన్ పూర్, సెప్టెంబర్ 24, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లి జిపి పరిధిలోని శాలపల్లె గ్రామానికి చెందిన బిల్ల హరీష్ నూతనంగా ఏర్పాటు చేసిన "రిచ్ లుక్స్ కిడ్స్ మెన్స్ వేర్" షాప్ తోపాటు జె.మల్లేష్ కు చెందిన శ్రీ ఆంజనేయ ఫర్టిలైజర్స్ షాపు ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాప్ ను ప్రారంభించి, నిర్వాహకులు కి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం అభివృద్ధి చెందుతూ మంచి పేరు సంపాదించాలని, విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జలాల్‌పూర్‌లో పిడుగు బీభత్సం... ఏడు మేకలు బలి

**తాండూరు సెప్టెంబర్ 24(జనంసాక్షి) :** నియోజకవర్గం బషీరాబాద్ మండలం జలాల్ పూర్ గ్రామంలో ప్రకృతి విషాదాన్ని మిగిల్చింది. ఆకస్మికంగా పడిన పిడుగుపాటుకు రైతు ఇసుబ్ కు చెందిన ఏడు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. పొట్టకూటి కోసం పెంచుకుంటున్న మేకలు ఒక్కసారిగా చనిపోవడంతో రైతు ఇసుబ్ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. పేద రైతుకు ఇది తీరని నష్టం. విషయం తెలుసుకున్న కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ చైర్ పర్సన్ విజయలక్ష్మి వెంటనే స్పందించారు. మానవతా దృక్పథంతో తన టీం సభ్యులను హుటాహుటిన జలాల్ పూర్ గ్రామానికి పంపించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు బాధిత రైతు ఇసుబ్ ను పరామర్శించి, ధైర్యం చెప్పి, తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత రైతుకు అండగా నిలిచిన కంజర్ల విజయలక్ష్మిని గ్రామస్తులు, రైతులు అభినందిస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని నిరూపించారని కొనియాడుతున్నారు.

# రైతులకు విద్యుత్, సాగునీరు ఇవ్వాలి

### యాదాద్రి ప్లాంట్ వద్ద బీఆర్ఎస్ ధర్నాలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



**మిర్యాలగూడ, జనంసాక్షి :** రైతులకు అవసరమైన సమయంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రెండు పంటలకు సరిపడా సాగునీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించాలని, పంటలు ఎండిపోకుండా సాగునీటిని విడుదల చేయాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తి, ప్లాంట్ పనితీరుపై వివరాలు తెలుసుకునేందుకు ఆయన ప్లాంట్‌లోకి వెళ్లి అధికారులతో మాట్లాడారు. ధర్నాకు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ప్లాంట్‌లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, గాదరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అంబారిపేట విద్యార్థిని ఎంపిక

**కథలాపూర్ (జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలోని అంబారిపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చెందిన అరికంటి లహర్ష పదవ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు, కోరుట్లలోని మినీ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో 60 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది ఈనెల 26 27 తేదీలలో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు హెచ్ ఎం కిసాన్ రావు మరియు పిడి రాజేష్ తెలిపారు.



# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

### హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి);** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ లో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకొని, వారి హాజరు రిజిస్టర్ పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి, కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఈ రోజు ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయో పరిశీలించారు. అనంతరం వసతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు హాస్టల్ లో వసతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదవాలని, అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# యాలాల రైతుల జీవనాడిపై తవ్వకాల నీడ!



- కాక్రవేణిని కాపాడేదెవరు.. ఇసుక దందాకు అడ్డెవరు?
- కొద్దిరోజుల విరామమేనా.. మళ్లీ పునరావృతమా?
- రాజకీయ అండదండల ఆరోపణలపై సమాధానం చెప్పేదెవరు?
- కొడంగల్ గడ్డ నుంచే సహజ వనరులపై నిఘా మొదలవ్వాలా?

**యాలాల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** యాలాల మండలంలోని కాక్రవేణి జలవనరుపై ఇసుక తవ్వకాలు, రవాణా వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజులు తవ్వకాలు కనిపించకపోతే వ్యవహారం ముగిసినట్టేనా? లేక పరిస్థితులు చల్లబడగానే మళ్లీ అదే తతంగం మొదలవుతుందా? అన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లాలో ఉండగా.. అదే జిల్లాలోని యాలాల ప్రాంతంలో సహజ జలవనరుపై ఇలాంటి ఆరోపణలు రావడం ప్రభుత్వ ఉన్నతస్థాయి దృష్టికి వెళ్లాల్సిన అంశంగా మారింది.

కాక్రవేణి కేవలం ఇసుక వనరు కాదు.. రైతుల జీవనంతో ముడిపడిన సహజ జలవనరు. వ్యవసాయం, భూగర్భ జలాల పరిరక్షణకు దీనికి ప్రాధాన్యత ఉంది. కాక్రవేణి–కాగ్నా జలవ్యవస్థను అభివృద్ధి చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉండగా.. మరోవైపు ఇసుక తవ్వకాలు, రవాణాపై అనుమానాలు వ్యక్తమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### అనుమతులెన్ని.. తవ్వకాలు ఎంత?

కాక్రవేణిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత పరిమాణానికి? వాస్తవంగా ఎంత ఇసుక తవ్వుతున్నారు? ఎక్కడి నుంచి ఎంత తరలిస్తున్నారు? ఎక్కడికి తీసుకెళ్తున్నారు? రవాణా నిబంధనలు పాటిస్తున్నారా? పర్యావరణ ప్రమాణాలు అమలవుతున్నాయా? అన్న అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇసుక నిర్మాణ రంగానికి అవసరమే. కానీ అవసరాన్ని మించి సహజ వనరుపై ఒత్తిడి పెరిగితే దాని ప్రభావం చివరకు రైతుపైనే పడుతుంది. నది సహజ ప్రవాహం దెబ్బతినడం, భూగర్భ జలాలపై ప్రభావం పడటం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గడం వంటి పరిణామాలు ఏర్పడితే నష్టం మొత్తం ప్రాంతానిదే. ఇసుక లాభం కొందరికే.. నీటి నష్టం మాత్రం అందరికీ.

### ముఖ్యమంత్రి స్థాయిలో నిఘా అవసరమేనా?

కొడంగల్ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షలు నిర్వహిస్తూ నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో.. అదే జిల్లాలోని కాక్రవేణి వంటి సహజ వనరుపై వస్తున్న ఆరోపణలు, అనుమానాలపై కూడా ఉన్నతస్థాయి దృష్టి అవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కింది స్థాయి అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా మైనింగ్, రెవెన్యూ, నీటిపారుదల, పర్యావరణ శాఖలతో సంయుక్త తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం తేల్చాలి. అనుమతులు, తవ్వకాలు, రవాణా, పర్యావరణ ప్రభావంపై సమగ్ర నివేదిక తెప్పించాలి. కాక్రవేణి నుంచి ముఖ్యమంత్రి నియోజకవర్గానికి ఇసుక తరలిపోతోందన్న ప్రచారం నిజమా? అనుమతులతో జరుగుతున్న రవాణానా? లేక అపోహనా? ప్రభుత్వం స్పష్టం చేయాలి. వాస్తవాలు బయటకు వస్తే ప్రజల్లోని అనుమానాలకు తెరపడుతుంది. "కొద్దిరోజులు ఆగి.. మళ్లీ మొదలు" అనే అనుమానానికి తావులేకుండా కాక్రవేణిపై నిరంతర నిఘా, పారదర్శక రికార్డులు, ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిక వివరాలు అవసరం.





## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మన అంగన్వాడి మనందరి బాధ్యత

**మల్యాల సెప్టెంబర్ 24 (జనం సాక్షి) :** ముత్యంపేట గ్రామపంచాయతీలో 9వ పోషణ మాసంలో భాగంగా"మన అంగన్వాడి మనందరి బాధ్యత"అనే అంశంతో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లులకు పోషకాహారం గురించి వివరించి,పోషకాలు గల ఆహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని,వ్యాధులు రాకుండా టైం ప్రకారం టీకాలు వేయించాలని,మన పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి నీటిని త్రాగాలని,ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవా లని తెలిపారు.పోషకాహారం పై క్విజ్ పోటీ నిర్వహించి గెలిచినవారికి 4 గురు తల్లులకు బహుమతులు అందజేశారు. 5 గురు చిన్నారులకు అన్నప్రా శన చేయించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి సర్పంచ్ దారం ఆదిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ సర్,ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి,వార్డు మెంబర్లు, సీడీపీఓ వీరలక్ష్మి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు, సూపర్ వైజర్ శారద, పంచాయతి సెక్రటరీ, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్స్, శోభ, గంగా, శారద, మమత, పద్మ, గర్భవతులు, బాలింతలు, తల్లులు, హాజరయ్యారు.

# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

- అట్రాసిటీ కేసుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు
- పెండింగ్ సమస్యలపై శాఖల సమన్వయం
- సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందాలి
- మౌలిక వసతులపై ప్రత్యేక పర్యవేక్షణ



**రంగారెడ్డి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను సూచించారు. గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, చంద్రారెడ్డి, డీసీపీ కె.నారాయణరెడ్డితో కలిసి పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల పురోగతి, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, మౌలిక వసతులపై చర్చించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, నష్టపరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చూడాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిబంధనల మేరకు పరిష్కరించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, ఆవాస ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, విద్యా సంస్థల పరిస్థితిని అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై అప్రమత్తంగా ఉండి బాధితులకు తక్షణ సహాయం అందించాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ అట్రాసిటీ బాధితుల నష్టపరిహారం, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలకు సంబంధించిన వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం భారీ బహిరంగ సభ విజయవంతం చేయండి : విప్ ఆది శ్రీనివాస్



**సిరిసిల్ల, సెప్టెంబర్ 24(జనం సాక్షి) :** సెప్టెంబర్ 30న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంలో జరిగిన సన్నాహక సమావేశంలో స్థానిక సర్పంచ్ గండి నారాయణ, ఎఎంసి చైర్మన్ చేలుకల తిరుపతి తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత రంగానికి గత ప్రభుత్వం పెట్టిన రూ.300 కోట్ల బకాయిలు చెల్లించామని, గత ఏడాది 6.66 కోట్లు, ఈ ఏడాది 4.60 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లు, కలికోట సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణకు రూ.80 కోట్లు విడుదల చేశామన్నారు. 22–ఏ జాబితాలో ఉన్న పేదల ఇళ్లకు పట్టాలు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధరణి పేరుతో జరిగిన భూ బదలాయింపులు, ఫామ్ హౌస్‌ల చుట్టూ ఉన్న భూములపై ప్రభుత్వం విచారణ చేస్తుందన్నారు.

ప్రతి గ్రామం నుంచి ప్రజలను బస్సుల ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు పెట్టాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎర్రం గంగ నరసయ్య, గట్ల మీనయ్య తూమ్ జలపతి, రిటైర్డ్ ఏ. ఈ లక్ష్మణ్, జూల దిలీప్, మోహన్, జక్కులింగారెడ్డి జక్కుల లక్ష్మణ్, తిక్క భూమయ్య, వంశీ, సింగిల్ విండో డైరెక్టర్లు తర్రె మనోహర్, ధర్నా మల్లేశం, మాడిశెట్టి అభిలాష్, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్, తర్రె లింగం, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, ఉమ్మడి మానాల గ్రామాల సర్పంచులు, పెద్ద ఎత్తున రుద్రంగి, ఉమ్మడి మానాల గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైన్ షాపులు బంద్ సరే.. మరి బెల్టుషాపుల సంగతేంటి.?

- కొందుర్గు మండలంలో మినీ వైన్ షాపుల బాగోతం
- ఉన్నతాధికారుల ఆదేశాలకు కింది స్థాయిలో గండి



**కొందుర్గు,జనంసాక్షి:** వినాయక చవితి నవరాత్రుల ముగింపు, నిమజ్జన ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం వైన్ షాపుల బంద్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే, రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలో మాత్రం ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యేలా కనిపిస్తున్నాయి. అధికారిక వైన్ షాపులు మూతపడనున్న నేపథ్యంలో, మండలంలోని పలు గ్రామాల్లో వెలిసిన 'మినీ వైన్ షాపులు' (బెల్టుషాపులు) ముందస్తుగానే మద్యం నిల్వలతో సిద్ధమయ్యాయి. వైన్ షాపుల నిర్వాహకుల సహకారం, కిందిస్థాయి ఎక్సైజ్, పోలీసు అధికారుల ప్రోత్సాహంతోనే ఈ బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిమజ్జనం రోజున వైన్ షాపులు బంద్ కానుండటాన్ని ఆసరాగా చేసుకుని, బెల్టుషాపుల నిర్వాహకులు భారీగా మద్యం బాటిళ్లను ముందస్తుగానే గ్రామాల్లోని తమ రహస్య స్థావరాలకు చేరవేశారు. పండగ పూట మద్యం దొరకని వారిని టార్గెట్ చేస్తూ, నిమజ్జనం రోజున డబుల్ రేట్లకు విక్రయించి సొమ్ము చేసుకోవడానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. అధికారిక దుకాణాలు బంద్ ఉన్నా, గల్లీ గల్లీలో మద్యం విక్రయాలు సాగించేందుకు వైన్ షాపుల యాజమాన్యాలే వీరికి స్టాక్ సరఫరా చేయడం గమనార్హం.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉన్నతాధికారులు కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కిందిస్థాయి సిబ్బంది మాత్రం బెల్టుషాపుల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్లు అందుతుండటం వల్లే క్షేత్రస్థాయి సిబ్బంది మౌనం వహిస్తున్నారని, ఈ వ్యవహారం వెనక ఎన్నో సందేహాలు ఉన్నాయని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే బెల్టుషాపుల నిర్వాహకులు బరితెగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో పండగ వాతావరణాన్ని చెడగొడుతూ, బెల్టుషాపుల కారణంగా యువత మద్యాన్ని బానిసవుతుండటంపై స్థానిక మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండగ రోజుల్లోనైనా ఈ అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, కొందుర్గు మండలంలో విస్తరించిన బెల్టుషాపులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, నిమజ్జనం వేళ అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, మహిళా సంఘాలు కోరుతున్నాయి.

# స్మార్ట్ అసెస్‌మెంట్ పోర్టల్‌పై అవగాహన ఉండాలి


- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అదనపు కలెక్టర్ సూచన
- ప్రతి రవాణా వాహనానికి జీపీఎస్ తప్పనిసరి
- ఏడు రకాల సన్న ధాన్యమే సేకరణ
- కొనుగోలు కేంద్రాల్లో పరికరాలు అందుబాటులో ఉంచాలి



పెద్దపల్లి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సాక్ష్యాల పరిశీలనకు ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ స్మార్ట్ అసెస్‌మెంట్ పోర్టల్‌ను సమర్థంగా వినియోగించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధ ఆధారితంగా పనిచేసే ఈ పోర్టల్‌లో ఏఐ ఎనేబుల్డ్ ఎవిడెన్స్ వెరిఫికేషన్ ద్వారా ఫొటో సాక్ష్యాలతో కేంద్రాల నిర్వహణను పరిశీలించవచ్చని తెలిపారు. ధాన్యం రవాణా వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ఏర్పాటు చేసి, వాటి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యాన్ని మాత్రమే ఈసారి సేకరించనున్నట్లు తెలిపారు. క్లస్టర్ వారీగా నిర్వహించే విలేజ్ సర్వేలో గుర్తించిన వరి రకాల ఆధారంగా ఆయా కేంద్రాల్లో కొనుగోళ్లు చేపడతామని పేర్కొన్నారు. కొనుగోళ్ల పర్యవేక్షణకు తహసీల్దార్, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలు పనిచేస్తాయని వివరించారు. ప్రతి కేంద్రంలో గన్నీ బ్యాగులు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, తూకం, తేమశాతం కొలిచే పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా జరగాలి

- ఎన్నికల అబ్జర్వర్ ఇళంబర్తి ఆదేశం
- ఎన్యూమరేషన్ నోటీసుల జారీలో పారదర్శకత
- సందేహాలు, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలి
- క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలన




వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఓటర్ల జాబితా సవరణ అబ్జర్వర్ ఇళంబర్తి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల తహసీల్దార్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ పురోగతి, ఓటర్ల సంఖ్య, జారీ చేసిన ఎన్యూమరేషన్ నోటీసులు, పెండింగ్ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి కచ్చితంగా మ్యాపింగ్ చేయాలని, అర్హులైన వారికి నిర్ణీత విధానంలో నోటీసులు అందజేసి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.
అలంపల్లి ప్రాంతంలోని పీఎస్ నంబర్లు 169, 170తో పాటు మోతీనగర్ బాలికల ప్రాథమిక పాఠశాలలోని పీఎస్ నంబర్లు 150, 151, 152 పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి ఓటర్ల జాబితాపై ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. 2022 ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ ప్రస్తుత ఎస్ఐఆర్‌లో కనిపించడం లేదని, వయస్సు, పుట్టిన తేదీ వంటి వివరాల్లో సమస్యలు ఉన్నాయని ప్రతినిధులు తెలిపారు. సంబంధిత పత్రాలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని అబ్జర్వర్ సూచించారు. అభ్యంతరాలు, సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, అర్హులైన ఓటర్ల వివరాలు జాబితాలో సక్రమంగా ఉండేలా చూడాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, డీఆర్వో స్వర్ణలత, ఆర్డీవోలు వాసుచంద్ర, తాండూర్ అనిత, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారి నెమత్ హోలీ, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# కాస్లాబాద్ నుంచి దుబ్బ తండాకు నిలిచిన రాకపోకలు

**చెరువు అలుగును పరిశీలించిన తహశీల్దార్**



పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 24 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండలంలోని కాస్లాబాద్ గ్రామ చెరువు నిండుకొని అలుగు పారడంతో దుబ్బ తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. వివిధ పనుల నిమిత్తం కాస్లాబాద్ వైపు వెళ్లే తండావాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా గురువారం తహశీల్దార్ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, నీటి ప్రవాహం తగ్గేవరకు అత్యవసరం అయితే తప్ప ఈ మార్గంలో ప్రయాణించవద్దని సూచించారు. పీఆర్ ఏఈకి సమస్యను తెలిపినట్లు, శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన బ్రిడ్జి నిర్మాణానికి నివేదికను సిద్ధం చేయవలసిందిగా సూచించినట్లు తెలిపారు. నీటి ప్రవాహం తగ్గేవరకు అత్యవసరం అయితే తమకు సమాచారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు సతీశ్ యాదవ్, తదితరులు ఉన్నారు.




# వరికి కనీస మద్దతు రూ 3 వేలు చెల్లించాలి

**మినార్ పల్లి మహాజన సభలో రైతుల తీర్మానం**

బోధన్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : ఆరుకాలం శ్రమించి పంట పండిస్తున్న రైతులకు వరి ధాన్యం గిట్టుబాటు ధర లభించకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అందువల్ల వారికి కనీస మద్దతు క్వింటాలకు 3వ్వేలు చెల్లించాలని గురువారం బోధన్ మండలం మినార్ పల్లి గ్రామంలో జరిగిన మహాజన సభలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మినార్ పల్లి సహకారం ఆధ్వర్యంలో వార్షిక మహాజనసభ సంఘ అధ్యక్షులు మెట్ల రవీంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం ద్వారా వరి ధాన్య ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఫర్టిలైజర్ యాప్ ను తొలగించి పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఎరువులకు లింకు లేకుండా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. యూరియా కొనుగోలు చేసే రైతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే రుసుమును చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి కందికట్ల హన్మండ్లు, డైరెక్టర్లు రెడ్డి మాసు వెంకటేశ్వరరావు, సర్పంచ్ మూడ్ పద్మ తారాచంద్, మాజీ సహకార సంఘం చైర్మన్ షాకీర్ పటేల్, మోతీ రామ్, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధం కోసం అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి

**ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దండు వరలక్ష్మి**



శంకరపట్నం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): మద్యపాన నిషేధం కోసం అక్టోబర్ 2న కరీంనగర్ కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దండు వరలక్ష్మి తెలిపారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం శంకరపట్నం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో మద్యపాన నిషేధం, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యపానం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. మద్యపాన నియంత్రణ, నిషేధం కోసం చేపట్టనున్న ఉద్యమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి ప్రజలను సమీకరించాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కోఆర్డినేటర్, రాష్ట్ర సీనియర్ నాయకురాలు గడ్డం కొమరవ్వ, రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆడెపు నరసయ్య, శంకరపట్నం మండల అధ్యక్షుడు కోదూరి మహేష్, మాజీ ఎంఎస్పీ అధ్యక్షుడు కలకోట సమ్మయ్య, ఎంఎస్పీ అధ్యక్షురాలు మాతంగి లచ్చవ్వ, అధికార ప్రతినిధి మాతంగి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బ్రసెల్స్ కార్గో అనుసంధానానికి ఎంఓయూ




శంషాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : యూరప్‌తో వాయు కార్గో అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జిహెచ్ఐఏఎల్), బ్రస్సెల్స్ విమానాశ్రయం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈఓ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ, హైదరాబాద్‌ను యూరప్ కార్గో వ్యవస్థతో మరింత అనుసంధాని ంచేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుం దని తెలిపారు. బ్రస్సెల్స్ విమానాశ్రయం సీఈఓ ఆర్నాడ్ ఫీస్ట్ మాట్లాడుతూ, ఫార్మా లాజిస్టిక్స్‌లో బ్రస్సెల్స్ నైపుణ్యం, హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగంతో కలవడం ద్వారా కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఎంఓయూలో భాగంగా మార్గాల అభివృద్ధి, మార్కెట్ సమాచారం, కార్గో రంగంలోని ఉత్తమ విధానాల మార్పిడి, విమానయాన సంస్థలు, ఫ్రైట్ ఫార్వార్డర్లతో సమన్వయం వంటి అంశాల్లో రెండు విమానాశ్రయాలు కలిసి పనిచేయనున్నాయి. హైదరాబాద్-బ్రస్సెల్స్ మధ్య భవిష్యత్ కార్గో కనెక్టివిటీ అవకాశాలను కూడా పరిశీలించనున్నాయి.

# జన్మదిన వేడుకల పేరిట డబ్బు వృథా చేయొద్దు

- విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు ఖర్చు చేయాలి
- ఫోన్లకు దూరంగా.. చదువుపై దృష్టి పెట్టాలి
- గుండ్లపల్లి-పొత్తూరు రోడ్డు పనులు త్వరలో పూర్తి



గన్నేరువరం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): జన్మదిన వేడుకల పేరుతో ఆర్భాటంగా డబ్బు ఖర్చు చేయకుండా విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు వెచ్చించాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. జంగపల్లి గ్రామ సర్పంచ్ తాడూరి కరుణశ్రీ--రమణారెడ్డి దంపతుల కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జన్మదినం సందర్భంగా సొంత ఖర్చులతో విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం అభినందనీయమన్నారు. పిల్లలు కూడా పుట్టినరోజుల సందర్భంగా తోటి విద్యార్థులకు పుస్తకాలు అందించే అలవాటు పెంచుకోవాలని సూచించారు.
విద్యార్థులు సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి చదువుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. టీవీ, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ క్రీడలు, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. హోంవర్క్ పూర్తి చేయడంతో పాటు ప్రతిరోజూ వార్తాపత్రికలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. గుండ్లపల్లి-పొత్తూరు మార్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేయిస్తామని తెలిపారు. గత కాంట్రాక్టర్‌కు బకాయిల చెల్లింపుల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని, సమస్యను పరిష్కరించి రహదారి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం పూర్తయిన రహదారిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపీడీవో సురేందర్, ఎంఈవో రామయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కటకం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయిలో క్రీడా సంబరాలు

**క్రీడా జ్యోతి వెలిగించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి**

ఇందల్వాయి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): సిర్నాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇందల్వాయి మండల స్థాయి క్రీడోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్.భూపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పుస్తకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడాకారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించగా, విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. యువతను మైదానాల వైపు మళ్లించి చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, ధర్పల్లిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పాఠశాల సిబ్బంది, పీఈటీలు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఖైదీలు సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలి





**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.శ్రీదేవి**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) : ఖైదీలు తమ న్యాయపరమైన సమస్యలను స్వేచ్ఛ గా తెలియజేసేలా న్యాయ సేవలు అందుబాటులో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), సెషన్స్ డివిజన్, నాంపల్లి హైదరాబాద్ కార్యదర్శి ఏ.శ్రీదేవి అన్నారు. గురువారం చంచల్ గూడలోని పురుషుల జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్, డీ-అడిక్షన్ సెంటర్‌తో పాటు మహిళా జైలును పలువురు అధికారులతో కలిసి ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందు తున్న న్యాయ సహాయం, ఉచిత న్యాయ సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం అవసరమైన ఖైదీలకు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ను పరిశీలించారు. ఖైదీలు తమ న్యాయపరమైన సమస్యలను స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సేవ లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచిం చారు. డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారి పరిస్థితులను తెలుసుకుని, వారికి అవసర మైన సహాయ సహకారాలపై అధికారులతో చర్చిం చారు. అనంతరం చంచల్‌గూడ మహిళా జైలును సందర్శించి మహిళా ఖైదీలకు అందుతున్న న్యా య సేవలు, ఆరోగ్యం, సంక్షేమంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం అవస రమైన ప్రతి ఖైదీకి తగిన సహాయం అందేలా చూ డాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్లు శివకుమార్ గౌడ్, అమరావతి, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో సమీక్ష
- ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లపై ప్రత్యేక పరిశీలన
- అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా మాక్ డ్రిల్స్
- లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో చిన్నారులకు వైద్య సేవలందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. చిన్నారుల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాదాల నివారణపై చర్చించారు. ఫైర్ సేఫ్టీ పరికరాల అందుబాటు, పనితీరు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం, విద్యుత్ భద్రత, సిబ్బందికి శిక్షణ, రోగులను సురక్షితంగా తరలించే విధానాలను పరిశీలించారు. పోలీస్, ఫైర్ సర్వీసెస్, వైద్య సిబ్బంది సమన్వయంతో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీపీ సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ ఎన్.శుభం ప్రకాష్, జిల్లా ఫైర్ అధికారి టి.పరమేశ్వర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ విశాల్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ పి.వి.రాజేశ్వర్‌రావు, ఇతర పోలీస్, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు, చిన్నారుల వైద్యులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని వైన్స్ షాపులు బంద్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 జనం సాక్షి: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని గణేష్ నిమజ్జనాల బందోబస్తులో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల ప్రజలందరికీ సెక్షన్ 20(1) తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారంగా జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో గల కళ్ళు దుకాణాలు , కల్లు డిపోలు , ఐ.ఎమ్.ఎల్ షాప్స్ / 2-బి బార్స్ / క్లబ్బులు / టిడి-1 మరియు టి.యస్.బి.సి.ఎల్ మొదలగునవి తేదీ 25 సాయంత్రం 6 గంటల నుండి తేది 27 ఉదయం 6 గంటల వరకు రెండు రోజులు వైన్సులు మూసి వేయబడునని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

## నిజాంసాగర్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం


**అచ్చంపేటలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన**

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యమన్న ఎమ్మెల్యే

నిజాంసాగర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): నిజాంసాగర్ మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. అచ్చంపేట గ్రామంలో ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించేందుకు నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమం లో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శలు
- 34 నెలల్లో చేసిన అభివృద్ధిపై సమాధానం చెప్పాలని డిమాండ్
- రైతుల సాగునీరు, యూరియా సమస్యలు పరిష్కరించాలి
- ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో కౌంట్‌డౌన్ ప్రారంభమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై విమర్శలు చేశారు. రైతులు ఎరువులు, సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం వాటిపై దృష్టి సారించాలని సూచించారు. మధ్యమానేరు జలాశయంలో నీరు ఉన్నప్పటికీ మల్కపేట రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి రైతులకు సాగునీరు అందించడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా పంపిణీలో జిల్లాను యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు.
వేములవాడ నియోజకవర్గంలో 34 నెలల పాలనలో జరిగిన అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రజలకు వివరించాలని చల్మెడ ప్రశ్నించారు. రుద్రంగిలో 30 పడకల ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు చేయడం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ, వ్యవసాయ కళాశాల, నర్సింగ్ కళాశాల, అపెరల్ పార్క్ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని, ప్రజల తీర్పే అంతిమమని చల్మెడ అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పుల్కం రాజు, నిమశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, గోస్కుల రవి, గోలి మహేష్, సీరిగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం పనులు వారానికే కూలిన డ్రైనేజీ కాల్వ



మల్యాల సెప్టెంబర్ 24 (జనం సాక్షి) : అధికారుల నిర్లక్ష్యం,కాంట్రాక్టర్ల స్వార్థం వల్ల బిల్లుల కోసం లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా తాటిపెల్లి గ్రామం ఓర్రెలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ రక్షణ గోడ కట్టిన కేవలం 7 రోజులకే కాల్వ గోడలు పూర్తిగా బీటలు వారి, కూలిపోయిందని బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటస్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిర్మాణంలో జరిగి న అవినీతి,నాసిరకం పనుల వల్ల చిన్న వర్షానికే కట్టిన వారానికే డ్రైనేజీ కూలిందని ఉన్నతాధికారులు స్పందించి నాసిరకం పనులపై తక్షణమే విచారణ జరిపించాలని బాధ్యులైన కాంట్రాక్టర్ సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షం లో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని టైటస్ హెచ్చరించారు.

# ప్రణయ్ హత్య కేసు ఖైదీ చర్లపల్లి జైల్లో మృతి



కాప్రా, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : ప్రేమ వివాహం చేసుకున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతిచెందాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో బారీ నాల్గో నిందితుడు. గుజరాత్ చెందిన మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అబ్దుల్ బారీ నిందితుడిగా ఉన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన, నల్గొండ జిల్లా మిర్యాలగూడలో 2018లో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు గతేడాది మార్చిలో సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రథమ ముద్దాయి తిరునగరు మారుతీరావు.. 2020లో హైదరాబాద్ లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతని పై విచారణను న్యాయస్థానం అప్పుడే నిలిపివేసింది. ఐదేళ్ల తొమ్మిదినెలల సుదీర్ఘ విచారణ తర్వాత.. హత్యలో కీలక పాత్రధారి సుభాష్ కుమారశర్మకు ఉరిశిక్ష, ఏ3: అస్గర్ అలీ. ఏ4: అబ్దుల్ బారీ, ఏ5:అబ్దుల్ కరీం, ఏ6: శ్రవణ్ కుమార్ (మారుతీరావు తమ్ముడు), ఏ7: శివ (మారుతీరావు కారుడ్రైవర్), ఏ8: నిజాం (ఆటోడ్రైవర్)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం అప్పట్లో తీర్పు ఇచ్చింది.

## గంజాయి కేసులో నిందితుడి ఆస్తుల జప్తు

- రూ.21.15 లక్షల విలువైన కార్లు, బైక్, బ్యాంక్ ఖాతా సీజ్



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి ఆస్తులను పోలీసులు జప్తు చేశారు. ఆర్థిక దర్యాప్తులో భాగంగా నిందితుడి పేరుతో ఉన్న రెండు కార్లు, ఒక మోటార్‌సైకిల్‌తో పాటు అతని భార్య బ్యాంక్ ఖాతాను సీజ్ చేసినట్లు ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. 2025 ఆగస్టు 28న ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 136/2025, ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సెక్షన్ 8(సీ) రెడ్ విత్ 20(బి)(ఐఐ)(సీ), 27(ఏ), 29 కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు పల్లపు రఘు గంజాయి అక్రమ కొనుగోలు, రవాణా ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన పోలీసులు వాటిపై ఆర్థిక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా రఘు పేరుతో ఉన్న రెండు కార్లు, ఒక మోటార్‌సైకిల్, అతని భార్యకు సంబంధించిన బ్యాంక్ ఖాతాను గుర్తించారు. అనంతరం చెన్నై కాంపిటెంట్ అథారిటీ నుంచి ఫ్రీజింగ్ ఆర్డర్ పొందడంతో పాటు, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు సదరు ఆస్తులు, బ్యాంక్ ఖాతాను జప్తు చేసినట్లు సీఐ వెల్లడించారు. జప్తు చేసిన ఆస్తులు, బ్యాంక్ ఖాతాలోని మొత్తం విలువ సుమారు రూ.21,15,907గా ఉన్నట్లు తెలిపారు. పల్లపు రఘు (35), ఎల్లయ్య కుమారుడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రఘు సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం మండేపల్లి గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. గంజాయి అక్రమ కొనుగోలు, రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు, నేరం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసిన ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## గణేష్ నిమజ్జనం సేవల్లో హైడ్రా

- పహారాలో 234 మంది హైడ్రా స్విమ్మర్లు
- వీరికి తోడు 51 డీఆర్ఎఫ్ బృందాలు



**హైదరాబాద్, సెప్టెంబరు 24 (జనంసాక్షి) :** భక్తిశ్రద్ధలతో పూజలనంతరం గణనాథుడి నిమజ్జన కార్యక్రమానికి నగర ప్రజలు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే కొన్ని విగ్రహాలు నిమజ్జనం పూర్తి చేయగా.. శుక్రవారం ప్రధాన నిమజ్జన ఘట్టం ప్రారంభం కానుంది. భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా హైడ్రా ఏర్పాట్లు చేసింది. కూకట్ పల్లి ఐడీఎల్ చెరువు అభివృద్ధి పనులు పూర్తవ్వనప్పటికీ.. గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా.. ఏకంగా 25 అడుగుల మేర చెరువును తవ్వి నిమజ్జనాలు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేసింది హైడ్రా. ఈ ఏర్పాట్లు ఇలా ఉండగా.. హుస్సేన్‌సాగర్‌తో పాటు నిమజ్జనం పెద్ద సంఖ్యలో జరిగే చెరువులలో హైడ్రా స్విమ్మర్లను రంగంలోకి దించింది. హుస్సేన్‌సాగర్లో మూడు షిఫ్టులలో చెరి 50 మంది చొప్పున మొత్తం 150 మంది స్విమ్మర్లను అందుబాటులోకి తెచ్చింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరో 84 మంది స్విమ్మర్లను విధుల్లో ఉంచింది. వీరికి అదనంగా 51 డీఆర్ఎఫ్ బృందాలు నిమగ్నమయ్యాయి. గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మిగతా శాఖలతో కలిసి హైడ్రా చర్యలు తీసుకుంటోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

# పోరాటాలతోనే మహిళలకు సమానత్వం

- డంపింగ్ యార్డ్ సమస్యపై మహిళల ఉద్యమం ఉధృతం చేయాలి
- ప్రశ్నించడం, ప్రతిఘటించడం, నాయకత్వం వహించడమే మార్గం
- చైతన్య మహిళాసంఘం 32వ ఆవిర్భావ దినం సందర్భంగా వక్తల అభిభాషణ





**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మహిళలు ప్రశ్నించడం, ప్రతిఘటించడం, పోరాటాలకు నాయకత్వం వహించినప్పుడే కుటుంబంలోనూ, సమాజంలోనూ సమానత్వం సాధ్యమవుతుందని చైతన్య మహిళాసంఘం (సీఎంఎస్) రాష్ట్ర కో-కన్వీనర్ రాధ అన్నారు. సీఎంఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ప్రతిఘటనా పోరాటాల్లో మహిళలు' అంశంపై బుధవారం బాలాజీనగర్‌లోని నైస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సభ నిర్వహించారు. సభకు ముందు మహిళలు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. సీఎంఎస్ ప్రతినిధి ఈ.జయ మాట్లాడుతూ వరకట్నం, బాల్యవివాహాలు, విద్య వంటి సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో 1995లో సంఘం ఏర్పడిందన్నారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూనే మహిళా సమస్యలపై పోరాడి విజయాలు సాధించిందని తెలిపారు. కొద్దిమంది మహిళలు వివిధ రంగాల్లో సాధించిన విజయాలను చూపిస్తూ మహిళల పరిస్థితి మారిందని చెబుతున్నప్పటికీ, 70 శాతం మంది మహిళలు ఇప్పటికీ పేదరికం, లైంగిక హింసను ఎదుర్కొంటున్నారని అన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని సాగుతున్న పోరాటంలో సీఎంఎస్ కూడా భాగస్వామిగా ఉందని, బస్తీవాసులతో కలిసి సమస్యపై పోరాడుతున్నామని తెలిపారు.

సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర కన్వీనర్ జ్యోతి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ సమస్య నేపథ్యంలోనే సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగినులు, బస్తీల్లో పనిచేసిన అనుభవంతో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళల నాయకత్వంలోనే ఉద్యమాలు విజయవంతమవుతాయని అన్నారు. పర్యావరణ కార్యకర్త దీక్ష వంగూరు మాట్లాడుతూ గత తరాల మహిళలు సాగించిన పోరాటాల ఫలితంగానే నేటి తరం మహిళలు చదువుకునే అవకాశం పొందిందన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో అడవుల విధ్వంసం, పర్యావరణ నాశనంపై పాలకుల తీరును విమర్శించారు. చిప్కో ఉద్యమం నుంచి నేటి వరకు పర్యావరణ పరిరక్షణ పోరాటాల్లో మహిళలు కీలకంగా ఉన్నారని తెలిపారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్, వాయు కాలుష్యం వల్ల మహిళలే ఎక్కువగా నష్టపోతున్నారని అన్నారు. స్వచ్ఛమైన నీరు, గాలి అందని పరిస్థితిపై ప్రశ్నించారు. దేశ రాజధానిలోనూ మహిళలకు రక్షణ లేకపోతే ఇదేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో ప్రతిపాదిత డేటా సెంటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించి వాటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



జవహర్‌నగర్ పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన మహేశ్వరి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ కారణంగా పలువురు మృతి చెందారని అన్నారు. వైఎస్సార్‌నగర్‌కు చెందిన శారద మాట్లాడుతూ పోరాడి, దెబ్బలు తిని ఇళ్లు సాధించుకున్నామని, ఆ పోరాటంలో సీఎంఎస్ సహకరించిందన్నారు. డంపింగ్ యార్డ్ రాకముందు నీరు, వాతావరణం బాగుండేవని, ఇప్పుడు కిటికీలు తెరిచి పడుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు, అబార్షన్లు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి క్యాపింగ్ సాధించినా డంపింగ్ యార్డ్ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని అన్నారు. పీకేఎం నుంచి రాజనరసింహ, పీడీఎం నుంచి చంద్రమౌళి, అమరుల బంధుమిత్రుల కమిటీ నుంచి భవానీ, టీపీఎఫ్ నుంచి నాగభూషణం, భారత నాస్తిక సంఘం నుంచి జి.డి. సారయ్య, మాదిగ కళాబృందం నుంచి రామచంద్రయ్య మహిళా ఉద్యమాలకు మద్దతు తెలిపారు.

రాష్ట్ర కో-కన్వీనర్ రాధ మాట్లాడుతూ పేపర్ లీకులపై జరిగిన జంజీ ఉద్యమంతో పాటు వివిధ ప్రజా పోరాటాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నాయకత్వం వహించారని తెలిపారు. ప్రధాన మీడియా ప్రాధాన్యత ఇవ్వకపోయినా సోషల్ మీడియా ద్వారా ఆయా ఉద్యమాలు ప్రజల్లోకి వెళ్లాయని అన్నారు. మహారాష్ట్రలో కెన్-బెట్వా ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఆదివాసీ మహిళలు చేస్తున్న పోరాటాలను వివరించారు. డేటా సెంటర్లు, ఇథనాల్ పరిశ్రమలు, మణిపూర్ సమస్య, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తదితర అంశాలపై మహిళలు పోరాడుతున్నారని తెలిపారు. సభలో మహిళా ఉద్యమాలు, డంపింగ్ యార్డ్ సమస్యలపై పాటలు, స్కిట్లు ప్రదర్శించారు. 'ఓ మహిళా లోకమా' పాటకు స్థానిక పిల్లలు ప్రదర్శన ఇవ్వగా, డంపింగ్ యార్డ్ సమస్యపై సంఘం సభ్యులు స్కిట్ వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలకు బహుమతులు అందజేశారు.

## ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ ఆడిటింగ్

- ప్రతి 6 నెలలకు ఒకదారి ఫైర్, ఎలక్ట్రికల్ ఆడిట్.. ఏడాదికి ఒకసారి స్ట్రక్చరల్ ఆడిట్
- ఫైర్ సేఫ్టీపై సమగ్ర గైడ్‌లైన్స్, చెక్‌లిస్ట్‌తో ప్రత్యేక జీవో
- జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీలు
- రాష్ట్ర స్థాయిలో ఆరోగ్యశాఖ మంత్రి చైర్మన్‌గా మానిటరింగ్ కమిటీ
- ఫైర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్‌కు ప్రత్యేక బడ్జెట్
- సెక్రటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్షలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలును మరింత పటిష్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, బిల్డింగ్ స్ట్రక్చరల్ సేఫ్టీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదాల నివారణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రోగులు, సిబ్బందిని సురక్షితంగా తరలించేలా హాస్పిటళ్లలో వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. సెక్రటేరియట్‌లో గురువారం హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, స్ట్రక్చరల్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ప్రభుత్వ హాస్పిటళ్లలో నిర్వహించిన ఫైర్ సేఫ్టీ ఆడిట్లలో గుర్తించిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ ఆడిటింగ్‌ను రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నామని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో నెల రోజుల్లో ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్లను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆడిట్లలో గుర్తించే లోపాలను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, వాటిని సరిదిద్దేందుకు నిర్దిష్ట టైమ్‌లైన్‌తో చర్యలు చేపట్టాలని సూచించారు. ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించిన అంశాలపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆడిట్ నిర్వహించాలని, భవనాల నిర్మాణ పటిష్టతకు సంబంధించి సంవత్సరానికి ఒకసారి స్ట్రక్చరల్ ఆడిట్ నిర్వహించే విధంగా విధివిధానాలను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఆడిట్‌లో గుర్తించిన లోపాల తీవ్రతను బట్టి వాటిని అత్యవసర, తక్షణ, సాధారణ కేటగిరీలుగా విభజించి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా ప్రాణాపాయానికి దారితీసే లోపాలను ఎలాంటి జాప్యం లేకుండా సరిదిద్దాలని స్పష్టం చేశారు. హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి సంబంధించి అన్ని అంశాలను కవర్ చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్, స్టాండర్డ్ చెక్‌లిస్ట్‌తో ప్రత్యేక జీవో జారీకి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఫైర్ అలారం, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్, హైడ్రెంట్స్, స్ప్రింక్లర్ సిస్టమ్, ఫైర్ వాటర్ లైన్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్, ఎమర్జెన్సీ లైటింగ్, ఎలక్ట్రికల్ ప్యానెల్స్, వైరింగ్, డీజీ సెట్లు, ఏసీ యూనిట్లు, ఆక్సిజన్ సప్లై వ్యవస్థలు తదితర అంశాలతో పాటు ఎమర్జెన్సీ రెస్పాన్స్, ఎవాక్యుయేషన్ ప్రోటోకాల్స్‌ను కూడా చెక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. హాస్పిటళ్లలో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలు పనిచేసే స్థితిలో ఉన్నాయా లేదా అన్నది కూడా ఆడిట్‌లో తప్పనిసరిగా పరిశీలించాలని అన్నారు. హాస్పిటల్‌లోని ప్రాంతాలను సెన్సిటివ్, నాన్-సెన్సిటివ్ జోన్లుగా విభజించి ఫైర్ సేఫ్టీ ప్రోటోకాల్స్‌ను అమలు చేయాలని మంత్రి సూచించారు. ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయూలు, రేడియాలజీ అండ్ డయాగ్నసిస్ విభాగాలు, డయాలసిస్ జోన్లు, ఎమర్జెన్సీ విభాగాలు, క్రిటికల్ కేర్ ప్రాంతాలను సెన్సిటివ్ జోన్లుగా గుర్తించి ప్రత్యేక భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో ఉన్న రోగులను అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక ఎమర్జెన్సీ ఎవాక్యుయేషన్ ప్లాన్ సిద్ధంగా ఉండాలని, హాస్పిటల్ సిబ్బందికి క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, స్ట్రక్చరల్ సేఫ్టీ అంశాలపై జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

## రిమ్స్ ఘటనపై విచారణ షురూ

**మావల సెప్టెంబర్ 25 ( జనం సాక్షి):** రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్ ఆసుపత్రి) లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన ను ప్రభుత్వం సీరియస్ తీసుకుంది. ఈ ఘటనలో ఐదు గురు నవజాత శిశువులు మృత్యు వాత పడ్డారు. విచారణ అధికారులు మొదలు అగ్ని ప్రమాదానికి కారణం ఏంటి, సౌకర్యాల లేమి, అధికారుల తపిద్దాలపై అన్ని కోణాలలో పరిశీలించి వారం రోజులలో ప్రభుత్వం కు నివేదిక సమర్పినునట్లు విచారణ అధికారి పీఓ ఐటిడిఎ మకరందు తెలిపారు. ఈ బృందంలో అదనపు డిఎం అండ్ హెచ్ వో మనోహర్, విద్యుత్ శాఖ ఎస్ ఈ సుభాష్ జాదవ్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ భగవాన్ ఉన్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌పై కాల్పులు

**కడప (జనంసాక్షి) :** దువ్వూరు మండలం జగనన్న కాలనీలో ఎర్రచందనం స్మగ్లర్ పై పోలీసుల కాల్పులు కలకలం రేపాయి. మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ జాకీర్ పై చాపాడు పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదయింది. జాకీర్ దువ్వూరు సమీపంలో ఉన్నాడన్న సమాచారంతో అర్ధరాత్రి సోదాలు నిర్వహిస్తుండగా పోలీసులపై జాకీర్ తిరగబడ్డాడు. దాంతో అప్రమత్తమైన పోలీసులు స్మగ్లర్ పై కాల్పులు జరిపారు. ఘటనలో స్మగ్లర్ జాకీర్ కు గాయాలు అయ్యాయి. స్మగ్లర్ జాకీర్ ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ కు తరలించారు.

## సాహిల్ తల్లిదండ్రుల నిరాహార దీక్ష..


### ఐఐటీ బాంబే పరీక్షలు వాయిదా

విద్యార్థి సాహిల్ వాకోడే ఆత్మహత్యపై నిరసనలు వ్యక్తమవుతున్న వేళ.. మిడ్ సెమిస్టర్ పరీక్షలను ఐఐటీ బాంబే వాయిదా వేసింది. ఈ నెల 26-27 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను అక్టోబరు 10-11కు వాయిదా వేసింది. మరోవైపు.. తమ కుమారుడిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సాహిల్ తల్లిదండ్రులు ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష ప్రారంభించారు. "నా బిడ్డను వేధించిన వారిని జైలులో పెట్టాలి. విద్యాసంస్థలో తాను పదేపదే కులవివక్షను ఎదుర్కొన్నట్లు అతడు మాకు చెప్పాడు" అని సాహిల్ తండ్రి తెలిపారు. అంతకుముందు సాహిల్ తల్లిదండ్రులు 'జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్' ఛైర్మన్‌ను కలిసి.. తమ కుమారుడి మరణంపై దర్యాప్తు జరపాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మరోవైపు.. విద్యార్థి కుటుంబానికి సంఘీభావంగా ఐఐటీ బాంబే వద్దకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్, ఆ పార్టీ కార్యకర్తలు, ఎనఎస్‌యఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ప్రొఫెసర్ సూర్యనారాయణ 2024లో పంపినట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ సోషల్ విడియాలో చక్కర్లు కొడుతోంది. తోటి విద్యార్థుల అడ్మిషన్ కేటగిరీలు, జేఈఈ (అడ్వాన్స్‌డ్) ర్యాంకులు, గేట్ స్కోర్‌ల గురించి అడగొద్దని విద్యార్థులకు సూచించినట్లు అందులో ఉంది. అటువంటి ప్రశ్నలతో వారి సామాజిక వర్గం, రిజర్వేషన్ వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సాహిల్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన్ను ఐఐటీ యాజమాన్యం ఇప్పటికే సెలవుపై పంపింది.

## నాచారంలో తుపాకీతో కాల్పులకు యత్నం

- బీహార్‌లో ఆయుధం స్వాధీనం
- ముగ్గురు నిందితులు అరెస్టు

**నాచారం (జనంసాక్షి) :** నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో తుపాకీతో కాల్పులకు యత్నించిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాలతో నిందితులను బీహార్‌లో గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. మల్లాపూర్‌లోని ఉషోదయ సూపర్‌మార్కెట్ ఎదురుగా రామ్‌రెడ్డి చికెన్ సెంటర్ వద్ద ఈ నెల 3న అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి తనను దుర్భాషలాడి, వారిలో ఒకరు తుపాకీతో నుదుటిపై గురిపెట్టి కాల్చేందుకు ప్రయత్నించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తుపాకీ పేలకపోవడంతో నిందితులు ఎన్ఎఫ్‌సీ మార్గం వైపు పరారైనట్లు పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఆధారంగా అశిష్‌కుమార్ (22), శశికుమార్ (23) బీహార్ వెస్ట్ చంపారన్ జిల్లా, సందీప్ మహాజన్ (30) చండీగఢ్‌కు చెందిన వారిగా గుర్తించారు. బీఎన్ఎస్ సెక్షన్ 109 రెడ్‌విత్ 3(5), ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 25 రెడ్‌విత్ 27 కింద కేసు నమోదు చేశారు. బీహార్ పోలీసుల సహకారంతో నిర్వహించిన శోధనల్లో ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై చౌతార్వ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక కేసు నమోదైంది. స్వాధీనం చేసుకున్న ఆయుధానికి ప్రస్తుత ఘటనతో ఉన్న సంబంధంపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370